# హయవదన

(నాటకం)

మూలం

గిరీశ్ కర్నాడ్

తెలుగు సేత

మొదలి నాగభూషణ శర్మ

రచన: గిరీశ్ కర్నాడ్

అనువాదం: నాగభూషణ శర్మ

## పాత్రలు

| | |
|---|---|
| భాగవత | క్రమధాటి వెంకటేశ్వర శర్మ |
| నటుడు 1 | సి. నారాయణస్వామి |
| నటుడు 2 | హరిశ్చంద్ర |
| హయవదన | నటరాజ్ |
| దేవదత్తుదు | శేఖర్ |
| కపిలుడు | ప్రసాద రెడ్డి |
| పద్మిని | జయశ్రీ |
| కాళి | జ్యోతి |
| బొమ్మ 1 | సాయిచరణ్ |
| బొమ్మ 2 | శ్రీవత్స |
| పిల్లవాడు | |

| | |
|---|---|
| సంగీతం: | సురభి లీలాపాపారావు, విజయ కుమార్, రవిశంకర్ |
| గాయకులు: | క్రమధాటి, లక్ష్మీనరసింహరావు, విజయ కుమార్, |
| లహరి, మాధురి | |
| మేకప్: | జయశ్రీ |
| లైట్స్: | హరిశ్చంద్ర, నాగుబాబు |
| సౌండ్: | విజయ కుమార్ |
| మాస్క్స్: | నటరాజ్ |
| రంగస్థల సహాయం: | నటరాజ్ (రంగనిర్వహణ) |
| దర్శకత్వం: | నాగభూషణ శర్మ |

### ఈ నాటకంలో పాత్రలు:

భాగవత

నటుడు 1

నటుడు 2

మొదటి బొమ్మ, రెండో బొమ్మ

హయవదన

దేవదత్తుడు

కపిలుడు

పద్మిని

కాళి

పిల్లవాడు,

ఇంకా – స్త్రీల బృందగానం

చిన్న బల్ల. బల్ల మీద వినాయకుడి విగ్రహం

**భాగవత:** (వినాయక ప్రార్థన తరువాత)

విఘ్నాలన్నింటిని తొలిగించి, అన్ని ప్రయత్నాలకి విజయం చేకూర్చే ఆ విఘ్న వినాయకుడే ఈ నాటక ప్రదర్శనని కూడా విజయవంతం చేయుగాక!

అల్పమైన మన మాటలతో ఆ విఘ్నేశ్వరుడి అనల్పమైన గొప్పతనాన్ని వర్ణించడం సాధ్యమా?....మనిషి శరీరం, ఏనుగుతల! విరిగిన దంతం, పగిలిన బొజ్జ..ఏ రకంగా చూసినా అస్తవ్యస్తానికి, అసమగ్రతకి మారు పేరు అనిపిస్తాడు ఆయన..... కాని ఈ వక్రదంత మహాకాయుణ్ణే విఘ్నాలు తొలిగించి విజయాన్ని చేకూర్చే సర్వసమగ్రుడు అనడంలో ఉండే ఆంతర్యాన్ని మానవ మాత్రులం – మనమెలా గ్రహించగలం?

ఈ పవిత్ర మంగళమూర్తి తన ఈ ఆకారంతో – భగవంతుడి సమగ్ర, సర్వమంగళ రూపాన్ని తెలుసుకోగలగడం ఎంత కష్టమో మన వంటి అజ్ఞానులకు తెలియ చెప్పడం లేదు గదా?

ఏది ఏమైనా ఆ మాయా మర్మాలను గ్రహించడం మన పని కాదు. అది మనకు చేతకానూ కాదు. మనం చేయవలసిందొకటే – ఆ గజవదనుడికి అంజలి ఘటించి మన నాటకాన్ని విజయవంతం చేయమని ప్రార్థిద్దాం.

మన కథ జరిగే ఊరు ధర్మపురి అనే పట్టణం. దానిని ధర్మశీలుడనే మహారాజు పరిపాలిస్తున్నాడు. ఆయన కీర్తి దిగ్దిగంతాలకు విస్తరించింది. ఈ పట్టణంలో నివసించే ఇద్దరు యువకులు మన కథానాయకులు.

ఒకడు దేవదత్తుడు. అందగాడు. తెలివి తేటల్లో అద్వితీయుడు. బ్రాహ్మణశ్రేష్టుడు. మహా పండితుడు అయిన విద్యాసాగరుల వారి ఏకైక పుత్రుడు. దేవదత్తుడు తన దేశంలో ఉన్న పండిత ప్రకారాదులందర్నీ తర్క, వ్యాకరణ, కామ శాస్త్రాలలో ఓడించడమే కాక, తన కవితా చాతుర్యంతో దేశంలో ఉన్న గొప్ప కవులనే మట్టికరిపించాడు. ధర్మపురిలో ప్రతి ఒక్కడి కన్నూ దేవదత్తుడు మీదే!

రెండో వాడు కపిలుడు! కమ్మరి లోహితుడి కొడుకు. రథ చక్రానికి ఇరుసు ఎలానో రాజుగారి ఆయుధాగారానికి లోహితుడంత! కపిలుడు చూడ్డానికి సామాన్యంగా ఉంటాడు. కాని ధైర్యసాహసాలకి పెట్టింది పేరు. అంతేనా? కండపుష్టికి, ఆటపాటలకు, మల్లయుద్ధానికి అతనికి అతనే సాటి.

(రంగస్థలం పక్కన "అయ్యో, బాబోయ్! రక్షించండి, రక్షించండి" అంటూ అరుపులు. భాగవత అటువైపు కోపంగా చూసి)

వాళ్ళిద్దరి స్నేహాన్ని ధర్మపురి అంతా ముక్కున వేలేసుకు చూస్తూ ఉంటుంది. చెట్టా పట్టాలు వేసుకుని తిరిగే ఈ ఇద్దరు యువకుల్ని చూసి ధర్మపురి పట్నం అంతా లవకుశులనీ, రామలక్ష్మణులనీ, బలరామ కృష్ణులనీ ముచ్చట పడుతూ ఉంటుంది.

అనగనగా ఒక ఊరు
ఆ ఊరిలో ఇద్దరు స్నేహితులు

(మళ్ళీ – "అయ్యో! రక్షించండి రక్షించండి" అని అరుపులు)

ఎవరది? నాటకం మొదట్లోనే ఆటంకం కలగ చేస్తున్నారు? (చూసి) అరె! ఇతను మా నటుడే! అట్లా పరిగెత్తుకుంటూ వస్తున్నాడెందుకో?......ఏం జరిగిందబ్బా?

(నటుడు భయంతో వణుకుతూ పరిగెత్తుకుంటూ వచ్చాడు....భాగవతని చూసి ఒక్కసారిగా వాటేసుకుంటాడు.)

భాగ : (విడిపించుకునే ప్రయత్నం చేస్తూ) ఏమిటిది? ఆగు ఆగు.

నటు : అయ్యా! గురువుగారూ!.......

భాగ : వదలవోయ్, వదులు......(వదల్చుకొని) ఏమయింది? ఏమిటి?

నటు : నేను...నేను.....అమ్మో! దేవుడా, దేవుడా! (మళ్ళీ వాటేసుకుంటాడు)

భాగ : ఆగు....వదులు....(వదుల్చుకుని) ఏమిటీ గలాభా? ఈ అరవడం, ఏడవడం – ఇదంతా ఏమిటి? ఇదంతా ఈ ప్రేక్షకుల ముందా? ప్రదర్శనకి అడ్డం రావడానికి ఎంత ధైర్యం నీకు?

నటు : క్షమించండి....అయినా –

భాగ : నెమ్మది...నెమ్మది....ఇక్కడ భయపడాల్సిందేమీ లేదు. నేనున్నాను. ఇదుగో మన వాద్యగాళ్ళంతా వున్నారు. ఇంకా, కరుణా సముద్రులయిన మన ప్రేక్షకులున్నారు! ఎప్పుడైనా నాటకం జరిగేటప్పుడు అప్పుడప్పుడు నిద్రపోతే పోతారుగాని, ఎవరైనా ఆపదలో ఉన్నారంటే సాయం చెయ్యడానికి సిద్ధంగా ఉంటారు...ఇప్పుడు చెప్పు...ఏమిటి నీ భయం? శాంతంగా చెప్పు –

నటు : (రొప్పుతూ) అయ్యో....అమ్మో....నా గుండె –

భాగ : ఏమీ భయంలేదు....కూర్చో.......ఆ, ఇప్పుడు చెప్పు.....నెమ్మదిగా, శాంతంగా –

నటు : నేను.....నేను ఇక్కడికే బయలుదేరాను.....అసలే ఆలస్యం అయింది. మీక్కోపం వస్తుందేమోనని..... తొందరగా వస్తున్నాను.....వస్తున్నానా?.....అప్పుడు దారిలో అమ్మబాబోయ్.....(భయంతో మొహం కప్పుకుంటాడు)

భాగ : ఆ, ఆ! నువ్వు తొందరగా వస్తున్నావ్! సరే! అప్పుడేం జరిగిందో చెప్పు.

నటు : వస్తున్నానా.....పొద్దుట్నుంచీ ఒకటే దాహంగా ఉంటే చెంబుడు మంచినీళ్ళు ఎక్కువ తాగానండీ..... కడుపు ఉబ్బగా ఉంటేనూ – పక్కకి వెళ్ళి –

భాగ : ఏం మాట్లాడుతున్నావ్?....నువ్వు ప్రేక్షకుల ముందు ఉన్నావ్!

నటు : అయ్యో! నేనేమీ చెయ్యలేదండీ! చేద్దాం – అనుకున్నాను, అంతే! దారి పక్కన కూచుని ధోవతి కొంచెం పైకి ఎత్తానో లేదో –

భాగ : అబ్బా ఏమయింది?

నటు : ఎవరిదో ఓ గొంతు – పెద్దగా వినిపించింది. "ఏయ్! నిన్నే! నలుగురూ నడిచే దారిలో అటువంటి పనులు చెయ్యకూడదని తెలియదూ?" అంది.

భాగ : నిజమే మరి! ఆ మాత్రం తెలియద్దూ నీకు? ఆ –

నటు : సగం లేచి ఎవరబ్బా అని చూశాను....నరమానవుడు కనిపించలా! మళ్ళీ కూర్చోబోతుంటే మళ్ళీ అదే గొంతు......తీరా చూస్తే – ముళ్ళ కంచె అవతల –

భాగ : ఎవరున్నారు?

నటు : ఒక గుర్రం –

భాగ : ఎవరూ?

నటు : ఒక గుర్రం. అది మాట్లాడుతోంది!!

భాగ : పొద్దున్నే ఏం తాగావేమిటి?

నటు : ఏమీ తాగలేదండీ! ఒట్టు – వారంరోజులయిందండీ కల్లు దుకాణం చాయలకు పోయి.....చివరికి పాలు కూడా తాగలేదండీ!

భాగ : బహుశా: మంచినీళ్ళు నీ కడుపుకు పడలేదేమో!

నటు : (హతాశుడై) నా మాట నమ్మండి.......నేను నిజంగా గుర్రాన్నే చూశాను....అది మాట్లాడింది.

భాగ : సరే చెప్పినమాటే చెబుతుంటే ఏం చేస్తాను?...సరే, సరే! నువ్వు మాట్లాడే గుర్రాన్ని చూశావ్! మంచిదే! ఇహ పోయి వేషం వేసుకో!

నటు : వేషమా? అయ్యా! మీ కాళ్ళు మొక్కుతాను.....నేను వేషం వెయ్యలేను.

భాగ : ఏం?

నటు : (వణుకుతూ) చూడండి! ఈ చెయ్యి ఎట్లా వణుకుతోందో! ఈ చేత్తో కత్తి పట్టుకుని యుద్ధం చెయ్యడం ఎట్లాగండీ?

భాగ : సరే! దీని కొక్కటే పరిష్కారం ఉంది! నువ్వు తిరిగి వెళ్ళి –

నటు : తిరిగి వెళ్ళా – ?

భాగ : నువ్వు తిరిగి ఆ కంచె దగ్గరకు వెళ్ళు..వెళ్ళి జాగ్రత్తగా చూడు. అక్కడ మాట్లాడింది ఎవరైనా ఆ గుర్రం మాత్రం కాదని నీకు నువ్వే నిర్ధారణ చేసుకురా – వెళ్ళు.

నటు : అమ్మో! నేను వెళ్ళను.

భాగ : నటా!

నటు : (దీనంగా) నేను వెళ్ళలేను.

భాగ : వెళ్ళితీరాలి....ఇది నా ఆజ్ఞ.

నటు : తప్పదంటారా?

భాగ : ఆహా! తప్పదు.

నట : (నసుగుతూ) గురువుగారూ –

భాగ : ఆ –

(ప్రేక్షకుల వైపు తిరిగి)

అనగనగా ఒక ఊరు

ఆ ఊరిలో ఇద్దరు స్నేహితులు.

ఇంకా ఇక్కడే ఉన్నావేం?

(నటుడు వెడతాడు)

పాపం! పిచ్చివాడు! ఏం చూసి ఏం అనుకున్నాడో! భగవంతుడికే తెలియాలి..... ఆ చూసింది ఏం చూసినా – కేవలం భ్రమే.

(పాడుతూ)

అనగనగా ఒక ఊరు
ఆ ఊరిలో ఇద్దరు స్నేహితులు

(మళ్ళీ పక్కనుంచి అరుపులు....నటుడు పరిగెత్తుకుంటూ వస్తాడు.)

**నటు** : గురువు గారూ! వస్తోంది.....వస్తోంది....

**భాగ** : ఏమిటి వస్తోంది –

**నటు** : అదే! వస్తోంది.......కాదు, కాదు. వస్తున్నాడు.

**భాగ** : వాడు...అది!...వస్తున్నది....వస్తున్నాడు...ఏమిటిదంతా?...ఏం చూశాడో, ఎవర్ని చూశాడో తెలియదు కాని మా నటుడు మాత్రం భయపడ్డాడు. అతనిలాంటి కాకలు తీరిన మనిషే భయపడ్డాడంటే సున్నితమైన మనస్సున్న మా ప్రేక్షకులు ఇంకా భయపడొచ్చు...ఎవరోయ్ అక్కడ?...తెర అడ్డం పట్టండి.....(ఇద్దరు మనుషులు వచ్చి ఒక తెరను అడ్డంగా పడతారు.....హయవదన దాని వెనకాలకు వచ్చి నిలబడతాడు.)

**భాగ** : ఎవరది? (ఎవరో మెల్లగా నడుస్తున్న చప్పుడు) ఆశ్చర్యంగా ఉందే? ఎవరో ఏడుస్తున్నట్టుగా ఉంది? మా నటుణ్ణి భయపెట్టిన ఆ భయమే ఇప్పుడు భయపడి ఏడవడం లేదు కదా!...తెరకిందికి దించండి.

(తెర కొంచెం కిందికి దిగింది. హయవదన తలనే చూస్తాం. జనాన్ని చూచి తెర వెనక దాక్కుంది. కొంచెం కొంచెంగా తెరదిగుతుంది. హయవదన కనిపిస్తాడు. గుర్రం తల. మనిషి శరీరం.)

అరె! ఆశ్చర్యంగా ఉందే! గుర్రమే! నమ్మడానికి వీలులేకుండా ఉందే!

(తెర తీసుకుని పక్కకు పోతారు ఇద్దరూ)

(ఇందులో ఏదో నాటకం ఉందని నిశ్చయించుకుని)

ఎవరు నువ్వు?

(హయవదన తలపైకెత్తి చూసి కళ్ళు తుడుచుకుంటాడు. ముందుకు రమ్మని భాగవత సంజ్ఞ చేస్తాడు)

ఇటురా! (వస్తాడు)
నువ్వు ఆ కరాళం ఒకటి తగిలించుకునా జనం అందరినీ నువ్వు భయపెడుతున్నావ్!...దాంతో ఆగక మా నాటకానికి అడ్డం వచ్చావ్! ..ఇహ ఈ ఆగడం ఇంతతో ఆపు.....ఆ కరాళం తీసెయ్!

(హయవదన కదలడు)

తియ్యవా? అయితే ఆ పని నేనే చెయ్యాల్సి ఉంటుంది.

(హయవదన తల పట్టుకుని పైకి లాగడానికి ప్రయత్నిస్తాడు)

అబ్బో చాలా బిగుతుగా ఉందే! (నటుడితో) నటా! ఇటురా!

(నటుడు వచ్చి నోరు తెరుచుకునా నిలబడి ఉంటాడు)

ఏమిటి అట్లా నిలబడ్డావ్!......సాయం పట్టు –

(నటుడు హయవదనని పట్టుకున్నాడు. భాగవత తలని పైకి లాగుతాడు...కొంత సేపైన తరువాత భాగవతకి నిజం తెలియ వస్తుంది, క్రమంగా)

నటా! ఇది కరాళం కాదయ్యా! ఇది నిజమైన తలే!

(హయవదనని నటుడు ఒక్కసారి కుదేస్తాడు. హయవదన సరిగ్గా కూర్చుని కాళ్ళ మధ్య తలపెట్టుకుని ఉంటాడు.)

అరె! ఆశ్చర్యాలకి అంతంలేదు కదా!
ఐదు నిమిషాల క్రితం నాతో ఎవరన్నా హయవదనంతో ఒక మనిషి ఉన్నాడంటే అతని మొహం మీదే నవ్వేసేవాణ్ణి!
(హయవదనతో) ఎవరు నువ్వు?

(హయవదన లేచి బయటకు పోబోతాడు. నటుడు భయంగా తప్పుకుంటాడు.)

ఆగు, ఆగు అది మా వేషాలు వేసుకునే గది.....మా నటుణ్ణి భయపెట్టావ్, చాలదా?....ఇవ్వాళ మాకు నాటకం ఉందయ్యా!

(నిరాశతో హయవదన నిలబడి పోయాడు....సౌమ్యంగా)

ఎవరు నువ్వు? (సమాధానం లేదు)
నీకు ఈ గుర్రం తల ఎట్లా వచ్చింది? ఏ రుషిదన్నా శాపమా? ఏ పుణ్య స్థలాన్నయినా నువ్వు అపవిత్రం చెయ్యడం వల్ల జరిగిందా? ఏ పతివ్రతనన్న అవమానం చేస్తే –

హయ : ఏమండోయ్!

భాగ : (నిర్ఘాంతపోయి) ఏమండోయ్! ఆ!

హయ : ఏమిటండీ మీ ఉద్దేశ్యం? మీకు పురాణాలు తెలుసు కనుక ఆ పురాణ కథలు అందరి నెత్తినా రుద్దడమేనా? నేను ఏ దేవాలయాన్ని అపవిత్రం చేశాను? ఏ స్త్రీని –

భాగ : అంత కోపం ఎందుకయ్యా?

హయ : లేకపోతే ఏమిటండీ? ఏ రుషి? ఏ పతివ్రత? ఎవరిని అవమానించాను నేను?...(ఏడవబోతూ) నేను ఎవర్నీ ఏమీ అనే వాడిని కాదు........

భాగ : బాధపడకు. ఏం జరిగింది? నువ్వు ఎందుకు బాధ పడుతున్నావ్? నువ్వు ఏకాకివని బాధపడకు. నేనున్నాను...ఈ వ్యాగాళ్ళున్నారు...ఇంకా – విశాల హృదయులు – మా ప్రేక్షకులున్నారు....నాటకం

జరుగుతున్నప్పుడు కునుకు తీస్తారేమోకాని –

హయ : నా కర్మ ఇట్లావుంటే ఎవ్వరేం చెయ్యగలరు?

భాగ : నువ్వెవరు? నీ పేరేమిటి?

హయ : హయవదన.

భాగ : నీకీ గుఱ్ఱపు తల ఎట్లా వచ్చింది?

హయ : నేను పుట్టడమే దీనితో పుట్టాను?

భాగ : అయితే–ఇది అసలు తలే కాదని మేము లాగేటప్పుడు చెప్పలేదేం? అంత బాధను ఎందుకు భరించావ్?

హయ : ఈ జీవితమంతా ఈత ఎట్లా పోతుందా – అని ప్రయత్నం చేస్తూనే వున్నాను. కనీసం మీ మంచితనం, మీరు చేసిన పుణ్యమయినా, దీనినుంచి విముక్తి చేయగలదేమోనని, వదిలించడలనేమోనని –

భాగ : ప్చ్.....కాని హయవదనా! పుట్టుకతో వచ్చిన తలకి ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు? కిందటి జన్మలో ఏ పాపం చెయ్యడం వల్లనో –

హయ : కిందటి జన్మ కాదండీ! ఈ జన్మలో జరిగిన దాన్నే నేను వదుల్చుకోలేకుండా ఉన్నాను.

భాగ : జరిగిందేమిటో వివరంగా చెప్పు....అవమానం అనుకోకు.....

హయ : (కోపంతో) అవమానమా?......నేనెందుకు అవమానం అనుకోవాలండీ?.....

భాగ : క్షమించు.....'సిగ్గు పడకు' అనాల్సింది. జరిగిందేమిటో వివరంగా చెప్పు.

హయ : (నిట్టూర్చి) అదంతా ఓ పెద్ద కథలెండి......

భాగ : చెప్పు –

హయ : మా అమ్మ కర్ణాటక దేశరాజకుమారి. చాలా అందంగా ఉండేది. యుక్త వయస్సు రాగానే తన భర్తను తానే ఎంచుకోవాలని నిశ్చయించారు మా తాతగారు. స్వయంవరం ప్రకటించారు. ప్రపంచంలోని రాజకుమారులంతా వచ్చారు....మా అమ్మకి వాళ్ళెవరూ నచ్చలేదు. చివరికి అరబ్ దేశ రాజకుమారుడు వచ్చాడు – ఓ తెల్లటి గుఱ్ఱం స్వారీ చేస్తూ. అది చూడగానే మా అమ్మ మూర్ఛపోయింది.

నట : ఆ!

హయ : ఆ రాజకుమారుడే నచ్చాడని మా తాతగారు పెళ్ళి ఏర్పాట్లు మొదలుపెట్టారు. ఇంతలో మా అమ్మ మూర్ఛనుంచి తేరుకుని –

భాగ : ఆ! తేరుకుని?

హయ : తాను ఆ తెల్లటి గుఱ్ఱాన్ని తప్ప మరెవర్నీ పెళ్ళిచేసుకోను అంది.

నట : ఏమిటి? గుఱ్ఱాన్నా?

హయ : ఆ! ఆవిడ ఎవ్వరి మాటా వినలేదు.....చివరికి ఆ గుఱ్ఱాన్నే ఇచ్చి మాఅమ్మకు పెళ్ళి చేశారు. 15 ఏళ్ళుగా వాళ్ళిద్దరూ హాయిగా కాపురం చేశారు. ఒక రోజు పొద్దున్నే చూసే సరికి గుఱ్ఱం ఎక్కడా కనిపించలా! ఆ అశ్వం స్థానంలో ఓ దేవతా పురుషుడు!

భాగ : ఏమిటీ?

హయ : ఓ గంధర్వుడు! గతంలో ఆ గంధర్వుడు చేసిన ఏదో నేరానికి 'గుర్రం అయిపో' అని కుబేరుడు శాపం యిచ్చాడట! 15 ఏళ్ళు మానవ ప్రేమ తరువాత మళ్ళీ గంధర్వుడై పోయాడు.

భాగ : మనకి ఇటువంటి కథలు చాలా వున్నాయి! ఆ!

హయ : శాపవిమోచనం అయినాక మా నాన్న – మా అమ్మని మనం గంధర్వలోకానికి పోదాం రమ్మన్నాడట! కాని ఆవిడ ఒప్పుకోలేదు. తిరిగి గుర్రమై పోతేనే ఆయనతో వస్తానన్నదిట! అందుకు కోపం వచ్చి "నువ్వే గుర్రం అయిపో" అని మా నాన్న మా అమ్మకి శాపం ఇచ్చాడట!

నట : నిజం!

హయ : మా అమ్మ గుర్రమైపోయింది. హాయిగా గెంతుతూ ఎక్కడికో వెళ్ళిపోయింది. మా నాన్న ఆయన లోకానికి వెళ్లిపోయాడు. వాళ్ళకు పుట్టిన పిల్లవాణ్ణి – నన్ను మాత్రం – ఇద్దరూ వదిలేసి వెళ్ళిపోయారు.

భాగ : చాలా విచారకరమైన కథ!

హయ : ఇప్పుడేం చెయ్యమంటారు చెప్పండి! ఈ గుర్రపు తల పోవాలంటే నేనేం చెయ్యాలి?

భాగ : హయవదనా! మన నుదుటి రాతను తప్పించడం ఎవరి తరం?

హయ : (తన నుదురు కొట్టుకుంటూ) కాని ఏం నుదురండీ ఇదీ?...మీ నుదురు లాంటిదయితే ఏం వచ్చినా భరించేవాణ్ణి! కాని ఇది? అప్పటికీ నా కర్మ ఇంతేనని సరిపెట్టుకున్నాను...నా స్వంత విషయాల్లో ఏ మచ్చాలేదు. అందుకని మన జాతీయ కార్యక్రమాల్లో పాల్గొనడం మొదలు పెట్టాను. సమాజ శాస్త్రం, దేశభక్తి, జాతీయత, అన్నిట్లోను వేలు పెట్టాను. కాని నా కంటూ ఒక సమాజం ఎక్కడవుంది? నేనూ అందరిలా సంపూర్ణ మానవుడ్ని కావడం ఎట్లా? నేనేం చెయ్యాలి? (దీర్ఘ మౌనం)

భాగ : వారణాసి....కాశీ!

హయ : ఏమిటీ?

భాగ : అదే కాశీవిశ్వేశ్వరుణ్ణి కొలిస్తే –

హయ : వెళ్ళొచ్చాను.......లాభం లేకపోయింది.

భాగ : రామేశ్వరం?

హయ : ఆహా! కాశీ, రామేశ్వరం, గోకర్ణం, హరిద్వార్, గయ, కేదారనాథ్.....అంతేనా? ఖ్వాజా యూసఫ్ బాబా దర్గా, మేరీమాత దేవాలయం...అన్నీ – అన్ని చోట్లకీ వెళ్ళాను. మంత్రగాళ్ళు, మహర్షులు, ఫకీర్లు, సాధువులు – జుట్టు లేని సాధువులు, గడ్డాలూ మీసాలూ పెంచిన సాధువులు, తెల్లబట్టల సాధువులు, కాషాయ బట్టల సాధువులు – నిలబడి తపస్సు చేసేవాళ్ళు, బల్లాల మీద, గాలిలో, గిరికీలు కొడుతూ – ఎక్కడ తపస్సు చేసే సాధువులు కనిపించినా అందరికీ మొక్కాను. ప్చ్.....దాని వల్ల ఏం జరిగిందో తెలుసా?....ఎక్కడికి వెళ్ళాలన్నా తలకు ముసుగు వేసుకోవాల్సి వస్తుంది. ఎప్పుడు ముసుగుమీద ఉండడంతో బట్టతల కూడా వస్తోంది...మీకో విషయం తెలుసా? నాకు ఈ తల అంటే అసహ్యం.......కాని ఈ జూలు ఉందే! అదంటే ఎంతో ఇష్టం! అందుకనే – తిరుపతి మాత్రం వెళ్ళలేదు.

భాగ : ఇప్పుడు నాకనిపిస్తుంది...పోనీ చిత్రకూటంలో ఉన్న కాళీమాతను కూడా ఒకసారి చూస్తే –

హయ : మీరేం చెప్పినా చేస్తాను.

భాగ : ఆవిడ గుడి చిత్రకూట పర్వతం మీద ఉంది. రాత్రనక పగలనక ఎల్లవేళలా భక్తుల మొరలు అలించి, వాళ్ళ కోరికలు నెరవేర్చే దేవత అంటారు. ఒకప్పుడు వేలకువేల జనం వెళ్ళేవారు. ఇప్పుడైతే ఎవ్వరూ వెళ్ళడం లేదు.

హయ : ఏం? ఎందుకని?

భాగ : భక్తులు ఏ కోరిక కోరినా ఆవిడ తీర్చేదిట! అందుకని భక్తులు వెళ్లడం మానేశారు.

హయ : బుద్ధిలేని జనం.

భాగ : నువ్వెందుకు ప్రయత్నం చెయ్యకూడదు?

హయ : (గంతులేసి) తప్పకుండా.....నేను వెంటనే బయలుదేరుతాను.

భాగ : బావుంది. కాని, నువ్వు ఒంటరిగా వెళ్ళకూడదని నా ఉద్దేశ్యం. అది భయంకరమైన దారి.....నువ్వు ఒంటరిగా వెళ్ళలేవు. చాలామందిని అడగాలి దోవలో. అందుకని – (నటుడిని చూసి) నువ్వు వెళ్ళు వెంట.

నటు : నేనా?

భాగ : నువ్వే! నువ్వు ఆయన్ని ఇందాక అవమానించావుగా! దానికి బదులుగా –

హయ : కాని స్వామి! అతని సభ్యత –

నట : అదుగో! ఆయనే నన్ను అవమానిస్తున్నాడు!....ఆయన దారేదో ఆయన్ని చూసుకోమనండి...నాకేమీ సంబంధం లేదు.

భాగ : అదుగో, అదుగో! మనలో మనం పోట్లాడుకోవద్దు. (నటుడితో) నువ్వు అవమానమని ఎందుకనుకుంటున్నావ్? చూడు! నిజానికి నువ్వు అతన్ని అభినందించాలి.....అత్యవసర పరిస్థితుల్లో కూడా అతను తన పౌర ధర్మాన్ని మరిచిపోలేదు చూశావా? అందుకని అతనితో వెళ్ళు.....

హయ : (నటునితో) నన్ను తప్పుగా అర్థం చేసుకోకండి. మీకేమీ ఇబ్బంది కలిగించనుగా! ఒట్టు!!..(భాగవతతో) మీకు మాత్రం ఎప్పటికీ కృతజ్ఞుణ్ణి!!

భాగ : (హయవదనని ఆశీర్వదిస్తూ) భగవంతుడు నువ్వు కోరుకునే సమగ్రతను నీకు ప్రసాదించుగాక!

(హయవదన, నటుడు వెళ్ళిపోతారు.)

ఎవరి కర్మ వాళ్ళది. ఎవరి కోరికలు వాళ్ళవి...
ఇహ మన కథలోకి చూద్దామా?

అనగనగా ఒక ఊరు
ఆ ఊరిలో ఇద్దరు స్నేహితులు......

(ఒకడు స్టేజిమీద ఒక కుర్చీ వేస్తాడు. దేవదత్తుడు అందులో కూర్చున్నాడు. లేతరంగు కరాళం ఉంది. ఆలోచనలో ఉన్నాడు. కపిలుడు వచ్చాడు. మంచి దృఢకాయుడు. ముద్ద నలుపు రంగు కరాళం)

కపిల : (వస్తూనే) నిన్న సాయంకాలం నువ్వు వ్యాయామశాలకు ఎందుకు రాలేదు? రమ్మన్నాను గదా!...భలే తమాషా జరిగిందిలే!

దేవ : ఏదో పనివుండి – (పరధ్యానంగా)

కపిల : రావలసింది. గాంధార దేశం నుంచి ఓ మల్ల యోధుడు వస్తున్నాడని చెప్పానుగా! దేశం అంతట్లో గొప్పవాడుట! వచ్చాడు...అతను వచ్చేసరికి నేను, నందుడు కుస్తీ పడుతున్నాం...నేను నందుడిని మొసలిపట్టుతో పట్టుకునే సరికి అతను ఒకటే చప్పట్లనుకో!...ఏమన్నాడో తెలుసా?

దేవ : (వినడం లేదు....ఇప్పుడు ఈ లోకంలోకి వచ్చి) ఆ! అప్పుడు?

కపిల : అప్పుడేమిటి?

దేవ : (తడబడుతూ) అదే! నందుడేం చేశాడు?

కపిల : (నవ్వుతూ) నందుడా? వేణువు ఊదాడు!

దేవ : అహ..నందుడు... కాదు...కాదు.. గాంధారదేశం యోధుడు....ఏదో అన్నాడన్నావుగా!

కపిల : నాతో కొంచెంసేపు మల్లయుద్ధం చేసి, నా భుజం తట్టి నువ్వు బాగా పైకొస్తావ్ – అన్నాడు.

దేవ : బావుంది......

కపిల : అవును...(మొహంలోకి చూస్తూ) ఈసారి ఎవరు?

దేవ : ఏ....ఏమిటి?

కపిల : ఏమిటా?....ఏమిటంటే....ఈ సారి.......ఎవరు?

దేవ : ఎవరేమిటి?

కపిల : అదే! ఆ అమ్మాయి ఎవరు?

దేవ : ఎవరూ లేరు. (కాసేపాగి) నువ్వెట్లా గ్రహించావ్?

కపిల : పిచ్చి దేవదత్తా! ఈ రెండేళ్ళలో నువ్వు ప్రేమలో పడడం పదిహేను సార్లు చూశాను....ఆ మాత్రం గ్రహించలేనా?

దేవ : అదుగో! నన్ను ఆట పట్టించడానికి వచ్చావా?

కపిల : లేదు, లేదు. ప్రతిసారీ నువ్వే వచ్చి చేప్పేవాడివి....ఈ సారి అంత సిగ్గెందుకోయ్?

దేవ : ఇది వరకు వాళ్ళని ఈ అమ్మాయితో పోల్చి మాట్లాడతావేం? ఈ అమ్మాయి ముందు వాళ్ళు –

కపిల : సూర్యుడి ముందు దివిటీలు; దీపం ముందు మిణుగురు పురుగులు.....నిజమే! కాని ఈ పదిహేనుసార్లు కూడా అట్లాగే అన్నావ్?

దేవ : (కోపంగా) నా మానాన నన్ను ఒదిలి ఇంటికి పోరాదూ?

కపిల : ఎందుకంత విసుగు?

దేవ : ఊరికే స్నేహితుణ్ణి, స్నేహితుణ్ణి అంటావు...నన్ను మాత్రం అర్థం చేసుకోవు.

కపిల : నువ్వు నన్ను అర్థం చేసుకున్నావా? అర్థం చేసుకుని ఉంటే, నా మీద ఇట్లా కోపం వస్తుందా? ..నీ కోసం ఏమన్నా చేస్తానని నీకు తెలియదూ?..బావిలో దూకనా? నిప్పుల మీద నడవనా?......మా అమ్మ నాన్నా కూడా నాకు నీ అంత దగ్గర కాదు. వాళ్ళని వదిలెయ్యమని ఒక్క మాట చెప్పు తక్షణం వదిలేస్తాను.

దేవ : మళ్ళీ మొదలెట్టావా? ఈ మాట ఇప్పటికి లక్షసార్లు చెప్పావు!

కపిల : మళ్ళీ మళ్ళీ చెబుతాను....నువ్వు లేకపోతే నేను మా దొడ్లో ఉండే పశువుల్లా ఉండేవాడిని. కవిత్వం, సాహిత్యం – అనేవి ఉన్నాయని నాకు చూపించిన వాడివి నువ్వు.......ఎన్ని పాఠాలు చెప్పావ్?

దేవ : ఇహ ఇంటికి పోతావా?...నేనిప్పుడు ఒంటరిగా ఉండాలి. ఒంటరిగా!.....వచ్చిన దగ్గరనుంచీ వసపిట్టలా ఊరికే వాగుతూ వుంటావ్! కవిత్వం, సాహిత్యం – వీటిని గురించి నీకేం తెలుసునని మాట్లాడుతున్నావ్? నీ కమ్మరి పనేమిటో అది చూసుకో –

కపిల : (బాధపడుతూ) నిజంగానే వెళ్ళమంటున్నావా?

దేవ : అవును.

కపిల : సరే! నీక్కావలసింది అదే అయితే – (వెళ్ళబోతాడు)

దేవ : కూర్చో – (కపిలుడు, దేవదత్తుడి పక్కనే కింద కూలబడ్డాడు)
మాట్లాడకు

(దేవదత్తుడు కిందకు దిగి కపిలుడి పక్కన కూర్చుంటాడు. కపిలుడు బలవంతాన కుర్చీ మీద కూర్చో బెడతాడు.)

నువ్వు పట్టుకుంటే వదలవు.....వియ్యపురావి జీడివి....పెయ్యబంకవి

(కాసేపు నిశ్శబ్దం.)

దేవ : (మెల్లగా) ఆ అమ్మాయిని ఎంతని వర్ణించగలను కపిలా? ఆ అమ్మాయి ముంగురులు భ్రమరాల గుంపులు.......ఆమె మొహం –

కపిల : తెల్ల కలువ.....ఆవిడ అందం ఒక అద్భుత సరోవరం. ఆవిడ చేతులు కలవ తూడలు –

దేవ : ఆగు...... ఇంతకాలం నేనెంత గుడ్డివాణ్ణో తెలుస్తుంది. నాకు కవిత్వం తెలుసుననుకున్నాను...ఏమీ తెలియదు నాకు.......తన్వీశ్యామా –

ఇద్దరూ కలిసి :

తన్వీశ్యామా శిఖరిదశనా పక్వ బింబాధరోష్టి – మధ్యేక్షామా –
చకిత హరిణీ ప్రేక్షణా – నిమ్న నాభి: –

దేవ : కాళిదాసు సుమనోహరమైన ఊహల్లోను, వాత్స్యాయనుడి అందమైన కలల్లోను ఆవిర్భవించిన శ్యామనాయిక!.....కపిలా! ఒక్క చూపులోనే శృంగార కవిత్వంలో నాకు గురువు గారయింది. ప్రేమలో నాకు సహచారిణి కావడానికి ఏనాటికయినా ఒప్పుకుంటుందంటావా?

కపిల : (స్వగతం) ఇదేదో కొత్తగా ఉందే!

దేవ : (మెరుస్తున్న కళ్ళతో) ఆమె నా ప్రేమ దేవత కాడానికి ఒప్పుకుంటే నేను కాళిదాసునే మించిపోగలను..... ఒకప్పుడు ఆ కోరిక నెరవేరేది కాదనుకున్నాను. కాని ఇప్పుడేం అనిపిస్తోందో తెలుసా?......అది ఎంతమాత్రమూ అసాధ్యం కాదని.

కపిల : అయితే యింకేం? కావ్యం రాసేయ్......

దేవ : ఆమె నా ముందు లేకుండా రాయడం ఎలా? నా మనసు, నా శరీరము, అన్నీ ఆ అమ్మాయిని

గురించే ఆలోచిస్తు వుంటే – అలమటిస్తూ వుంటే – ఇక రాత మీద గురి కుదరడం ఎలా?

కపిల : ఆవిడ పేరేమిటి?

దేవ : ఆవిడ పేరా?...ఆమెకి పేరు లేదు.

కపిల : పోనీ, వాళ్ళ అమ్మానాన్న ఏమని పిలుస్తారు?

దేవ : (నిట్టూర్చి) ఏం లాభం? నా లాంటివాళ్ళకి అదేం పిల్ల కాదు, ఆమె.

కపిల : నిజంగానే అంటున్నావా? నీ గుణగణాలు, నీ పాండిత్యం, నీ వంశం, నీ అందం, నీ మంచితనం–

దేవ : నీ పొగడ్తలతో నన్ను ఓదార్చాలని చూడకు.

కపిల : నిన్ను పొగడ్డం లేదు.....ఈ ఊళ్ళో పెళ్ళీడులో ఉన్న అమ్మాయిల నాన్నలందరి కళ్ళూ నీమీదే ఉన్నాయని నీకు తెలియదూ?

దేవ : కాని ఈమె విషయం వేరు....ఈమె నా కలల్లోకి కూడా రానంత దూరంలో ఉంది....కాని, ఆమెను కావాలనుకోకుండా ఉండలేకపోతున్నాను....కపిలా! నీ ముందు ఒట్టువేసుకు చెబుతున్నాను....నువ్వే సాక్షివి..... ఆమె నాకు భార్యగా లభిస్తే – కాళి అమ్మవారికి నా రెండు చేతులూ కానుకగా ఇస్తాను......ఈ నా తలని రుద్రుడికి బలి ఇస్తాను.

కపిల : చ్..చ్.....చ్..(తనలో) ఇదేదో చాలా ప్రమాద కరమైన ప్రేమలా ఉందే! చివరికి ఈ పదహారో అమ్మాయి దేవదత్తుణ్ణి తన వలలో చిక్కించుకున్నదన్న మాట! లేకపోతే, దేవదత్తుడేమిటి, ఇంత కటువుగా, ఉద్వేగంగా మాట్లాడ్డమేమిటి?

దేవ : నేనే నిజం చెబుతున్నాను కపిలా! ఆవిడను పొందలేని ఈ చేతులు, ఈ శిరస్సు ఎందుకు? ఆమె లేకుండా నా కవిత్వానికి ప్రాణం లేదు. ఆమె లేకుండా శాకుంతలం కంటె గొప్ప కావ్యం రాయలేను...ఈ సంగతి ఆమెకు తెలియడం ఎలా?... సందేహం తీసుకు పోవడానికి నాకు మేఘం లేదు సరే, దారి చూపడానికి తుమ్మెదలూ లేవు గదా! ....ఇహ నేను చేయగలిగిందల్లా పావన వీధిలో నిలబడి తపస్సు చెయ్యడమే!

కపిల : పావన వీధిలోనా? అక్కడెందుకు?

దేవ : ఆమె ఆ వీధిలో ఉంటుంది కనుక.

కపిల : నీ కెట్లా తెలుసు?

దేవ : నిన్న ఆమెని అంగడి వీధిలో చూశాను. నా కళ్ళను ఆమెనుంచి మరల్చుకోలేక పోయాను. ఆమెతో పాటే వాళ్ళింటి దాకా వెళ్ళాను.

కపిల : ఛ! ఛ! చూసిన వాళ్ళేమనుకుంటారు?

దేవ : పావన వీధిలో ఒక ఇంట్లోకి వెళ్ళిందామె. సాయంకాలం అంతా ఆమె బయటకు వస్తుందేమోనని చూస్తూనే వున్నాను. ప్చ్....రాలేదు.

కపిల : సరే! ఈ విషయం చెప్పు.....ఈ ఇల్లు ఎలా ఉంది?

దేవ : నాకు జ్ఞాపకం లేదు.

కపిల : ఏ రంగులో ఉంది?

దేవ : తెలియదు.

కపిల : పోనీ ఎన్ని అంతస్థులు?

దేవ : చూడలేదు.

కపిల : ఆ ఇంటి సంగతులేమీ తెలియదన్న మాట!

దేవ : ఆ ఇంటి తలుపుపైన రెండు తలల పక్షి బొమ్మ ఉంది. అదొక్కటే చూశాను. తలుపు తట్టడానికి ఆ బొమ్మని ముట్టుకుంది ఆమె...క్షణం సేపు ఆ పక్షికి ప్రాణం వచ్చినట్టుంది.

కపిల : ఆ సంగతి చెప్పవేం? ఎంత అమూల్యమైన కాలం వృధా చేశావు? ఉండు –

దేవ : నా కర్థం కావడం లేదు.

కపిల : ఓ నా పిచ్చి దేవదత్తా! నీ మేఘం, నీ తుమ్మెద, నీ పావురం....ఇదుగో! నీ ముందే ఉన్నాడన్న సంగతి కూడా నీకు తెలియదు.....అంతేనా? నువ్వు ఇక్కడే వుండు....నేను వెళ్ళి ఆ ఇల్లు కనుక్కుని, ఆమె పేరు –

దేవ : (నమ్మలేనట్లు) కపిలా.....కపిలా.......

కపిల : క్షణంలో తిరిగొస్తా.

దేవ : కపిలా! నీ మేలుని నేను ఈ జన్మలో మరిచిపోలేను.

కపిల : నోరు మూసుకో! ఇహ నీ తల, చేతులు, దేవుళ్ళకివ్వడం మరిచిపో. ఈ పని కోసం రుద్రుడు, కాళి అక్కర్లేదు. నేను చాలు. (త్వరగా బయటకు వెడతాడు.)

దేవ : కపిలా! కపిలా!!........అరె! వెళ్ళిపోయాడే! ఇటువంటి స్నేహితుడు దొరకడం ఎంత అదృష్టం? మేలిమి బంగారం!! (కొంచెం ఆగి) కాని ఈ విషయంలో కపిలుడ్ని నమ్మి ఉండవలసింది కాదు...మంచి చేద్దామనుకునే వాడే! తన కమ్మరి పనిలో, పొలం పనిలో, తోట పనుల్లో దిట్టే! కాని ఇక్కడ?.....ఇక్కడ.....అతను చాలా మోటు మనిషి. సున్నితం అంటే తెలియదు...అటువంటి వాడిని ఇటువంటి పనిమీద పంపడం మంచిది కాదేమో! మెత్తం అంతా పాడు చేసుకు వస్తాడో ఏమో! (బాధపడుతూ) రుద్రదేవా! నేను మళ్ళీ ప్రమాణం చేస్తున్నాను. నాకు ఆమె దక్కితే నా శిరస్సును నీకు బలి ఇస్తాను. అమ్మా, కాళీ! నా చేతులు నీకు కానుకగా ఇస్తాను......నేను ఒట్టేసుకు చెబుతున్నాను.......

(బయటకు వెడతాడు. భాగవత కుర్చీ తీసేస్తాడు.....కపిలుడు వస్తాడు.)

...........................

కపిల : ఇదే పావన వీధి! అందరూ పేద్ధ వ్యాపారస్థులు!! ఏం భవంతులు! ప్రతీదీ రాజప్రాసాదమే! వీటిల్లో జనం తప్పిపోకుండా ఎట్లా వుంటారో? (ప్రతి మలుపు జాగ్రత్తగా చూస్తూ) ఊ.....ఇది రెండుతలల పక్షికాదు. ఇది గరుడపక్షి...ఇదీ? తామరపువ్వు..ఇదేమో, పెద్దపులి...రథ చక్రం...ఇదేమిటో దేవుడికే తెలియాలి...ఇది గుర్రం....సింహం...మరో తామరపువ్వు....ఎక్కడుంది ఈ రెండు తలల పక్షి? ఇదేమిటబ్బా? తెలిసి ఏడవడం లేదు...(ఎగిరి గంతేసి) ఆ! ఇదే రెండు తలల పక్షి! ఒక్క క్షణంలో నా కళ్ళు కప్పేసేదే! ఎంత చిన్నగా ఉంది!.. ఎవరిదో ఈ ఇల్లు? కనుచూపు మేరలో ఎవరూ లేరే!..ఆ! ఇంట్లో వాళ్ళనే అడిగితే పోలా? (తలుపు తట్టిన చప్పుడు)

(పద్మిని వస్తుంది, ఏదో కూనిరాగం తీస్తూ)

పద్మిని : ఎవరు? ఎవరు కావాలి?

కపిల : (నిర్ఘాంతపోయి తనలో) దేవదత్తా! నీ నిర్ణయానికి జోహారు! మా ఊరి నాటకంలో రంభ వేషం వేసే రాగిణి కన్న అందగత్తెలు లేరనుకున్నాను...కాని ఈవిడ! నువ్వు చెప్పిందే నిజం! ఈవిడ యక్షిణి, శకుంతల, ఊర్వశి, ఇందుమతి – అందర్నీ కలిపి పోతపోసిన పుత్తడి బొమ్మ!!

పద్మిని : మీరేనా తలుపు కొట్టింది?

కపిల : ఆ! అవును.

పద్మిని : మరి అట్టా గుడ్లప్పగించి చూస్తారేం? ఏం కావాలి?

కపిల : ఆ...ఈ.....ఈ ఇల్లెవరిదో తెలుసుకుందామని.

పద్మిని : ఏ ఇల్లు?

కపిల : ఇదే!

పద్మిని : ఓహో! అయితే ఈ ఇంట్లో ఎవరు కావాలి మీకు?

కపిల : ఈ యింటి యజమాని –

పద్మిని : మీ కాయన తెలుసా?

కపిల : ఊహూ....

పద్మిని : ఆయన్ని చూశారా?

కపిల : లే...లేదు.

పద్మిని : మీరాయన్ని ఎరుగరు, చూడలేదు...మరి ఆయనతో పనేమిటి?

కపిల : (తనలో) ఈవిడ చెప్పింది నిజమే! నాకు ఆయనతో పనేమిటి? ఆయన పేరు తెలుసుకోవడమేగా?

పద్మిని : మీకు కావలసింది ఈ ఇల్లేనా? లేక, పొరపాటున –

కపిల : కాదు కాదు. నాకు కావలసింది ఈ ఇల్లే?

పద్మిని : (తల చూపుతూ) ఇది బాగానే వుందా?

కపిల : (నిర్ఘాంతపోయి) ఆ......ఆ.....అనుకుంటా.....

పద్మిని : మీకు కళ్ళు బాగా కనిపిస్తున్నాయా?

కపిల : ఆ!

పద్మిని : (వేళ్ళు చూపుతూ) ఇవి ఎన్ని వేళ్ళు?

కపిల : నాలుగు.

పద్మిని : సరిగ్గానే చెప్పారే! అయితే మీ కళ్ళకేమీ లోపం లేదన్నమాట! (తలను చూపిస్తూ) దీన్ని గురించి – ప్చ్ – మీ మాట నమ్మక తప్పదు...సరే! మీకు కావలసింది ఈ ఇల్లే అయితే వీధిలో ఉన్న ఇళ్ళ తలుపులన్నీ చూస్తున్నారెందుకు?

కపిల : (బిత్తరపోయి) మీకెట్లా తెలుసు?

పద్మిని : నాకు పచ్చీ లేదు, చత్వారమూ లేదు. అందుకని.

కపిల : (పైకి చూసి నవ్వి) పై వరండాలోంచి నన్ను చూస్తున్నారన్నమాట!

పద్మిని : (గొంతు తగ్గించి) చూడండి. మీరు జాగ్రత్తగా ఉండడం మంచిది. ఈ వీధిలో చాలా దొంగతనాలు జరుగుతున్నాయి. జనం ఎవర్నయినా అనుమానించేటట్లుగా ఉన్నారు. కిందటి రాత్రి వేళ ఓ మనిషి అక్కడ రెండు గంటలు నిలబడ్డాడు, కదలకుండా...ఇవాళ మీరొచ్చారు! నేను చూడడం మంచిదయింది. మరోకళ్ళయితే మిమ్మల్ని వెంటనే రక్షకభటులకు అప్పచెప్పేవాళ్ళు...జాగ్రత్త! (బిగ్గరగా) ఇప్పుడు చెప్పండి....మీ కిక్కడేం కావాలి?

కపిల : నేను.....నేను.....మీకు చెప్పకూడదు.

పద్మిని : మరి ఎవరికి చెబుతారు?

కపిల : మీ నాన్న గారికి –

పద్మిని : మీకు మా నాన్న కావాలా? ఈ ఇంటి యజమాని కావాలా?

కపిల : వాళ్ళిద్దరూ ఒకళ్ళు కారా?

పద్మిని : చూడండి....మా నాన్న ఈ ఇంట్లో సేవకుడు కావచ్చు. ఈ ఇంటి యజమాని మా నాన్న సేవకుడు కావచ్చు. మా నాన్న ఈ యజమానికి తండ్రో, అన్నో, బాబాయో, అల్లుడో, తాతో – ఎవరైనా కావచ్చు. ఏమంటారు?

కపిల : (బిత్తరపోయి) ఆ!..అవును అవును.

పద్మిని : అయితే మళ్ళీ మొదలుపెడదాం. ఎవర్ని పిలవమంటారు?

కపిల : మీ నాన్న గారిని.

పద్మిని : ఒకవేళ ఆయన ఇంట్లో లేకపోతే –

కపిల : ఎవరో ఒకర్ని –

పద్మిని : ఏ ఎవరో ఒకర్ని?

కపిల : పోనీ మీ అన్నయ్యని –

పద్మిని : ఆయన మీకు తెలుసా?

కపిల : ఊహూ....

పద్మిని : ఎప్పుడన్నా కలిసారా?

కపిల : ఊహూ..

పద్మిని : ఆయన పేరన్నా తెలుసా?

కపిల : (నిస్పృహతో) ఏమండీ..మీ నాన్నగారినో, ఈ యింటి యజమానినో, లేక ఆ యిద్దర్నో, వాళ్ళిద్దరూ ఒకరే అయితే ఎవరో ఒకర్ని – దయచేసి ఎవరో ఒకర్ని పిలవండి.

పద్మిని : ఆహా....ఆ పప్పులేం ఉడకవు.

కపిల : (చుట్టూ చూస్తూ) ఎవ్వరూ లేరే ఇక్కడ! ఆవిడ పేరు కూడా తెలుసుకోలేదు. అక్కడేమో దేవదత్తుడు ఏం బాధ పడుతున్నాడో ఏమో? ఈ పళాన వెడితే ఇహ జన్మలో నా ముఖం చూడదు. (పద్మినితో) చూడండి... ఎవరో ఒకరిని పిలవండి. నాకు చాలా అవసరమైన పనివుంది.......మీ కాళ్ళు పట్టుకుంటాను.

పద్మిని : నిజంగా! పట్టుకుంటారా? చూడండి.......నేను ఎప్పుడో ఒకప్పుడు ఈ ఇంట్లో ప్రతివాళ్ళ కాళ్ళు

పట్టుకున్నాను. కాని ఎవ్వరూ ఇంతవరకు నా కాళ్ళు పట్టుకోలేదు...మీరు, నిజంగా –

కపిల : (తలమీద కొట్టుకుని, కూర్చుండిపోతూ) అయిపోయింది. నా పని అయిపోయింది. చితక కొట్టేసింది. పిండిపిండి చేసింది.....(పైకి) తల్లీ! కనీసం ఈ ఇంట్లో ఉండే పనివాడినయినా కలవచ్చా?

పద్మిని : నాకు తెలుసు.....నాకు తెలుసు మీరు నా కాళ్ళు పట్టుకోరని. కొత్తవాళ్ళని కూడా నమ్మడానికి వీలు లేని రోజులు వచ్చాయిగదా!

పద్మిని : సరే నా చిట్టితండ్రీ! నేను తలుపు తీశాను కనుక నన్ను ఈ ఇంటికి కాపలా మనిషి ననుకో......ఏం కావాలి నీకు?

కపిల : (కృతనిశ్చయంతో) సరే! (కొంచెం ఆగి) ఈ ఊళ్ళో విద్యాసాగరులనే గొప్ప బ్రాహ్మణ విద్వాంసులున్నారు.

పద్మిని : ఉండొచ్చు –

కపిల : అట్లా అయితే, ఆయన ఒక్కగానొక్క కొడుకు దేవదత్తుడు గురించి కూడా తెలిసి వుండాలి. కవి, పండితుడు, వేదాల్ని వెనకనుంచి ముందుకు చదవగలడు. అద్భుతంగా కవిత్వం రాయగలడు.....నల్లటి పొడుగంటి జుట్టు. బహు అందగాడు. ఇరవైఏళ్ళు. అయిదడుగుల ఏడంగుళాల పొడుగు. బరువు.

పద్మిని : ఆగండాగండి......ఇంతకీ ఆయనేమవుతాడు మీకు?

కపిల : స్నేహితుడు...ప్రపంచంలో అందరికన్నా దగ్గరివాడు.....కాని ఇప్పుడు తేల్చుకోవలసిందేమిటంటే – అతను మీకేం కాబోతున్నాడు – అని. (నిశ్శబ్దం)

(పద్మినికి ......ఆ మాటల అర్ధం తెలిసాక......"అమ్మా!" అంటూ లోపలికి వెడుతుంది, సిగ్గుపడుతూ)

కపిల : (వెడుతున్న పద్మిని వంక చూస్తూ) దేవదత్తా! మిత్రుడా........నిజం చెప్పాలంటే నా కొంచెం ఇబ్బందిగానే వుంది. నువ్వేమో అతి సుకుమారుడివి......ఒక్క పరుషమైన మాటని, చెడుతలపును భరించలేవు...మరి, ఈవిడని చూద్దామా? మెరుపు తీగెలాంటి మనిషి.....అంత పదునైనది కూడా. ఫ్చ్...నీ వంటి వాళ్ళకు కాదోయ్ ఈవిడ!...ఈవిడకి ఉక్కు లాంటి మనిషి కావాలి......కాని ఏం చెయ్యగలను? నేను చెప్పినా నువ్వు వింటావా?.....ఇప్పుడు నేను వెనక్కు తిరిగి వెళ్ళడం కుదరదు. ఈ ఇంట్లోకి వెళ్ళి వాళ్ళ వాళ్ళతో మాట్లాడాల్సిందే! (లోపలికి వెడతాడు)

భాగ : తరువాత ఏం జరిగిందో సర్వమూ తెలిసిన మా ప్రేక్షకమహాశయులకు చెప్పాలా? పద్మిని ధర్మపురిలో ఉన్న ఓ పేద్ధ వ్యాపారస్తుడి కూతరు. దేవదత్తుడు మహాపండితుడైన విద్యాసాగరుల వారి కుమారుడు. వాళ్ళింట్లో సాక్షాత్తు ఆ ధనలక్ష్మే వచ్చి ఇల్లు శుభ్రం చేసిపోతుందంటారు...ఇవతల దేవదత్తుడి ఇంట్లో విద్యాదేవతే వచ్చి సేవ చేసిపోతుంది...ఇహ వాళ్ళిద్దరి కుటుంబాలు వియ్యమందడానికి ఆటంకం ఏముంటుంది?

(పెళ్ళిసంగీతం)

పద్మిని దేవదత్తుడి అర్ధాంగి అయి ఆ ఇంట్లో స్థిరపడ్డది. దేవదత్తుడు కూడా కపిలుడు చేసిన సాయాన్ని మరిచిపోలేదు. వాళ్ళిద్దర్ని స్నేహం ఇది వరకు లానే గట్టిగా పెనవేసుకుపోయి వుంది.

దేవదత్తుడు–పద్మిని–కపిలుడు! వాళ్ళను చూసి ఆనందించే ధర్మపురి ప్రజలకి రాముడు, సీత, లక్ష్మణుడు!! వారిని చూస్తే కన్నుల పంటే!

(దేవదత్తుడు, పద్మిని వస్తారు)

పద్మిని : (కిటికీలోంచి చూస్తూ) కపిలుడేడీ? ఎందుకిత ఆలస్యం చేశాడు? గడియకిందే రావలసినవాడు!

దేవ : నీ బట్టలన్నీ సర్దుకున్నావా?

పద్మిని : పొద్దున లేవగానే చేసిన పని అదే!

దేవ : పరుపలు, దుప్పట్లు, అవీ? బయటపడుకోవలసి వస్తుందేమో? చలిగా కూడా ఉంది.....కనీసం రెండు రగ్గులయినా కావలి..

పద్మిని : మీరేమీ గాబరాపడకండి. పనివాళ్ళు అవన్నీ చేసేశారు.

దేవ : నీ శాలువా? చలిబట్టలు?

పద్మిని : ఏమయింది మీకు ఇవాళ? మామూలు అప్పుడు మీరు, మీ పుస్తకాలు! అన్నం తిని చెయ్యికడుక్కోవడం కూడ మరిచిపోతారు. ఇవాళ లేచిందగ్గర్నించి ఊరికే ఇదై పోతున్నారు!

దేవ : పద్మినీ! ఇప్పటికీ పదిసార్లు చెప్పాను – ఈ ప్రయాణం నాకు ఇష్టం లేదని. నువ్వు ఒట్టి మనిషివి కూడా కాదు. విశ్రాంతి తీసుకోవాలి నువ్వు. ఇటువంటి కష్టమైన ప్రయాణాలు చేయకూడదు.....దారి ఏమో బొత్తిగా బావుండదు. బండి గతుకుల్లో పడినప్పుడల్లా భూకంపం వచ్చినట్టు దడదడలాడుతుంది...నువ్వున్న పరిస్థితిలో అది చాలా ప్రమాదం....నువ్వేమో నా మాట వినవాయే!

పద్మిని : నా పరిస్థితా?.....నా కేమయింది ఇప్పుడు? మీ మాటలు వింటుంటే ఈ ప్రపంచంలో కడుపుతో ఉన్న మొట్టమొదటి ఆడదాన్ని నేనేననుకుంటారు.....నేను కొంచెం తూలితే చాలు, అంతా అయిపోతున్నట్లు తత్తరపడతారు......

దేవ : అబ్బా! కాసేసు ఆపుతావా?

పద్మిని : (నవ్వుతూ) సరే, సరే! (నాలిక్కరుచుకుని) ఇహ ఇటువంటి మాటలంటే ఒట్టు!!

దేవ : నీకు ఏం అనొచ్చో ఏం అనకూడదో కూడా తెలియదు. ఏమిటి చిన్నపిల్లలా – నోటికి ఏదొస్తే అది మాట్లాడడం –

పద్మిని : (మళ్ళీ కిటికీ దగ్గరకు పోయిచూస్తూ) కపిలుడింకా రాలేదే!

దేవ : అస్తమానం కపిలుడ్ని స్మరించడం –

పద్మిని : (నిశ్చేష్టురాలై) అదేమిటి?

దేవ : ఇంకేం కావలి? అనాలి? నిన్న గాక మొన్న నీ కోసం భాసుడి నాటకం చదువుతానన్నానా? – కపిలుడు తయారు!

పద్మిని : ఆ సంగతి మిమ్మల్నింకా తొలుస్తూనే వుందే! కాని దానికి నన్ను తప్పుపడతారేం? నన్ను పెళ్లి చేసుకోక ముందునుంచీ అతను మీకు స్నేహితుడేగా? అప్పుడుకూడా రోజూ ఇక్కడికి వచ్చేవాడేగా?

దేవ : కాని నాకిప్పుడు పెళ్ళి అయిందని వాడు గ్రహించొద్దూ? ఇంకా పూర్వంలానే ఉంటే ఎట్లా?

పద్మిని : పాపం! అతన్ని తప్పపట్టకండి......ఆ తప్పునాది.....మీ దగ్గరనుంచి కొంచెం కవిత్వం నేర్చుకున్నాడు కదా, భాసుడిని విని ఆనందిస్తాడనుకున్నాను. అందుకని అతణ్ణి కూడా రమ్మన్నాను...అతనికి

అసలు ఇష్టంలేదు... కాని నేనే తప్పదని ఒత్తిడి చేశాను.

దేవ : ఆ విషయం నాకు తెలుసు.

పద్మిని : మీరు దాని కోసం ఇంత కోపం తెచ్చుకుంటారని తెలిస్తే, రమ్మనేదాన్నే కాదు.

దేవ : నాకు కోపం లేదు పద్మిని! కపిలుడు కేవలం నా స్నేహితుడు కాదు; నా తమ్ముడు, ఏడేడు జన్మల్లో నేను చేసుకున్న పుణ్యం అతను నాకు స్నేహితుడు కావడం.....కాని నీ ఒక్కదాని కోసమే నేను కవిత్వం చదవాలను కోవడం, నీతో ఏకాంతంగా ఉండాలనుకోవడం తప్పా? (కొంచెం ఆగి) సరే, ఇహ ఒకసారి అతను వస్తే, నేను కవిత్వం ఎక్కడ చదువుతాను? నువ్వు అతని వెనక వెనకనే తిరుగుతూ 'కపిలా', 'కపిలా' అని చిలక పలుకులు పలకడమే కదా!

పద్మిని : అతనంటే మీరు అసూయపడడం లేదు కదా?

దేవ : నేనా?...నాకు కపిలుడంటే అసూయా?.....నేను అన్న ప్రతి మాటనీ ఎందుకట్లా వక్రీకరిస్తావ్?

పద్మిని : (అనునయిస్తున్నట్లు, నవ్వుతూ) అప్పుడే గునవడం మొదలుపెట్లారా?.....ఊరికే సరదాకి అన్నాను.... మీకు సరసం కూడా –

దేవ : నీకు సరదానే! కాని నాకు రక్తం ఉడికిపోతుంది.

పద్మిని : ఊరుకుందురు! మీరెంత మంచివారో, విశాలహృదయులో నాకు తెలియదా ఏమిటి?......మీకు అసూయ ఏమిటి? రేపు నేను బావిలో పడ్డా, నా శరీరం పైకి తేలేదాకా మీకా సంగతే పట్టదు......నాకు తెలియదూ?

దేవ : పద్మినీ! (కోపంగా)

పద్మిని : (నాలిక కరుచుకుని) ఓ!......క్షమించండి....మరిచిపోయాను.....లెంపలు వాయించుకుంటున్నాను. (వాయించుకుని) సరేనా?....చిన్నప్పటినుంచీ ఇట్లా మాట్లాడుతూ వుండడంతో అదవే అలవాటయి పోయింది. కాని మీ మనస్సు అతి సున్నితం.....ఇట్లా వుంటే జీవితంలో ఒడుదుడుకులకు మీరు తట్టుకోవడం ఎట్లా? ...మీది ఒట్టి పసిపిల్లవాడి మనస్సు.

దేవ : అలాగా!

పద్మిని : కాని చూడండి! కపిలుడ్ని గురించేనా మీరట్లా అయిపోయారు? కాని ఎందుకు? మీరేనా సర్వస్వం! నా దేవుడు!....కపిలుడ్ని ఆట పట్టించడం నాకు సరదా! ఒట్టి అమాయకుడు! చూడ్డానికేమో నల్లగా భూతంలా ఉంటాడు; సిగ్గుపడితే చూడాలి – ఆ ముసిముసి నవ్వులు, బుగ్గలు ఎర్రపడడం అచ్చం పెళ్ళికూతుర్లా ఉంటాడు!

దేవ : ఈ పెళ్ళికూతురికి సిగ్గుపడడం ఎవరూ నేర్పలేదు....

పద్మిని : ఇప్పుడు నేర్చుకుంటున్నాను ఈ మొరటు మనిషిని చూసి –

(ఇద్దరూ నవ్వుకున్నారు. పద్మిని కిటికీ దగ్గరకు వెళ్ళింది)

దేవ : (తనలో) బొత్తిగా అర్థం చేసుకోదేం? లేక వాడితో కావాలని ఈ నాటకం ఆడుతోందా? కపిలుడు ఎప్పుడూ సిగ్గుపడే రకం కాదు కాని ఇప్పుడు? పద్మినిని చూస్తే చాలు తోక ఆడిస్తూ వెంట తిరుగుతాడు. ఆవిడ ముందు కూర్చుని ఆవిడ మాటలు ముత్యాల్లా ఎప్పుడు కింద పడతాయా అని ఎదురుచూస్తూ వుంటాడు...వాడి కళ్ళల్లో కనిపించేది ఈ ప్రాధేయత! అది ఈమెకి అర్థం కాదా? (బిగ్గరగా) పద్మినీ!

కపిలుడికి ఆడవాళ్ళంటే తెలియదు. వాడికి జీవితంలో తెలిసిన స్త్రీ వాళ్ళ అమ్మ ఒక్కతే!

పద్మిని : అంటే, అతనితో ఉంటే ప్రమాదకరమనా? మీ మాటలు వింటుంటే అతను మీ ప్రాణ స్నేహితుడని ఎవ్వరూ అనుకోరు.

దేవ : నేను అన్న ప్రతిమాటకీ ఏదో ఒక రంగు పులుముతావేం?

పద్మిని : (సంధి చేసుకునే ధోరణిలో) చూడండి.....ఇవ్వాళ మీకు ఉజ్జయిని వెళ్ళాలని లేకపోతే, వెళ్ళడం మానుకుందాం...కపిలుడు వస్తే నాకు ఒంట్లో బాగాలేదని చెప్పండి.......

దేవ : కాని నువ్వు నిరుత్సాహపడతావేమో?

పద్మిని : నేనా? ఏమీ లేదు....మీరెట్లా కావాలంటే అట్లానే!.....పురోహితుడేం చెప్పాడో మరిచిపోయారా? నేను మీ అర్ధాంగిని. మీలో సగం....ఉజ్జయని మరోసారి వెడదాం....ఇంకో రెండు నెలల్లో ఉజ్జయని జాతర జరుగుతుంది కదా? అప్పుడు వెడదాం....మనం యిద్దరమే! సరేనా? ఇవ్వాల్టి ప్రయాణం ఆపేద్దాం –

దేవ : (సంతోషాన్ని అణుచుకుంటూ) నువ్వు నిరుత్సాహ పడకుండా ఉంటే అదే నేను కోరుకునేది. కపిలుడంటే నాకు అసూయ వున్నదని కాదు. నాకు తెలుసు నాకు అసూయ లేదని........వాడి మనసు బంగారం! కాని ఇది నీకు మొదటి కాన్పు –

పద్మిని : 'మొదటి' అంటారేం? ఆర్నెల్లలో ఎన్ని కాన్పులొస్తాయేం?

దేవ : అదుగో, మళ్ళీ –

పద్మిని : సరే! ఇహ మాట్లాడను. సరా?

దేవ : (బుజ్జగిస్తూ) పెంపకలోపం! అదీ అసలు సంగతి!! ఈ స్థితిలో నువ్వు బండిమీద అంత దూరం వెళ్ళడం నాకు ఇష్టం లేదు.

పద్మిని : మామూలుగా అయితే – "నాది ఉక్కుపిండం" అనేదాన్ని. కాని ఇప్పుడు అనను – ఈ స్థితిలో – (ఇద్దరూ నవ్వుకుంటారు) మీరు సంతోషంగా ఉంటే నాకు సంతోషమే!.......

దేవ : (ఆనందంగా) ఇవ్వాళ రోజంతా మనమిద్దరమే కలిసి గడుపుదాం పనివాళ్ళ ఎలాగూ ఇళ్ళకు వెళ్ళిపోయారు ఇహ – మనమిద్దరమే! నువ్వు-నేను! ఇద్దరమే!...మనిద్దరం ఇలా ఒంటరిగా గడిపి ఎంత కాలమయింది?

కపిల : (వాకిట్లోనుంచి) దేవదత్తా!

పద్మిని : కపిలుడు వచ్చినట్టున్నాడు....మీరే చెప్పండి.

(లోపలికి వెడుతున్నట్టుగా వెళ్ళి, స్టేజికి ఒక్క పక్కగా నిలబడ్డది, వాళ్ళ సంభాషణ వినడానికా అన్నట్టు.....)

కపిల : (ఉత్సాహంగా వస్తూ) ఆలస్యం అయిందికదూ? ఏం చెయ్యను? బండి సిద్ధంగానే వుంది. కాని తీరా చూస్తే ఒక ఎద్దు నాసిగా ఉంది. బండివాడిని ఆ ఎద్దు మార్చమన్నాను...ఈ ఎద్దుని బండి కట్టి వెడితే ఉజ్జయిఇ వెళ్ళడానికి రెండు వారాలు పడుతుందన్నాను.

దేవ : కపిలా!

కపిల : ఆ మాటంటే పెద్ద పోట్లాటకి వచ్చాడనుకో! ...నేను వింటానా?...చచ్చినట్టు మరో ఎద్దుని తెచ్చాడు....మన బండి చిత్రపురం వెళ్ళకుండా వుంటే –

దేవ : కపిలా! ఇవ్వాళ మన ప్రయాణం ఆగిపోయింది.

కపిల : (నిశ్చేష్టుడై) ఆగిపోయిందా ఏం?

దేవ : చూడు......పద్మినికి బాగులేదు.

కపిల : అట్లాగా!.....అయితే సరే!! (నిశ్శబ్దం) నేనే బండిని పంపించేస్తాను.

దేవ : ఊ!

కపిల : లేకపోతే అనవసరంగా ఇవ్వాల్టికి కూడా బాడుగ ఇవ్వమంటాడు.

దేవ : సరే!

కపిల : (తనలో) ప్రయాణం ఆగిపోయిందా! ఇహ ఇవ్వాలంతా ఏం చెయ్యాలి? ఈ వారమంతా? ప్రయాణం ఆగిపోతే ప్రపంచమే ఆగిపోయినట్టు అనిపించడమేమిటి?

ఒరేయ్ కపిలా! నిగ్రహించుకో! జారిపోకు....నీ మీద నీకుండే పట్టు సడలనీకు...వెళ్ళు వెళ్ళిపో – వారందాకా నీ మొహం ఇటు చూపించకు.......నువ్వు రాకపోతే దేవదత్తుడికి కోపం రావచ్చు. వదిన బాధపడొచ్చు.....అయినా రాకు. వెళ్ళు. వెళ్లు.....(పైకి) అయితే ఇహ నేను బయలు దేరుతాను.

దేవ : కాసేపు కూర్చుని వెళ్ళొచ్చుగా?

కపిల : వద్దు వద్దు.......మన మాటల్లో వదినకు చికాకు కలిగిస్తాం.

దేవ : అదీ నిజమే.....మళ్ళీ రా –

కపిల : అట్లాగే! (వెళ్ళబోతాడు. పద్మిని వస్తుంది.)

పద్మిని : అరె! అట్లా కూర్చున్నారేమిటి?....ఎప్పుడు బయలు దేరుతున్నాం......ఇప్పటికీ ఆలస్యం అయింది.

(ఇద్దరూ ఆశ్చర్యపోతారు)

కపిల : మీకు ఒంట్లో బాగుండకపోతే –

పద్మిని : నాకు బావుండకపోవడమేమిటి? బ్రహ్మాండంగా వుంది. పొద్దున్న కొంచెం తలనొప్పిగా వుంది. అల్లం పట్టీ వేశాను. ఆ చిన్న నలతకి మన ప్రయాణం మానుకోవడం ఎందుకు? (దేవదత్తుడు ఏదో అనబోయాడు. మానేశాడు) (కపిలుడితో) పోతపోసిన విగ్రహంలా అలా నిలబడిపోయావేం?–

కపిల : ఏమీ లేదు.....మీకు తలనొప్పిగా ఉంటే –

పద్మిని : ఇప్పుడు లేదుగా!

దేవ : పద్మినీ –

పద్మిని : కపిలా! ఆ మూటని బండిలో పెట్టు.......మిగిలినవి పనివాడు తెస్తాడు (ఇద్దరూ కదలరు) తొందరగా కదలక పోతే నేనే పెడతాను. (కపిలుడు బయటకు వెడతాడు. పద్మిని దేవదత్తుడితో) కోపం తెచ్చుకోకండి...పిచ్చివాడు! అన్నీ పోగొట్టుకున్న వాడిలా ఉంటే భరించలేకపోయాను.....ఈ వారం అంతా మన కోసం తిరిగిన వాడు తిరిగినట్టున్నాడు.

దేవ : (తల తిప్పేసుకుని) నా పుస్తకాల పెట్టె ఎక్కడ వుంది? దాన్ని తెస్తాను.

పద్మిని : మీరు బంగారమండీ! మీరేమీ అనుకోరని నాకు తెలుసు....ఈ పెట్టె నేను తెస్తాను....తేలికగానే ఉంది.

దేవ : (తనలో) నా నిరాశ సంగతి? ఈ సంగతి నీకు పట్టదా? (బిగ్గరగా) వద్దు....నేనే తెస్తాను...నువ్వు ఏమీ ఎత్తకు....

(ఇద్దరూ లోపలకు వెడతారు)

భాగవత : ఎందుకే వగచేవు మనసా?
ఎందుకే మురిసేవు వయసా?

(బండి తోలుతూ కపిలుడు. వెనక కూర్చుని పద్మిని, దేవదత్తుడు....మూక నటన)

పద్మిని : కపిలా! బండి ఎంత బాగా తోలుతున్నావ్! చర్నాకోలు పట్టుకోలేదు...కాని ఎడ్లకు ఎట్లాపోవాలో తెలిసినట్టుగా ఉంది.

(కపిలుడు ఆనందంగా నవ్వుతాడు)

ఇక్కడ కాసేపు ఆగుదామా? రోజంతా బండిలో ఉన్నామా, కాళ్ళు గుదులు కట్టినట్టుగా ఉన్నాయి.

కపిల : అట్లాగే!.....(ఆపుతూ) ఓ......ఓ......

(ముగ్గురూ దిగుతారు. దిగుతూ పద్మిని తూలితే దేవదత్తుడు పట్టుకుంటాడు.)

పద్మిని : ఏం దారి!....రాళ్ళు గుట్టలూ!..కాని అదేం అనిపించలేదు సుమా! ఎంత సున్నితంగా బండితోలావు!!... గాలిలో ఎగిరిపోతున్నట్టు ఉంటే!! ఒకసారి ఈయన బండిలో తీసుకుపోయారు....(దేవదత్తుడితో) జ్ఞాపకం ఉందా? (కపిలుడితో) మా పెళ్ళయితన కొత్తలో! ఊరిబయట సరస్సు దగ్గిరికే! మేమిద్దరమే! ఆయన బండి తోలడం!! అప్పటికీ – మీరు వద్దండీ అని బతిమిలాడాను. వింటేనా? ఊ..ఊ...ఊరు దాటామోలేదో ఆ ఎడ్లు దారిన తప్ప అన్ని చోట్లకి పరిగెత్తడమే! ఆయన కుడివైపుకు లాగితే అవి ఎడం వైపుకు, ఆయన ఎడంవైపుకు లాగితే అవి కుడివైపుకు పోవడం!! ఆయన కోపం చూడాలి! అబ్బ! నేరుగా ఇంటికి వెళ్ళిపోయామనుకో. (అందరూ నవ్వుతారు) కపిలా! ఆ చెట్టేమిటి?.....ఆ పూలు విరగడబూసిన చెట్టు!

కపిల : అదా! దాన్ని 'ముత్తయిదు చెట్టు' అంటారు.

పద్మిని : అది తెలుసు. కాని దాన్ని అట్లా ఎందుకంటారు?

కపిల : ఆగండి....ఆ పువ్వు తీసుకువస్తాను. అప్పుడు చూద్దురుగాని – (వెడతాడు)

(చెట్టెక్కుతున్న కపిలుడ్ని చూసి, పద్మిని –)

పద్మిని : ఎంత చకచకా ఎక్కుతున్నాడో! 'ఊ' అని నేను అనకముందే చొక్కా విప్పేసి, ధోవతి ఎగగట్టి చెట్టు ఎక్కేస్తున్నాడు, అబ్బ! ఏమి శరీరం! ఆ విశాలమైన వీపు! కండరాలు ఎగిరి పడుతూ అలలు ఎగిసి పడే మహాసముద్రం లాగా ఉన్నాడు!.....సరిగ్గా నిలవ గలదా అనేటట్టు – ఆసన్నని నడుము! ఆడపిల్ల కున్నట్టు!!

దేవ : (తనలో) రోజంతా వసపిట్టలా మాట్లాడుతూనే వుంది! ఇప్పుడేమో – మాటా పలుకు లేదు.

పద్మిని : (తనలో) ఎవరో దేవతామూర్తి ఈ భూమిమీద వేటగాడై పుట్టినట్లుగా ఉన్నాడు! ఆ శరీరం ఎట్లా ఊగుతున్నదో!! ప్రతి అవయవమూ ఎట్లా వంపులు తిరుగుతోంది! అచ్చంగా నాట్యం చేస్తున్నట్టు!!

దేవ : (తనలో) పద్మిని మీద కోపం తెచ్చుకోవడం ఎందుకు? కమ్మచ్చి తీసినట్టు తీగలు సాగే ఈ శరీరం! వీరుడికి ఉండే ఆ కండరాలు! నేను ఈ కపిలుడిని ఎరిగినట్టుగానే లేదు. నేను ఎంత అమాయకుణ్ణి! పసిపిల్లవాడి కన్న కనా కష్టం అయిపోయానే!

పద్మిని : (తనలో) ఏ ఆడది అతనిని నుంచి దృష్టి మళ్ళించుకోగలదు?

దేవ : (తనలో) ఏ ఆడది అతనిని నుంచి దృష్టిని మళ్ళించుకోగలదు? పెళ్ళి అయితే మాత్రమేం?....ఎంత గుడ్డివాడిని? ఇంతకాలం ఆమె కనికరం కోసం అర్రులుచాచే కపిలుడి కళ్ళలోని ఆవేదననే చూశాను. కాని.... ఆమె కళ్ళలోకి చూడనేలేదు...తీరా చూస్తే – ఆ కళ్ళలో కోరికల అగ్నిజ్వాలలు!! ఇప్పుడు ఇంత ఆలస్యంగా!! ...దేవదత్తా! తల పక్కకి తిప్పుకోకు. ఆ కళ్ళను చూడు! అతని శరీరం లోలోపలకి చొచ్చుకుపోవాలని తపిస్తున్న ఆమె ఆత్మను చూడు. చూడు! నీ నరాలు చిట్లిపోనీ!! నీ గుండెలు ఆగిపోనీ!...కాని దృష్టి మరల్చకు....నీ ఆవేదనని బయటకు రానివ్వకు......(ఆ కళ్ళలోకే చూడు....నీ గుడ్డితనాన్ని చెదరగొట్టే ఆ కళ్ళ కాంతిని చూడు. దేవదత్తా! నీ ఆవేదనని బయటకు రానివ్వకు. ఇప్పుడు పిరికివాడికి కాకు.

పద్మిని : (తనలో) ఎంతకాలం? ఇట్లా ఎంతకాలం సాగుతుంది? ఎంతకాలం? ఆయన కంటపడితే –
(దేవదత్తుడ్ని చూస్తుంది. అతనూ ఇటే చూస్తున్నాడు. ఇద్దరూ దృష్టి మరల్చుకున్నారు)
(బిగ్గరగా) అడుగో! వచ్చేశాడు! నేనడిగింది ఒక పువ్వు. ఒక గంపెడు తెస్తున్నాడు.

(కపిలుడు పెద్ద గుట్ట పూలు తెచ్చినట్టు పడేస్తాడు)

కపిల : ఇవిగో! ముత్తయిదు పూలు!!

పద్మిని : "ముత్తయిదువు పూలు" ఎందుకని?

కపిల : ఎందుకో తెలుసా? పెళ్ళయిన ఆడవాళ్ళకి ఉండే అన్ని శుభలక్షణాలు ఈ పువ్వుకు కూడ ఉన్నాయి కనక. ఈ రేకుల మీద పసుపుపచ్చ; ఈ రేకుల మొదట్లో వున్న గుండ్రటి ఎర్రటి బొట్టు. పాపిడిలో మధ్యగా ఉండే సింధూరం రంగు ఆ పైన.....ఈ కింద నేమో – నల్లటి పూసల వరనలాగా....అది నల్లపూసల గొలుసు అన్నమాట!

పద్మిని : ఏం ఆలోచన! (దేవదత్తుడితో) మీ కవిత్వంలో దీన్ని వాడుకోవచ్చునండీ! ఎంత చక్కని ఉపమాలంకారం!!

దేవ : ఇహ బయలుదేరుదామా? చాల ఆలస్యం అయిపోయింది.

పద్మిని : ఇంకా కొంచెంసేపు ఉందామండీ! ఆ బండిలో ఎంతసేపు కూర్చున్నానో నాకు తెలియదు...ఉజ్జయిని దోవ యింత బావుంటుందని నాకిది వరకు తెలియదు....నందనవనంలా ఉంది కదూ!

కపిల : మామూలుగా అందరూ చుట్టూ దోవన వెడతారు...ఇది అడ్డదారి. అడవి దారి. ఎక్కువమంది ఇటురారు. నాకు మాత్రం ఈ దారే బావుంటుంది...పైగా పదిహేను మైళ్ళు దగ్గర!!

పద్మిని : మరో పదిహేను మైళ్ళు ఎక్కువయినా నాకేమీ అనిపించేది కాదు......ఇదంతా చూడు..నందన వనంలా ఉంది!

కపిల : అవునుకదూ!......అదుగో, అక్కడ! భార్గవీ నది. దాని ఒడ్డునే వ్యాసుడి ఆశ్రమం ఉంది. ఇప్పుడక్కడ ఒక రుద్రదేవాలయం కూడా ఉంది.

దేవ : (ఉలిక్కిపడి) రుద్రుడి ఆలయమా?

కపిల : అవును. చాలా బావుంటుంది...అదుగో! ఆ కొండకి అవతల పక్క కాళికాదేవి ఆలయం ఉంది.

(ఇద్దరు మనుషులు ఒక తెర తీసుకు వచ్చి నిలపబడతారు. దాని మీద కాళికా దేవి బొమ్మ ఉంది. భాగవత – దాని ముందు ఒక కత్తిని ఉంచుతాడు.)

ఒకప్పుడు కళకళలాడుతూ ఉండేది. ఇప్పుడంతా పాడయిపోయింది.

దేవ : (మైకంలో ఉన్నట్టు) రుద్రుడి దేవాలయమా?

కపిల : ఆ! అది కూడా పురాతనమైనదే! కాని కాళికాదేవి గుడి అంత కాదు....కావాలంటే వెళ్ళి చూద్దాం..

పద్మిని : చూద్దాం పదండి.

దేవ : ముందు వెళ్ళి కాళీ ఆలయం చూసిరండి.

కపిల : అమ్మో! అది భయంకరంగా ఉంటుంది. నేనొకసారి చేశాను. గుడ్లగూబలు, పాములు, అన్నీ విష సర్పాలు, క్రూరమృగాలు. పైగా సరైన దారి కూడా లేదు....అంతకన్నా రుద్రుడి గుడికి వెళ్ళోచ్చు. దారీ బావుంటుంది. దగ్గరకూడా.

పద్మిని : పదండి వెడదాం.

దేవ : మీరిద్దరూ వెళ్ళండి. నేను రాను.

పద్మిని : (కాసేపు ఆగి) మరి మీరు?

దేవ : ఇక్కడ మన బండికి, సామాన్లకు కాపలా వుంటాను.

కపిల : కాని ఇక్కడ దొంగల భయం లేదు.(ఇదేదో ఘర్షణకు దారి తీస్తోందని) పోనీ, నేను వుండిపోతాను.

పద్మిని : (తనలో) మళ్ళీ మొదలు పెట్టాడు, ఆ గునవడం......అట్లాగే గునుస్తూ వుండనీ! నాకేం? (పైకి) పద కపిలా! మనం వెళ్ళోద్దాం.

కపిల : కాని మీరు ఈ పరిస్థితులలో –

పద్మిని : ఏమిటి? మీరిద్దరూ 'నీ పరిస్థితి' అంటూ వెంటపడ్డారు. నీకు రావడానికి ఇష్టం లేకపోతే చెప్పు. ఊరికే ఏదో నెపం పెట్టకు.

కపిల : దేవదత్తా! అది అంత దూరం కాదు! నువ్వు కూడా రా.

దేవ : మిమ్మల్ని వెళ్లమన్నాను కదా! నన్ను బలవంత పెట్టకు.

పద్మిని : అసలు వెళ్లొద్దులే! మీరిద్దరూ నాకోసం బాధ పడడం నాకు ఇష్టం లేదు.

దేవ : (కపిలతో) వెళ్ళు.

కపిల : పదండి!...(దేవదత్తుడితో) త్వరగా వచ్చేస్తాం....

దేవ : వెళ్లిరా కపిలా! పద్మినీ సెలవు! ఆ రుద్రదేవుడు మిమ్మల్ని చల్లగా చూడాలి. మీరిద్దరూ నాకు రెండు ప్రాణాలు. ఇద్దరూ కలిసి సుఖంగా ఉండండి. నా సుఖాన్ని నేను అక్కడ వెతుక్కుంటాను....(బాధతో) రుద్రదేవా! నాకు ధైర్యాన్ని శక్తినీ ఇవ్వు...అప్పుడే ఎందుకో నాకు వణుకు పుడుతోంది. ఇంత భయపడతానని ఎప్పుడూ అనుకోలేదు. తండ్రీ! నాకు శక్తినీ, ధైర్యాన్ని ఇవ్వు....

(అంటూ కాళీ గుడిలోకి వెళ్ళాడు. కష్టమైన మార్గం. అలసిపోయాడు. వెళ్ళి అమ్మవారికి సాష్టాంగ

పడ్డాడు.)

భవానీ! కాళీ! భైరవీ! దుర్గా! మహామాయా! ప్రకృతి స్వరూపిణీ! నీకు నేను చేసిన బాసమరిచి పోయాను తల్లీ! క్షమించు. నా మనసులో ఉన్న కోరిక తీర్చావు. పద్మినిని నాకు ఇచ్చావు. నేనే నీకిచ్చిన మాటను మరిచిపోయాను. ఇదుగో! నా మాట నెరవేర్చుకోడానికే వచ్చాను. (అక్కడ పడివున్న కత్తిని తీసుకుని) అమ్మా! నీ దయ అనన్యసామాన్యం. ఈ ఏకాంత ప్రదేశంలో కూడా ఎవరో నీ భక్తుడు ఈ కత్తిని వదిలి వెళ్లాడు. ఈ కత్తి ఎన్ని ప్రాణుల్ని నీకు బలి ఇచ్చిందో?....(బిగ్గరగా) తల్లీ! ఇదుగో మరో ప్రాణం! నా శిరస్సు! దీనిని స్వీకరించు...తల్లీ! స్వీకరించు –

(తన తలను నరుక్కున్నాడు. తన్నుకుంటాడు. అరుస్తాడు. చివరు అచేతనంగా పడిపోయాడు. ఆతల –కరాళం – రక్తంలో పడి వుంది)

పద్మిని : (వస్తూ) ఆయన కూడా రావలసింది. ఎంత అద్భుతంగా ఉంది! స్వర్గమేననుకో!..అయినా ఇటువంటివి ఆయనకు నచ్చవులే! నిజానికి – (దేవదత్తుడు అక్కడ లేడని గ్రహించింది) ఏరీ ఆయన? (చుట్టూ చూస్తారు) ఇక్కడే ఉంటానన్నారే!

కపిల : (పిలుస్తూ) దేవదత్తా! దేవదత్తా!

పద్మిని : ఈ చుట్టు పక్కనే ఎక్కడో ఉండి ఉంటారు. ఎక్కడికి పోతారు? సున్నితమైన మనిషి! కొంచెం నడిస్తే దెబ్బలు, బొబ్బలు, గాయాలు –

కపిల : (పిలుస్తూ) దేవదత్తా!

పద్మిని : ఎందుకట్లా అరుస్తావ్! వస్తారు.....కూర్చో –

కపిల : (చుట్టూ జాగ్రత్తగా చూస్తాడు. ఆశ్చర్యపోయి) ఓ!

పద్మిని : ఏమిటి?

కపిల : దేవదత్తు పాదాల గుర్తులు...అటు వెళ్ళివుండాలి..అయితే అది కాళీదేవాలయానికి వెళ్ళేదారి!

పద్మిని : అంటే – ఆయన కాళీ దేవాలయానికి వెళ్ళారంటావా? ఏమీ కాదు.

కపిల : మీరిక్కడేవుండండి. నేను వెళ్ళి తీసుకువస్తాను.

పద్మిని : నువ్వెందుకు వెళ్ళడం? ఈ పగటి పూట భయపడాల్సిందేముంటుంది?

కపిల : (తొందరపడుతూ) అదంతా నట్టనడవి. అక్కడ దోవతప్పితే రాత్రంతా అక్కడే ఒంటరిగా ఉండి పోవాలి...ఇక్కడే వుండండి.....నేనిప్పుడే వస్తాను.......(పరిగెత్తుతాడు)

పద్మిని : కపిలా...కపిలా......(విసుగుతో) వెళ్లిపోయాడా? అతనికి నా కులాసా కంటే దేవదత్తుడు మీద బెంగ ఎక్కువగా ఉంది!

(కూర్చుంది. కపిలుడు కాళీ ఆలయానికి వెళ్ళి దేవదత్తుడి కళేబరాన్ని చూశాడు. అతని పక్కన కూర్చుని తలని చేతిలోకి తీసుకుని ఏడుస్తూ –)

కపిల : దేవదత్తా....! దేవదత్తా....! మిత్రమా! నీ తల నరుక్కున్నావా? ఎంత పని చేశావు! అన్నా! నా మీద అంత కోపం వచ్చిందా?..అంత అసహ్యం వేసిందా నేనంటే! ఆ కోపంలో నేను నీ కోసం చచ్చిపోగలనని నువ్వు మరిచావు కదూ! నువ్వు నిప్పుల్లో దూకమంటే దూకేవాణ్ని కదూ? నాకు నీ

మొహం చూపించకు, ఈ దేశం నుంచి వెళ్ళిపో – అంటే వెళ్లిపోయివుండేవాడిని. నన్ను ఏమీ ఆజ్ఞాపించకుండా వెళ్లిపోయావంటే నేనంటే నీకెంత కోపం వచ్చివుండాలి? నిజమే! నేను తప్పుచేశాను....కాని అంతకంటే ఏం చెయ్యాలో తోచని బుద్ధిహీనుణ్ణి....నాకు ఆలోచన లేదు....అందుకని – అందుకని నన్ను దూరంగా నెట్టేశావు కదూ! అవును దేవదత్తా! నువ్వు లేకుండా నేను లేను. నువ్వు లేకుండా ఊపిరికూడా పీల్చలేను. (అక్కడ వున్నకత్తి తీసుకుని) దేవదత్తా! ఈ లోకంలో నన్ను తమ్ముడుగా ఉండొద్దని వెళ్ళిపోయావు కాదూ? ఆ లోకంలో నన్నా నన్ను తమ్ముడిగా స్వీకరించు. ఇదిగో! ఎప్పటిలాగే ఇప్పుడుకూడా నీ వెంటే వస్తున్నా –

(కత్తితో తన తల నరుక్కుంటాడు)

పద్మిని : (ఇప్పటిదాకా నిశ్చలంగా ఉన్నది, ఇప్పుడు కదులుతుంది) ఎక్కడ వీళ్ళిద్దరూ? ఇప్పుడు కపిలుడు కూడ అదృశ్యమైపోయాడే! ఇంకా ఆయన కోసమే వెతుకుతూవుండి వుంటాడా? అయివుండదు. ఆయన ఇర్తి అర్భకుడు. చాలా దూరం వెళ్ళి వుండడు. ఇద్దరూ కూర్చుని పాత సంగతులు మాట్లాడుకుంటూ వుండాలి...ఇప్పుడు పెళ్ళాం బాధలేదు గదా! అది కూడా అయివుండదు. ఆయన నణుగుతూ, ననుగుతూ ఉండి ఉండాలి. పావం! కపిలుడ్ని క్షోభ పెడుతూ వుండివుండాలి....అవును....ఆయన తీరే అంత.

(కొంతసేపు ఆగి)

చీకటి పడుతున్నది. వీళ్ళు ఇంకా రాలేదు. ఇద్దరూ ఇద్దరే! నన్నిట్లా ఇంతసేపు వదిలి వుండడానికి ఎట్లా మనస్సు ఒప్పిందో?.....ఇక్కడ ఇట్లాగే కూర్చుంటే ప్రయోజనం లేదు....అటువెళ్ళి వాళ్ళకోసం చూడడం మంచిది. దోవలో ఏ పామో వచ్చి కరిస్తే – వాళ్ళ కళ్ళు చల్లబడతాయి.

(మెల్లగా గుడి దగ్గరకు వెళ్ళింది....అక్కడ రెండు నులుముకుని చూస్తుంది.)

ఎంత చీకటిగా ఉంది ఇక్కడ! ఏమీ కనిపించడం లేదు! (పిలుస్తూ) కపిలా, కపిలా!.......ఆయన కూడా లేరే ఇక్కడ! ఇంత రాత్రి వేళ ఇక్కడ ఏం చెయ్యడం? (వింటూ) ఏమిటిది? ఏదో అడవి జంతువు!...అమ్మో! తోడేలు!...అదుగో అక్కడే ఉంది. అది లోపలికి వస్తే –?...అమ్మయ్య! వెళ్లిపోయింది. అమ్మా! కాళీ! నువ్వే కాపాడాలి తల్లీ!

(అంటూ ఆ శరీరాల మీద తూలి పడుతుంది.)

ఏమిటిది? అయ్యో! (బిగ్గరగా అరుస్తుంది) ఏమిటిది? ఇద్దరూ – తలలు నరుక్కుని ...అయ్యో! ఇద్దర్లో ఎవ్వరూ నన్ను గురించి ఆలోచించలేదు కదూ! ఏం చెయ్యను?...ఒంటరిగా? ఈ అడవిలో?..నన్నిట్లా వదిలి వెళ్ళడానికి నేనేం చేశాను? ఇదేనా మీరు చూపించిన ప్రేమ?..కపిలా! ఎప్పుడూ నన్ను అలా తినేసేటట్టు చూసేవాడివి. నువ్వు కూడా నా సంగతి ఆలోచించలేదు కదూ? ఎంత నిర్దయ? ఎంతటి స్వార్థం? ఏం చెయ్యను? ఎక్కడికి వెళ్ళను? ఇహ ఇంటికెట్లా వెళ్ళను? (కాసేపాగి) ఇంటికా? అక్కడికి వెళ్ళి ఏం చెప్పాలి వాళ్ళకి? ఊరి వాళ్ళకి నామొహం ఎలా చూపను? వాళ్ళు ఏం జరిగిందంటే ఏం చెప్పను? నన్నెవరు నమ్ముతారు? ఈ టక్కులాడి కోసం ఇద్దరూ

పోట్లాడుకుని చచ్చిపోయారని అనరూ?.....అప్పుడు నేనే కావాలి? ..అమ్మా! కాళీ! ఆ పరిస్థితి రానివ్వకు. కపిలుడు పోయాడు. దేవదత్తుడు పోయాడు....వాళ్ళతో పాటు నన్నూ పోనీ – (కత్తి తీసుకుంది) నా తలని నరుక్కునేటంగ ధైర్యం లేదు నాకు..అయినా ఎట్లా ఛస్తే ఏం తల్లీ! నీకేం పట్టింది? నీకు మరో నివేదన! అట్లాగే కానీ. ఇదుగో! తీసుకో తల్లీ! మరో నైవేద్యం!! నీ క్కావలసిందిదే కదా! (కత్తి తీసుకుని గుండెలకు ఆనించింది. తెర వెనుక కాళి గొంతు)

కాళి : ఏయ్! (పద్మిని అచేతనం అయింది) కింద పడేయ్..ఆ కత్తి కిందపడేయ్.....(పద్మిని భయంతో ఒక అడుగు వెనక్కి వేసింది. కత్తి పారేసింది. పారిపోబోయింది. కాని ఆగింది.)

పద్మిని : ఎవరు? ఎవరది?...ఎవరంటే మాట్లాడరేం? అమ్మా! (డమరుకం, రండోళ్ళ చప్పుళ్ళ మధ్య కాళీ కనిపిస్తుంది. నోరు తెరుచుకుని భయంకరంగా......నోరు మూసింది. వాదా&యలు ఆగాయి. ఇంతవరకు ఆమె ఆవులిస్తున్నది.)

కాళీ : (ఆవులించి) సరే, సరే! కళ్ళు తెరు. తొందరగా. అనవసరంగా నా సమయం వృధా చెయ్యకు.

(పద్మిని కళ్ళు తెరిచి చూస్తుంది.....ఆమె పాదాల మీద పడ్డది.)

పద్మిని : అమ్మా! కాళీమాతా!

కాళీ : (నిద్రమత్తులో) అవును నేనే! ఇది వరకు రోజుల్లో ఇది నాకు పవళింపు సేవ చేసు సమయం...భక్తుల మద్దెళ్ళతో తాళాలతో చెవులు చిల్లులు పడిపోయేవి. అందువల్ల అప్పుడు మేలుకొని ఉండేదాన్ని. ఇప్పుడా అలవాడు తప్పిపోయింది. సరే! ఏం కావాలి...............

పద్మిని : రక్షించు తల్లీ!

కాళీ : అది ఇప్పటికే చేసేశాను గదా?

పద్మిని : ఇదా రక్షించడమంటే? అమ్మా!...బయటకు వెళ్ళి నా మొహం ఎలా చూపించగలను?......నాకు దారి చూపించు తల్లీ!

కాళీ : ఆ ఆ! అవన్నీ ఇప్పటికే చెప్పేశావు కదా! మళ్ళీమళ్ళీ చెప్పవలసిన అవసరం లేదు.....నేను చెప్పినట్టు చెయ్యి...ఈ తలల్ని జాగ్రత్తగా మొండాల దగ్గరకు చేర్చు.....ఈ కత్తితో వాళ్ళ గొంతుల మీద రాయి.....వాళ్ళకు మళ్ళీ ప్రాణం వస్తుంది. చాలా?

పద్మిని : అమ్మా! ప్రాణదాతని....నువ్వే మాకు సర్వస్వం –

కాళి : అదంతా పక్కన పెట్టు. చెప్పినట్టు చెయ్యి, తొందరగా – నాకు నిద్ర ముంచుకు వస్తుంది.

పద్మిని : (అనుమానిస్తూ) తల్లీ! ఒక్క ప్రశ్న అడగనా?

కాళి : అడుగు.....కాని ఊరికే పొడిగించకు –

పద్మిని : అమ్మా! నీకు ఈ చరాచర సృష్టిలో తెలియని దేముంది? దేవదత్తుడు వచ్చాడు. కపిలుడు వచ్చాడు. ఇద్దరూ నీ ముందు తలలు నరుక్కున్నారు. ఒక్కర్నన్నా ఆపివుండకూడదా? ఇప్పుడీ భయం, బాధ నాకు ఉండేవి కాదుగదా!

కాళి : ఇప్పుడు నువ్వు ఆలోచించేది ఇదా?

పద్మిని : తల్లీ!

కాళి : నీలాంటి దాన్ని ఇంతవరకు చూడలేదు.

పద్మిని : నీ నుంచి దేన్నయినా దాచి పెట్టగలమా మాతా?

కాళి : అది నిజమేలే!

పద్మిని : మరి వాళ్ళను ఎందుకు ఆపలేదు?

కాళి : నాకు అంత నిద్ర ముంచుకు రానట్టయితే, వెధవల్ని ఇద్దర్నీ మెడపట్టుకుని దూరంగా విసిరేసేదాన్ని!

పద్మిని : అదేమిటి తల్లీ!

కాళి : ఒట్టి అబద్ధాల కోర్లు! చివరి నిమిషందాకా అబద్ధాల మీద అబద్ధాలు. ఆ దేవదత్తుడు: వెనక రుద్రుడికి తల ఇస్తానని మొక్కుకున్నాడు, నాకు చేతులిస్తాడట! విన్నావా! తల రుద్రుడికి, చేతులు నాకు! ఇంతలో మీరు రుద్రాలయంకు వెళ్ళడంతో ఇక్కడికి వచ్చిన తల నాకిస్తానన్నాడు – గొప్పగా! పైగా నాకిచ్చిన మాటకోసమట! మరే కారణం లేదట!

ఆ కపిలుడు! నాముందే తల నరుక్కున్నాడు..కాని తన స్నేహితుడి కోసమట! కనీసం నా పేరు కూడా ఎత్తలేదు. ఎన్ని అబద్ధాలు!..... స్నేహం కోసం చచ్చిపోతున్నాట్ట!..నీ కోసం దేవదత్తుడ్ని తనే చంపానని అందరూ అనుకుంటారని లోపల భయం! బయటకి మాత్రం 'ఓ మిత్రమా! ఓ అన్నా!".... నువ్వు ఒక్కదానివే నిజం చెప్పావు!!

పద్మిని : అంతా నీ దయే తల్లీ!

కాళి : మధ్యలో నన్ను లాగకు...నువ్వు నిజం మాట్టాడింది ఎందుకో తెలుసా? నీ స్వార్థం కోసం! అంతే!....ఆ! ఆ! ఇట్లా ఊరికే మాట్లాడుతూ కూర్చోకు....నేను చెప్పినట్టు చేసి కళ్ళు మూసుకు నిలబడు.

పద్మిని : అట్లాగే తల్లీ!

(పద్మిని ఆ తలల్ని, అంటే ఆ కరాణాల్ని ఆత్రంగా దగ్గరకు చేరుస్తూ ఒక తలకు మరొక తల మారుస్తుంది. కపిలుడికి దేవదత్తుడి తల, దేవదత్తుడికఇ కపిలుడి తల కలిపి కత్తితో రాస్తుంది. అమ్మవారికి నమస్కరించి కళ్ళు మూసుకు నిలబడ్డది.)

పద్మిని : తల్లీ! నీ ఆజ్ఞ ప్రకారమే చేశానమ్మా!

కాళి : నమ్మకానికి కూడా ఒక హద్దంటూ ఉంది అమ్మాయీ! అట్లాగే కానీ!

(వాద్యాల మోత.....తెర అడ్డం పట్టారు. అమ్మవారు దాని వెనక అదృశ్యం అయిపోయింది. ఈ కింది సంఘటన జరుగుతూ ఉండగా అమ్మవారు, గుడి, తెర అన్నీ మెల్లగా అదృశ్యమవుతాయి)

(పద్మిని కళ్ళు మూసుకునే వుంది....విరామం......పడిపోయిన మనుషులు కదులుతారు....వాళ్ళు ఊపిరి పీల్చుకోవడం స్పష్టంగా కనిపిస్తుంది. మెల్లగా లేచి కూర్చుంటారు.....వాళ్ళ కదలికలన్నా యాంత్రికంగా ఉన్నాయి. వాళ్ళని వాళ్లే ఆశ్చర్యంగా చూసుకుంటారు...చుట్టూ చూశారు....లేచి నిలబడ్డారు. నిలవడం కష్టంగా ఉంది. పద్మిని స్థిరంగా నిలబడి వుంది.)

దేవ : ఏం......జరిగింది?

కపిల : అరె!...మనకు ఏం......జరిగింది?

(పద్మిని కళ్ళు తెరిచింది. కాని వాళ్ళ వంక చూసే ధైర్యం లేదు.)

పద్మిని : అది...దేవదత్తుడి గొంతు......కపిలుడి గొంతు – (వెనక్కు తిరిగి) కపిలా! దేవదత్తా!!

(ఇద్దరి వంకా చూసి నిశ్చేష్టంగా ఉండిపోయింది)

కపిల : ఎవరది?

దేవ : పద్మిని?

కపిల : ఏమయింది నాకు? అబ్బా!....నా తల ఎంత బరువుగా ఉంది!

దేవ : నా ఒళ్ళు!...ఇంత భారంగా ఉందేం?

పద్మిని : (అయోమయంలో) అయ్యో!..నేను చేసిందేమిటి? అమ్మా! కాళీ! నువ్వే కాపాడాలి నన్ను! అయ్యో! ఎంత పని జరిగింది? ఏం చెయ్యాలి అమ్మా! –

దేవ : (ఈ లోకంలోకి వచ్చి) ఎందుకు .......ఏడుస్తున్నావ్?

కపిల : ఏమన్నా ప్రమాదం జరిగిందా?

పద్మిని : ఏం చెప్పను?......ఎలా చెప్పను? మీరు మీ తలలు నరుక్కున్నారు..నేను అమ్మవారిని ప్రార్థించాను....కాళీమాత మీకు ప్రాణదానం చేసింది. కాని, కాని ఆ చీకట్లో – అమ్మా! నువ్వే రక్షించాలి మమ్మల్ని – ఆ చీకట్లో ......మీ తలల్ని ఒకదానికి బదులు మరొకదాన్ని..నేనే! క్షమించు తల్లీ! నేను ఒక బ్రతకగూడదు......

కపిల : (దేవదత్తుడు వంక చూస్తాడు) పద్మినీ! నువ్వు......మా తలల్ని........

దేవ : మార్పిడి చేశావా?

(ఒకళ్ళ వంక ఒకరు చూసుకున్నారు.... నవ్వడం మొదలు పెట్టారు....ఆమెకు తెలియలా వీళ్ళ నవ్వును ఎలా తీసుకోవాలో.......వాళ్ళను జాగ్రత్తగా చూస్తుంది......ఆ తరువాత ఆమె కూడా నవ్వడం మొదలు పెట్టింది)

దేవ : మనవి మార్చిన శిరస్సులు! (నవ్వుతాడు)

కపిల : మారుబడ్డ తలలు! (నవ్వుతాడు)

దేవ : ఒక తలకు బదులు మరో తల!

కపిల : తలలు మారపోయాయి!! కదూ?

దేవ : భలేగా ఉంది కదూ!....ఇంత కాలం మనం స్నేహితులమే!

కపిల : ఇప్పుడో! మనది రక్త సంబంధం!..శరీర సంబంధం!!

పద్మిని : నన్ను క్షమించండి. (నవ్వుతూ) ఆహా! ఏం బహుమానం దొరికింది!

దేవ : (పద్మినితో) నిన్ను క్షమించడమా. నీకు కృతజ్ఞత చెప్పుకోవాలి.

కపిల : నీ రుణం తీర్చుకోలేం –

దేవ : తారుమారైన తలలు!

(పెద్దగా నవ్వుతారు....ముగ్గురూ చేతులు పట్టుకుని గుండ్రంగా తిరుగుతూ పాడతారు)

ఎంతటి ఆనందం! ఈనాడెంతటి ఆనందం!!
తలల మార్పు జరిగె! తారుమారు జరిగె!!

ఈ తల ఎవరిది, నీదా? ఆ తల ఎవరిది, నాదా??
ఓహోహో......ఓహోహో!........

(నవ్వి నవ్వి అలిసిపోయి కింద కూలబడతారు)

**కపిల :** ఓహ్!...నా పని అయిపోయింది!

**పద్మిని :** గుండెలు అలసిపోయాయి!

**దేవ :** ఇటువంటిది ఇదివరకెప్పుడూ జరిగి వుండదు.

**పద్మిని :** మీకు తెలుసా?.....తలలు లేకుండా మిమ్మల్ని చేసేటప్పటికి నాకు ఎంత భయం వేసిందో!..కాళ్ళు చేతులూ ఒణికాయి...కాని తీరా మీరు లేచిం తర్వాత...మిమ్మల్ని చూసి నా పై ప్రాణాలు పైనే పోయాయి.....భయంతో గడ్డ కట్టుకుపోయాను!!

(నవ్వుకుంటారు)

**కపిల :** ఈ సంగతి మనం ఎవరికి చెప్పినా నమ్మరు తెలుసా?

**పద్మిని :** మనం ఎవరికీ చెప్పొద్దు.

**దేవ :** మన రహస్యాన్ని మనలోనే వుంచుకుందాం.

**పద్మిని :** ఆ! 'లోపలే' దాచుకుందాం. (నవ్వుతారు)

**కపిల :** కాని చెప్పకుండా ఉండడం ఎట్లా? బయటి వాళ్ళకి తెలిసిపోదా?

**దేవ :** ఆ! ఎవ్వరికీ తెలియదు.

**కపిల :** వాళ్ళు తెలుసుకుంటారు.....నాకు తెలుసు.

**దేవ :** పందెమా?

**కపిల :** కాని వాళ్ళు గ్రహించకుండా ఎట్లావుంటారు?

**దేవ :** చూద్దాంగా! ఇప్పట్నుంచీ ఎందుకు మధన పడ్డం?

**పద్మిని :** లేవండి. ఇహ వెడదాం.

**కపిల :** చాల పొద్దు పోయింది.

**దేవ :** ఇహ ఉజ్జయనికి వెళ్ళడం లేదు....ఇంటికి వెడదాం.

**కపిల :** అవును...

**పద్మిని :** ఈ ఉజ్జయిని ప్రయాణం జీవితాంతం జ్ఞాపకం ఉంటుంది.

(ముగ్గురూ లేస్తారు. ప్రతీసారీ ఎవరో నవ్వడం, మిగిలిన వాళ్ళు గొంతు కలపడం.)

**పద్మిని :** దేవదత్తా! మీ తల్లిదండ్రుల నుంచి దీన్ని దాచండం ఎలా? నువ్వట్లా పైన ఏమీ లేకుండా కనిపిస్తే వాళ్ళకి అనుమానం రాదూ?

**దేవ :** ఏమీ రాదు....మనం ఏం చెప్పినా తేలికగా నమ్ముతారు.

**కపిల :** ఏమిటి నువ్వు అన్నది.

**దేవ :** ఆ! రోజూ చూసే వాళ్ళని అంత పరీక్షగా ఎవరు చూస్తారులే. పద.

**కపిల :** నేనన్నది అది కాదు.

పద్మిని : నీకు అంత ధైర్యం లేదు సుమా!...చివరకు ఇదంతా నా నెత్తికి వచ్చి పడుతుంది!!

దేవ : ఊరికే బెంబేలుపడకు. నేను బెబుతాగా!

కపిల : ఏమిటి నువ్వంటున్నది? ఆగు – ఇప్పుడు ఆవిడకి నీకు సంబంధం ఏమిటి?

దేవ : (కొంచెం ఆగి) ఏమిటినీ ఉద్దేశ్యం?

కపిల : ఏముంది? పద్మిని నాతో పాటు మా యింటికి వస్తుంది....ఆమె నా భార్య –

(దేవదత్తుడు, పద్మిని అతని వంక ఆశ్చర్యంగా చూస్తారు.)

పద్మిని : ఏమిటి కపిలా? ఏమంటున్నావ్?

కపిల : ఇందులో తెలియంది ఏముంది? నువ్వు దేవదత్తుడి భార్యవు. ఇప్పుడు దేవదత్తుడు శరీరం నాది!... అందుకని నువ్వు నాభార్యవు!

పద్మిని : నోరుముయ్యి.

దేవ : ఊరికే నోరు పారేసుకోకు, దేవదత్తుణ్ణి నేను!

పద్మిని : ఆ మాట అనడానికి నీకు సిగ్గుగా లేదు?

కపిల : అదేమిటి పద్మినీ! ఇప్పుడు దేవదత్తుడి శరీరం నాది!

దేవ : ఆ విషయం మాకు తెలుసు....చిలక పలుకుల్లా మళ్ళీ మళ్ళీ చెప్పక్కర్లేదు....మనిషికి శిరస్సే ప్రధానమని శాస్త్రాలన్నీ ఘోషిస్తున్నాయి.

కపిల : (కోపంతో) నీ శాస్త్రాలు తుంగలో తొక్కు..ఇప్పుడు తేలవలసింది ఆవిడ ఎవరి భార్య – అని? (కుడి చేయి చూపుతూ) పెళ్ళిలో ఆవిడ మెళ్ళో తాళి కట్టింది ఈ చెయ్యి.....ఇంత కాలం ఆవిడ జీవించింది ఈ శరీరంతో! ఆవిడ కడుపులో బిడ్డ ఈ శరీరం ఇచ్చిందే!

పద్మిని : (ఈ తర్కంతో భయపడిపోయింది) కాదు కాదు కాదు......అదేం కాదు....అలా జరగడానికి వీలు లేదు....అది నిజం కాదు, కదూ దేవదత్తా (దేవదత్త దగ్గరకు పోయి) అలా జరగదు గదా దేవదత్తా!

దేవ : ఏమీ జరగదు పద్మినీ!..వాడికి తెలియదు. (కపిలుడితో) పెళ్ళిలో అగ్ని సాక్షిగా ఒక్క వ్యక్తిని స్వీకరిస్తున్నామంటే – ఆ వ్యక్తి నే స్వీకరిస్తున్నాం కాని ఆ వ్యక్తి శరీరాన్ని కాదు.....పద్మిని దేవదత్తుడిని పెళ్ళి చేసుకుంది కాని దేవదత్తుడి శరీరాన్ని కాదు.

కపిల : అదే నీ వాదం అయితే, దేవదత్తుడి శరీరం నాది కనుక నేను దేవదత్తుణ్ణి అని నేనూ వాదిస్తాను.

దేవ : నా మాట విను..మనిషి శరీరంలో అత్యున్నతమైన భాగం శిరస్సు. దేవదత్తుడి శిరస్సు ఇది కనుక, నేనే దేవదత్తుడిని....మన శాస్త్రాల్లో –

కపిల : నీ శాస్త్రాలను గురించి నాకు చెప్పకు...నీ అవసరాలకి వాటిని ఎలాగయినా తిప్పుకోగలవు! అగ్నిసాక్షిగా ఆవిడ ఈ శరీరాన్ని పెళ్ళిచేసుకున్నది.....అది చాలు!

దేవ : (నవ్వి) విన్నావా పద్మినీ! ఒక పక్క తానే దేవదత్తుడిని అంటున్నాడు. మరో పక్క శాస్త్రాల్ని తిడుతున్నాడు, దేవదత్తుడు అటువంటి పని ఎప్పుడైనా చేస్తాడా?

కపిల : నువ్వు ఎన్ని శాస్త్రాలు వల్లించినా నాకు లెక్కలేదు. పద, పద్మినీ!

(ఆమెకు దగ్గరగా వస్తాడు....కాని దేవదత్తుడు ఇద్దరి మధ్యకూ వస్తాడు.)

దేవ : జాగ్రత్త!

పద్మిని : పద దేవదత్తా! ఈ పిచ్చివాడితో మాటలేమిటి? పోదాం పద.

దేవ : పద! (ఇద్దరూ వెళ్ళబోతారు)

కపిల : (వాళ్ళిద్దరి మధ్యకూ వచ్చి) నా భార్యను ఎక్కడికి తీసుకు వెడుతున్నావు, మిత్రమా?

దేవ : తప్పుకుంటావా, లేకపోతే –

కపిల : నా దోవకి అడ్డం వచ్చిన వాడివి నువ్వే!

దేవ : (కపిలుడ్ని పక్కకు నెడుతూ) పక్కకు తప్పుకోరా పశువా!

కపిల : (విజయ గర్వంతో) ఆ! కండబలం చూపిస్తున్నాడు! ఆ భాష!! పద్మినీ! ఆలోచించు. దేవదత్తుడు ఎప్పుడన్నా ఇట్లా ప్రవర్తిస్తాడా? ఇటువంటి భాష వాడతాడా?

దేవ : వెడదాం పద పద్మినీ –

కపిల : వెళ్ళు ....కాని నా భార్యతో నువ్వు వెళ్ళిపోతూ ఉంటే నేను చూస్తూ ఊరుకుంటానను కున్నావా?..ఎక్కడికి పోతావూ? మన ఊరి వీధుల్లో నిలబడి నలుగుర్నీ అడుగుతాను.....ఏం జరుగుతుందో చూద్దాం –

(దేవదత్తుడు ఆగాడు)

పద్మిని : అతని ఇష్టం వచ్చినట్టు వాగనీ! అవేమీ పట్టించుకోవద్దు.

దేవ : కాదు.....వాడు చెప్పింది నిజమే!..... ఈ విషయం ఇక్కడే తేల్చుకోవాలి.....ఊళ్ళోకి వెడితే అనవసరమైన అపవాదు.

పద్మిని : అక్కడ మాత్రం, అతని మాటలు ఎవరు నమ్ముతారు?.....నీ మొహం చూసి ఎవరైనా నువ్వే దేవదత్తుడి వనుకుంటారు.

కపిల : ఆగండి, ఆగండి. ధర్మపురిలో జనానికి నా ఒళ్ళు, నా ఒంటి సత్తా తెలియదనా?...ఎన్ని కుస్తీ పోటీల్లో చూడలేదు?...వాళ్ళు ఎవర్ని నమ్ముతారో చూద్దాం.

పద్మిని : (అతనితో వాదనకు దిగుతూ) మమ్మల్ని ఇట్లా ఎందుకు చిత్రవధ చేస్తావ్. ఇన్నాళ్ళు మాకు ఇంత కావలసినవాడివి మా ఇంట్లో ఉన్నావు; మా ఇంట్లో తిన్నావు!

కపిల : పద్మినీ! నీకేం కావాలో నాకు తెలియదను కున్నావా! దేవదత్తుడి మేధస్సు! కపిలుడి కండలు తిరిగిన ఒళ్ళు!!

పద్మిని : నోరుముయి! – నీ మాటలు వింటుంటే –

దేవ : ఒక వేళ అదే నిజమనుకో! అందులో తప్పేమిటి? కండలు తిరిగిన శరీరం చూస్తే ఏ స్త్రీ అయినా ఆకర్షింపబడుతుంది.

కపిల : అయితే మాత్రం? అంత మాత్రానా తన భర్తని కాని వాడితో వెళ్ళి ఉండి పోతుందా ఏ ఆడదైనా?

పద్మిని : (ఏడుస్తూ) ఈ దుర్మార్గుడి నుంచి తప్పించుకోవడం ఎట్లా? ....మనం ఎక్కడి కన్నా వెళ్ళిపోదాం – ఏ అడవుల్లోకో, ఎడారిలోకో – ఎక్కడికైనా సరే!

కపిల : నన్ను వదిలించుకోవాలంటే నన్ను చంపటం ఒక్కటే మార్గం.....ఇప్పుడు కపిలుడ్ని ఎదిరించగల సత్తా నాకు లేదు.

పద్మిని : కాని నిన్ను బతికించింది నేను!

కపిల : అదేమీ నా కోసం చెయ్యలేదు. బతికించి ఉండకపోతే ఈ సరికి నువ్వు విధవలా మిగిలేదానివి....నిజానికి నాకు కృతజ్ఞుడై ఉండాలి – నాభార్య అతన్ని రక్షించింది కనక...కాని, కాని – నా భార్యనే నా నుంచి తీసుకుపోదామనుకుంటే –

(పద్మిని ఏడుస్తుంది)

దేవ : ఇలా వాదించుకుంటూ కూర్చుంటే మనం ఎక్కడికీ తేలం కపిలా!

కపిల : నన్ను దేవదత్తా అని పిలు.

దేవ : నువ్వు ఎవరివయినా ఈ సమస్యకు పరిష్కారం కాదు.

కపిల : నిజమే! పెళ్ళనేది కాయితాల మీద రాసుకునే షరతుల పత్రం అయితే ఇది పరిష్కారం కావచ్చు.....కాని పద్మిని కోరిక మాత్రమే పరిష్కారం ఎట్లా అవుతుంది?

దేవ : మరి ఏమిటి దీనికి పరిష్కారం?

(అందరూ నిశ్చేతనంగా నిలబడతారు)

భాగ : ఈ సమస్యకి పరిష్కారం ఏమిటి? ఈ ముగ్గురి భవితవ్యాన్ని తలకిందులు చేసే సమస్యకి పరిష్కారం కనుక్కోవడం ఎలా? పోనీ, వాళ్ళ కర్మకి వాళ్ళని వదిలేద్దామా అంటే – ప్రేక్షకుల మెడకి ఒక ప్రశ్నని తగిలించి – ఇహ వెళ్ళిరండి, మంగళం – అనడం వాళ్ళని అవమానించడం కాదూ? ....మనం ఈ సమస్యని ఎదుర్కోవలసిందే!.....కాని సమస్య అతి జటిలమయింది దానికి సమాధానాన్ని కూడా అతి జాగ్రత్తగా కనుక్కోవాలి. తొందరపడితే మొదటికే మోసం కావచ్చు. అందుకని పదినిమిషాలు విశ్రింత నిస్తున్నాం. కాస్త వేడివేడి టీ తాగా ఈ విషయాన్ని గురించి ఆలోచించండి......మీ మీ సమాధానాలతో తిరిగిరండి. పరిష్కార మార్గాన్ని అప్పుడు ఆలోచిద్దాం.

(ఒక తెర తీసుకువస్తారు. కదలకుండా నిలబడ్డ ముగ్గురూ దాని వెనకగా ఉండి పోతారు.)

## రెండవ అంకం

భాగ : ఈ సమస్యకి పరిష్కారం ఏమిటి?....ఈ ముగ్గురి భవితవ్యాన్ని తలకిందులు చేసే ఈ సమస్యకి పరిష్కారం ఏమిటి?

చాలా యుగాల కిందట సూర్యుడినే మించిన చక్రవర్తిగా పేరు పొందిన విక్రమార్క మహారాజును భేతాళుడు ఇదే ప్రశ్న అడిగాడు. ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా విక్రమార్కుడు పరిష్కారం చెప్పాడు. ఆయన శాస్త్రాలు ఆధారంగా చెప్పిన సమాధానం మా ప్రేక్షకులకు ఆమోదయోగ్యమో కాదో తెలియదు కాని

తలలో నాలుక చెప్పిన మాటలు
నమ్మకూడని నీటి మూటలు!
బ్రహ్మదేవుడే వేరు చేసిన
నుదిటి రాతను నమ్మేదెట్లా?
బుద్ధికాదని తోసిపుచ్చితే –
చేయిచూసిన నిజము తెలియున?
మనిషి నరముల కింద పారే!
నదుల లోతులు తెలియవలెగద!

అదీ మనం చెయ్యవలసిన పని!....అందువల్ల దురదృష్టవంతులైన మన ముగ్గురు మిత్రులూ తమ సమస్యని పరిష్కరించవలసిందిగా ఓ గొప్ప రుషిని కోరారు. ఆ రుషి – బహుశా విక్రమార్క మహారాజు చెప్పిన పరిష్కారం జ్ఞాపకం ఉందేమో – తన తీర్పును ఇట్లా చెప్పాడు:

వృక్షాలలో దేవతా వృక్షమైన కల్పవృక్షం ఎంత ఉత్తమమయిందో
అలాగే మానవ శరీరంలోని భాగాలన్నింటిలో ఉత్తమమైనది శిరోభాగమే!
అందువల్ల దేవదత్తుని శిరసు ఉన్న వ్యక్తే దేవదత్తుడు...
అతడే పద్మినికి నిజమైన భర్త.

(అప్పటిదాకా అచేతనంగా నిలబడ్డ ముగ్గురూ ఈ లోకంలోకి వచ్చారు. దేవదత్త పద్మినిలు ఆనందంతో ఆడుతూ పాడుతూ వుంటారు. కపిలుడు కాళ్ళీడ్చుకుంటూ మరో మూలకు వెడతాడు.)

దేవ : నా ప్రాణదాయినీ!....నా ఆనందరాశీ!

పద్మిని : నా జీవిత చక్రవర్తీ!.....నా సర్వస్వమా!

దేవ : నా జీవితంలోకి వచ్చిన తటిల్లతవి నువ్వు!

పద్మిని : నా కలల పంటవి నువ్వు!!

దేవ : నా కలలరాణివి నువ్వు!

పద్మిని : రా!.....వెడదాం పద......

దేవ : పద.....మర్రిచెట్ల గొడుగు నీడల్లో.......ప్రకృతిమాత ఒడిలో హాయిగా పవళిద్దాం – పద.

పద్మిని : ఎంత విశాలమైన వక్షస్థలం! ఇహ నాకు మరో గొడుగెందుకు? పద – .......ఆగు (కపిలుడి దగ్గరకు పోయి) కపిలా! అలా విచారంగా ఉండు......మళ్ళీ కలుసుకుందాం. సరేనా? (గొంతు తగ్గించి) దేవదత్తుడితో వెళ్ళడం నా విధి....కాని నీ శరీరంతో వెడుతున్నాను! ఆ సంగతి గుర్తుంచుకుని సంతోషంగా ఉండు. (దేవదత్తుడు దగ్గరకు వెళ్ళి) వెళ్ళొస్తాను. కపిలా! (నవ్వుతూ ఇద్దరూ వెళ్ళిపోతారు)

(భాగవత కపిలుడి దగ్గరకు వస్తాడు)

భాగ : కపిలా!.....కపిలా!....బాధపడకు. ఇదంతా కర్మ!

కపిల : 'కపిలా' ఏమిటి? నేను....నేను కపిలుణ్ణా? ఎందుకు? ఎట్లా?

(వెళ్ళిపోతాడు)

భాగ : ఈ విధంగా వాళ్ళదారులు విడిపోతాయి. కపిలుడు ఆ అరణ్యాలలోనే ఉండిపోతాడు. మళ్ళీ ధర్మపురి మొహం చూడలేదు.......ఇహ దేవదత్తుడు, పద్మినీ అంటారా? వాళ్ళు ధర్మపురి చేరి సంసార సుఖంలో తలమునకలుగా ఉన్నారు.......

(పద్మిని వచ్చి కూర్చుంది......ఏదో కుడుతుంది.........దేవదత్తుడు వచ్చాడు. రెండు పెద్ద బొమ్మల్ని పట్టుకువచ్చాడు.......దేవదత్తుడు నిశ్శబ్దంగా వచ్చి పద్మిని వెనకాల నిలబడ్డాడు.)

దేవ : (దడిపిస్తూ) ఓయ్......

పద్మిని : (ఉలిక్కిపడి) ఓ!.....ఎంత భయపెట్టావు! చూశావా! ఈ సూది గుచ్చుకుంది....చూడు! రక్తం కారుతోంది.

దేవ : అరెరె! నిజంగానే!...ఈ వేలు నా నోట్లో పెట్టు. రక్తం ఆగిపోతుంది.

పద్మిని : ఫరవాలేదు....ఆ పని నేను చేసుకోగలను. (బొమ్మల్ని చూసి) అరె! ఎంత బాగున్నాయి! ఎవరి కోసం ఇవి?

దేవ : ఎవరి కోసమా?..మన కోసమే!..మన ఇంట్లోకి ఓ అతిథిగారు వేంచేస్తున్నారు కదా! ఆయన గారికి ఆడుకోవడానికి స్నేహితులు కావద్దూ?

పద్మిని : (సిగ్గుపడుతూ) ఆ అతిథి రావడానికి ఇంకా చాలా నెలలు పడుతుంది.

దేవ : నాకూ తెలుసునండీ!...కాని ఇటువంటి మంచి బొమ్మలు కావాలనుకున్నప్పుడల్లా దొరుకుతాయా? ఇవి ఉజ్జయినీ జాతర నుంచి తెచ్చినవి!!

పద్మిని : అబ్బా! ఎంత ముద్దొస్తున్నాయో! (దగ్గరకు తీసుకుంటూ) నిజం మనుషుల్లా ఉన్నాయి!...ఆ మెరిసే కళ్ళు!! ఆ నిగనిగలాడే బుగ్గలు! (వాటిని ముద్దుపెట్టుకుంటూ, దేవదత్తుడితో) ఆ! ఇక్కడ కూర్చుని ఉజ్జయినీ జాతరలో ఏం జరిగిందో అంతా చెప్పు.......నన్ను తీసుకు వెళ్ళలేదుగా!!

దేవ : ఎట్లా తీసుకువెళ్ళను? నువ్విట్లా ఉండే? నేను కూడా – నువ్వు అమ్మవారికిచ్చిన మొక్కు చెల్లించడం కోసమే వెళ్ళాను....అక్కడ ఓ తమాషా జరిగింది తెలుసా? అక్కడో గరిడీశాల ఉంది. గాంధర్వ

దేశం నుంచి ఓ మల్లుడు వచ్చాడు. నాతో ఎవరన్నా మల్ల యుద్ధం చెయ్యగలరా – అని సవాలు చేశాడు...నాకేం జరిగిందో తెలియదు. ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా నేను మల్ల యుద్దానికి గరిడీలోకి దూకాను!

పద్మిని : నిజంగా! ఇది వరకెప్పుడూ నువ్వు మల్లయుద్ధం చేయలేదుగా!

దేవ : నిజమే! కాని నాకు ఆ ఆలోచనే రాలేదు....రెండు నిమిషాల్లో ఆ యోధుడిని మట్టి కరిపించాను.

పద్మిని : నాకు తెలిసిన వాళ్ళు కూడా ఇది చూసి ఆశ్చర్యపోయారు.

పద్మిని : ఆ రోజున వ్యాయామశాలలో ఒక యోధుడిని కత్తి యుద్ధంలో జయించావు. ఇవ్వాళ ఇది! ఇలా మాటిమాటికి చేస్తే – జనం అనుమానిస్తారు.

దేవ : ఆ! ఎవ్వరూ అనుమానించరు...పైన చొక్కా కూడా లేకుండా బరిలో నిలబడ్డానా, ఎవ్వరూ ఏమీ అనలేదు. పైగా ఒక స్నేహితుడు ఇద కపిలుడి దగ్గర్నుంచి నేర్చుకున్నావా ఏమిటి? – అని అడిగాడు.

పద్మిని : (నవ్వుతూ) అక్కడ నేర్చుకున్నదేగా?

దేవ : ఇవ్వాళ్టిదాకా ఏమనుకునే వాణ్ణో తెలుసా? బరిలోకి దిగినప్పుడు బుద్ధిబలం చాలా అవసరం, జాగ్రత్తగా ఆలోచించి ఏ దెబ్బ ఎట్లా కొట్టాలో ఆలోచించి చెయ్యాలి. అని. కాని ఈ శరీరం ఆగితేనా?...బరిలోకి దూకడమే!

పద్మిని : కండలు తిరిగిన ఈ శరీర బలం! పదునైన ఆ బుద్ధి బలం!.....ఓ! ఈ దేవదత్తుడు నాకే దేవుడిచ్చిన వరం!

దేవ : ఇన్ని రోజులు నిద్రాహారాలు లేకుండా తిరుగుతున్నానా, కాస్తంత అలసట కూడా లేదనుకో! (లేచి) పద! ఇప్పుడు మన ఊరి సరస్సు దగ్గరికి మన విహారయాత్ర! హాయిగా ఈత కొట్టాలనిపిస్తోంది! పోదాం పద!

పద్మిని : (కొంచెం అపహాస్యంగా) ఈ పరిస్థితులలోనా?

దేవ : (నవ్వుతూ) నిన్ను ఈత కొట్టమనలేదుగా! ఒడ్డున కూర్చో! మనకి పిల్లవాడు పుట్టగానే నీకూ ఈత నేర్పుతాను.

పద్మిని : పిల్లవాడు, పిల్లవాడు అంటున్నావు! ఒక వేళ అమ్మాయి పుడితేనో?

దేవ : నీ లాంటి అమ్మాయి పుడితే – మీ ఇద్దరికీ కలిపి నేర్పుతాను.

పద్మిని : (నవ్వుతూ) నేను సిద్ధమే! (దగ్గరకు తీసుకుంటాడు) అదుగో విహార యాత్ర అన్నావు!

దేవ : నిజమే! ముందు పనులు ముందే! పద.

పద్మిని : (వెడుతూ, ఆగి) దేవదత్తా!

దేవ : ఆ!

పద్మిని : నీ ఒంటికి ఆ చందనం నూనె రాసుకుంటావెందుకు?

దేవ : నాకు బావుంటుంది.

పద్మిని : నిజమే!...కాని –

దేవ : ఏమిటో చెప్పు –

పద్మిని : (తొట్రుపాటుగానే) ఇది వరకు నీ ఒళ్ళు ఘాటుగా చక్కని వాసన వచ్చేది.....అది నాకు ఇష్టం!

దేవ : ఆ చందనం నూనెని నేను చిన్నప్పటినుంచీ వాడుతున్నాను.

పద్మిని : అది కాదు....మనం కాళిగుడి నుంచి తిరిగొచ్చాం.........అప్పుడు నీ ఒళ్ళు ఎంత చక్కని వాసన వేసేదో!

దేవ : (నమ్మలేనట్లు) ఆ స్నానం పానం లేని కపిలుడి ఒంటి వాసనా! ఆ వాసన నీకు నచ్చిందా?

పద్మిని : (ఆ మాటని మారుస్తూ) ఆ! ఊరికే అన్నాను...పద. మనం ఇప్పుడు మనం బయలుదేరకపోతే ఆలస్య అయిపోతుంది.

(వాళ్ళు వెళ్ళారు.....నిశ్శబ్దం)

మొ.బొ : ఈ ఇల్లు బాగానే వుందనుకుంటా!

రెం.బొ : ఫరవాలేదు......ఇంతకన్నా నాసిరకం ఇల్లు వస్తుందని భయపడ్డాను!

మొ.బొ : మన తాహతుకి ఈ మాత్రమన్నా ఉండొద్దు! నిజానికి మన అందానికి రాజసౌధం రావాల్సింది!

రెం.బొ : దానితో పాటు ఆడుకోవడానికి ఓ యువరాజు ఉండాల్సింది!

మొ.బొ :జాతరలో పిల్లలంతా మనవంక ఎట్లా చూశారు! కళ్ళు పత్తి కాయల్లా పెద్దవి చేసుకుని!!

రెం.బొ : వాళ్ళ అమ్మలు! మన వంక చూస్తుంటేనే వాళ్ళకి నోట్లో................

మొ.బొ : కాని ఆ మగవెధవలే!......ముక్కుపుటాలు పెద్దవి చేసి "చాలా ఖరీదు" అనడమే!

రెం.బొ : మనల్ని డబ్బుతో కొలవడం! వాళ్ళు ఎవరమనుకుంటున్నారు!!

మొ.బొ : రాకుమారులే మనకు తగిన వాళ్ళు!

రెం.బొ : ప్రతి రోజు మనల్ని తుడవాలి.

మొ.బొ : సిల్కుగుడ్డలు తొడగాలి.

రెం.బొ : మెత్తటి పరుపుల మీద కూర్చోపెట్టాలి.

మొ.బొ : ప్రతివారం కొత్త బట్టలు తొడగాలి.

రెం.బొ : ఆ బొమ్మల కొట్టువాడికి బుద్ధి ఉన్నట్టయితే, మనల్ని అమ్మేవాడే కాదు.

మొ.బొ : వాడికి బుద్ది ఉంటే, మనల్ని ఈయనకి అమ్మేవాడు కాదు.

రెం.బొ : ఆ చేతులు చూడు – గరుగ్గా – ఒరుసుకుపోయింది.

మొ.బొ : అరచేతులేమో తుమ్మ మొద్దులనుకో!

రెం.బొ : అమ్మో! ఆ పట్టుకోవడం! – ఉడుం పట్టేననుకో!

మొ.బొ : నా జబ్బలు ఇంకా నొప్పిగా ఉన్నాయి.

రెం.బొ : వీడి దగ్గరా మనం ఉండడం! ఒట్టి పల్లెటూరి బైతు!

(దేవదత్తుడి పరుగు పరుగున వచ్చి ఆ బొమ్మలిన తీసుకుని ముద్దు లాడి పైకి ఎగరేస్తాడు)

దేవ : నా చిన్నారి బొమ్మలూ! మీ రాకుమారుడు వచ్చేశాడు......వచ్చేశాడు....

మొ.బొ : అబ్బా ఒఠ్ఠి మోటు వెధవ.

రెం.బొ : మృగం! ఒఠ్ఠి అడవి మృగం!

దేవ : (భాగవత దగ్గరకు పోయి) అయ్య! ఈ తీసి తీసుకోండి.....రేపు మా యింట్లో పండగ. మీరంతా

రావాలి సుమండీ!

భాగ : ఏమిటి విశేషం!

దేవ : మీరింకా వినలేదా?...నాకు కొడుకు పుట్టాడు.....బంగారం లాంటి పిల్లాడు..గులాబి పువ్వేననుకోండి.....

(అంటూ ఆనందంగా అడుగులు వేస్తూ వెళ్లిపోతాడు.)

మొ.బొ : ఆ శనిగాడు ఇంకా నిద్రపోతున్నాడా?

రెం.బొ : అనుకుంటూ! అబ్బా! చచ్చిన చావు అవుతున్నదనుకో!

మొ.బొ : రోజంతా! ఒకటే ఏడుపు!

రెం.బొ : యాక్! పావుగంట కొకసారి ఒళ్ళంతా ఖరాబు చేసుకోవడమే!

మొ.బొ : ఏ స్థితికి వచ్చి పడ్డాం! .....అసలు ఈ దేవుణ్ణి నమ్మకూడదులే!

రెం.బొ : మన తప్పు కూడా ఉందిలే! ఆవిడ –కలల్లో ఆ పిల్లాడిని చూసుకుంటూ మురిసిపోతున్నప్పుడే మనకు తెలిసి ఉండాల్సింది!

మొ.బొ : మనకేం తెలుసు ఈ రాక్షసుణ్ణి లోపల దాచుకుందని!

రెం.బొ : ఎట్లా లావవుతూ పోయిందో! వారవారానికి! రోజు రోజుకూ!...ఎవరో లోపలికి గాలి ఊదుతున్నట్టు!

మొ.బొ : అబ్బ!..అప్పుడు ఎంత వెగటుగా ఉంది!

రెం.బొ : ఆ! మొగుడికి మాత్రం కాదులే!

మొ.బొ : ఒంటరిగా ఉంటే చాలు. ఆ కడుపు మీద చెయ్యివేయడం – "తంతున్నాడా" అని అడగడమే!

రెం.బొ : మన జాగ్రత్తలో మనం ఉండాల్సింది!

మొ.బొ : జాగ్రత్తలో ఉండాలనుకుంటూనే ఉన్నాం –

రెం.బొ : ఇంతలో ఈ శనిగాడు తయారైనాడు!

మొ.బొ : మాంసంముద్ద!

రెం.బొ : కళ్ళు, చెవులూ కూడా సరిగ్గా లేవు చూశావా?

మొ.బొ : అయితేయేం? ఎప్పుడూ వాడిని చూసి మురవడమే!

రెం.బొ : ఛీ!

మొ.బొ : యాక్!

(దేవదత్త, పద్మిని పిల్లవాడిని ఆడిస్తూ, లాలిస్తూ తీసుకువచ్చి బయటకు వెడతారు.)

మొ.బొ : చూశావా! సాలీడు నా బుజం మీద గూడు పెట్టింది.

రెం.బొ : నిన్న ఓ ఎలుక నా ముక్కు కొరికింది.

మొ.బొ : మొన్న – ఓ బొద్దింక నా ఎడం కన్ను తినేసింది.

రెం.బొ : ఆర్నెల్లు!....మనల్ని ఒక్కళ్ళు ముట్టుకోలేదు.

మొ.బొ : ఆర్నెల్లలో ఈ స్థితికి వచ్చాం. సంవత్సరం అయితే ఎట్లా వుంటామో?

(పద్మిని, దేవదత్త వచ్చారు.)

పద్మిని : ఇటు విను –

దేవ : ఏమిటి?

పద్మిని : ఈ సారైనా "వద్దు" అనకూడదు – సరేనా?

దేవ : దేనికి?

పద్మిని : పిల్లవాడిని అట్లాబయటకు మన ఊరి సరస్సు దగ్గరికి తీసుకపోదాం –

దేవ : ఇంత చలిలోనా?

పద్మిని : చలి అయితే యేం? ఇప్పుడు కాస్త పెద్దవాడయ్యాడు కదా? ఇంకా అట్లాగే పెంచితే ఎలా? నన్ను చూడు? చలి, వాన, ఎండ అనక హాయగా పెరిగాను....నాకేం కాలేదు..చక్కగా ఉన్నాను.

దేవ : వద్దులే! అది అందరికీ శ్రమ!

పద్మిని : శ్రమ అంటావేమిటి? ఈ మధ్య ఇట్లా అవుతున్నావేం నువ్వు? రోజంతా ఇంట్లోనే కూర్చుంటావ్! బయటకు పద చలనం లేదు. ఈత కొట్టడం, ఆటలాడడం – అన్నీ మరిచిపోయావు.

దేవ : నును పండిత వంశంలో పుట్టాను. నా విధి –

పద్మిని : ఆ సంగతి చాలా సార్లు విన్నాను –

దేవ : మొదట్లో – కొత్తగా ఉంది కనక – సరదాగా ఉండేది. ఆ దూకుడు, ఆ కండబలం...ఎప్పుడూ అలాగే వుండాలంటే ఎట్లా? వంశ మర్యాద, సంప్రదాయం, నడిపించాలి గదా?

పద్మిని : ఏమో! నాకు తెలియదులే.

దేవ : (అనునయంగా) ఇటు చూడు పద్మినీ!

(ఆమె బుజం మీద చెయ్యి వేస్తాడు. ఆమె విదిలించుకుంటుంది)

ఏమిటి? ఏమయింది?

పద్మిని : ఏమిటో....నాకే తెలియదు. ఎందుకో – ఒక్కసారి ఒళ్ళు జలదరించినట్లు అయింది......(నిశ్శబ్దం)

దేవ : (కొంచెం ఆగి) "ధరమసింధు" పుస్తకాన్ని ఎక్కడన్నా చూశావా? దాన కోసం వెతుకుతున్నాను.

పద్మిని : ఆ పుస్తకాల బీరువా మీద చూసినట్లు జ్ఞాపకం......

(దేవదత్తుడు మొదటి బొమ్మ దగ్గరకు పోయి, దానిని పక్కకు తోసి పుస్తకం తీసుకుంటాడు. మొదటి బొమ్మ బుజాలు కదిలించింది.)

రెం.బొ : ఏమిటి? ఏమయింది?

మొ.బొ : అబ్బా! నన్ను ముట్టుకున్నాడు!

రెం.బొ : అయితే!

మొ.బొ : మనల్ని ఇక్కడికి తెచ్చినప్పుడు ఆ చేతులు ఎంత గరుగ్గా ఉండేవి? ఇప్పుడు చూడు, దూదిపింజల్లా –

రెం.బొ : మరొకటి చూశావా?

మొ.బొ : ఏమిటది?

రెం.బొ : వాడి బొజ్జ! ఇది వరకు ఒళ్ళంతా గట్టిగా కండరాలు కనిపిస్తూ ఉండేది. ఇప్పుడు –

**మొ.బొ** : మెత్తగా ఉంది.

**రెం.బొ** : (పొట్టను చూపుతూ) ఇది కూడా పెరుగుతుంది?

**మొ.బొ** : ఆ! ముందర కొంచెం (చూపుతుంది)

**రెం.బొ** : ఆ తరువాత మరికొంచెం.

**మొ.బొ** : ఇంకా కొంచెం –

**రెం.బొ** : ఇంకా.....ఇంకా –

**మొ.బొ** : ఆడదైతే!

**రెం.బొ** : పిల్లాడు పుడతాడు

.......................

(పద్మిని పిల్లవాడిని నిద్రపుచ్చుతూ వస్తుంది. జోలపాడుతూ )

వచ్చేను వచ్చేను! రేతౌడకు తచ్చేను
ఏ వూరివాడో? ఏ పేరువాడో?
తలమీద పాగతో! మెడలోన మెరిసేటి!
మల్లెపూలదండలతో! వచ్చేను వచ్చేను!!
పటాకత్తి చేపట్టి! వజ్రాల పిడివున్న
పటా కత్తి చేపట్టి
మెరిసేటి తెలతెల్ల! వస్త్రాలు ధరియించి
తెల్లని గుర్రమెక్కి! వచ్చేను వచ్చేను!!

నిదురపో నా తండ్రి
నిదురపో నిదురపో!!
ఆ మల్లెలు మెల్లలు
ఎర్రనా మెను ఏలణ
అరవిచ్చిన కన్నుల్లో
నీలి నీడలు ఏల?
ఆ నవ యౌవనా కారు
డేల చల్లా నాయె!!

ఆ అశ్వామ్మో పరుగెత్తి కొండకోనలు దాటె
ఏ ఊరు పయనామో ఎరుగరాదెవరికి!!

(ఈ పాట మధ్యలో దేవదత్తుడు వచ్చాడు. పద్మిని పక్కనే పుస్తకం చదువుతూ కూర్చున్నాడు. పాట అయిపోగానే ఇద్దరూ నిద్రలో ఒరిగిపోయారు)

మొ.బొ : (గొంతు తగ్గించి) ఏయ్!

రెం.బొ : ఏమిటి?

మొ.బొ : చూడు –

రెం.బొ : ఎక్కడ?

మొ.బొ : ఆవిడ కనురెప్పల వెనక.....మళ్ళీ కల!

రెం.బొ : నాకేం కనిపించడం లేదు.

మొ.బొ : ఇంకా మసకగా ఉంది. కల మొదలు కాలేదు....ఇప్పుడు?

రెం.బొ : ఆ!...కనిపిస్తోంది.

మొ.బొ : ఎవరో మగవాడు –

రెం.బొ : మొగుడుకాదు!

మొ.బొ : కాదు. ఇంకెవరో!

రెం.బొ : రాత్రి వచ్చింది కూడా వీడేనా?

మొ.బొ : ఆ! వీడే! అప్పుడు వీడి మొహం కనిపించలా...

రెం.బొ : ఇప్పుడు కనిపిస్తోంది చూడు!...బావున్నాడ్రోయ్!...కాని, మొరటు! పనివాడిలా ఉన్నాడు......కాని ఒళ్ళు మాత్రం బావుంది!

మొ.బొ : ఎవరో ఇతను?

రెం.బొ : అదుగో!...కల కరిగిపోతోంది. మొహం జ్ఞాపకం ఉందా?

మొ.బొ : అయ్యో! కల కరిగిపోయిందే!

రెం.బొ : రేపటికి ఈ కల సంగతే గుర్తు రాదులే!

(దేవదత్తుడు, పద్మిని లేచారు)

పద్మిని : ఒంట్లో బాగులేదా?

దేవ : ఏం?

పద్మిని : నిద్రలో మూలిగావు, రాత్రంతా!

దేవ : మూలిగానా?

పద్మిని : ఆ! బాగాలేదా?

దేవ : ఎవరికి? నాకా? బాగానే వుందే.

(చాల బలం ఉన్నవాడిలా గబుక్కున లేస్తాడు. వెంటనే బుజం పట్టుకుపోయినట్లు మూలుగుతాడు)

పద్మిని : ఏమయింది? చెప్పు –

దేవ : (ఆమె వంక చూడకుండా) ఏమీలేదు. నిన్న ఉదయం వ్యాయామశాలకు వెళ్ళాను. ఆ తరువాత ఈత కొట్టడానికి –

పద్మిని : వ్యాయామశాలకా? ఇన్నేళ్ళ తరువాత? కాని, ఎందుకు?

దేవ : వెళ్ళాలనిపించింది అంతే! దాన్ని గురించి ఊరికే ఇదయిపోకు.

పద్మిని : (ఏమీ వ్యగ్యం లేకుండా) ఇవ్వాళ కూడా వెడుతున్నావా?

దేవ : (కోపంతో రెచ్చిపోయి) లేదు. వెళ్లడం లేదు. ఇందులో నవ్వాల్సిందేమీ లేదు. ఒకసారి వెళ్ళి నవ్వులపాలయినాను ఇక వెళ్ళను. (బయటకు వెళ్ళాడు..నిశ్శబ్దం)

పద్మిని : దేనిని గురించి భయపడుతున్నావు దేవదత్తా? మళ్ళీ నీ ఒళ్లు మెత్తగా అయి, నీ కండరాలు సడలిపోతే యేం? నేను వెనకటి మూర్ఖురాలిని కాదు.......కపిలుడు నా జీవితంలోంచి పూర్తిగా వెళ్ళిపోయాడు... ఎప్పటకీ మళ్లీ రానివ్వను. (నిశ్శబ్దం) కపిలుడు! ఇప్పుడేం చేస్తూ ఉండివుంటాడో? ఎక్కడ ఉన్నాడో? ఇంకా అతని ఒళ్ళు తెల్లగాను ముఖం నల్లగానూ ఉండి ఉంటుందా? (కొంచెం సేపు అయ్యాక) దేవదత్తుడు మారుడు. కపిలుడు మారే వుంటాడు.....మరి నేను?

(కళ్ళు మూసుకుంది)

మొ.బొ : అదుగో! మళ్ళీ వస్తున్నాడు.

రెం.బొ : మిట్ట మధ్యాహ్నమా?

మొ.బొ : మామూలుగా వచ్చే వాడిలా లేదు....అంతకన్నా మొరటుగా, నల్లగా

రెం.బొ : వాడేనా మొహం సరిగ్గా చూడు –

మొ.బొ : దగ్గరికి వెడుతున్నాడ్రోయ్!

రెం.బొ : మరీ దగ్గరకి!

మొ.బొ : (రహస్యంగా) ఏం చేస్తాడో?

రెం.బొ : ఏం చేస్తాడు? (చూస్తారు)

మొ.బొ : చెట్టెక్కుతున్నాడ్రా!

రెం.బొ : (ఏడుపు గొంతుతో) అక్కణ్ణుంచి అమాంతం చెరువులోకి దూకాడే?

మొ.బొ : అందుకోసమా వచ్చింది?

రెం.బొ : అదుగో!...కల...పోతోంది.

మొ.బొ : వెధవ కలలు! కనిపించనట్టు కనిపించి మాయమైపోతాయి.

(పద్మిని ఏడుస్తున్న పిల్లవాడిని ఉయ్యాలలో పడుకోబెట్టి జోకొట్టింది.)

పద్మిని : (తన మీద తనకే అసహ్యంగా) మార్పు....మార్పు...మార్పు! ఇసక రేణువులా తునాతునకలౌతాయి... కుండ నీటితో నిండిపోతుంది. చంద్రుడేమో – ఊరికే ఊగుతూ వుంటాడు! వెలుగు నుంచి చీకటికి, చీకటి నుంచి వెలుగుకు.

(దేవదత్తుడు వచ్చాడు. నాటకం మొదట్లో ఎట్లా వున్నాడో అట్లా ఉన్నాడు.)

దేవ : పద్మినీ! ఒక పండితుడు నన్ను చూడడానికి వస్తున్నాడు!...కాస్త తీపి, నిమ్మరసం తయారు చెయ్యగలవా?

పద్మిని : అలాగే!....(ఆగి) ఇది విన్నారా!....పని మనిషి చెప్పింది....

దేవ : ఏమిటది?

పద్మిని : కపిలుడి తల్లి చనిపోయిందట! (ఆగి) పాపం! ఆవిడ ఇన్నేళ్ళు మంచంలోనే తీసుకుంది......ఆనాటి

నుంచీ –

దేవ : (మాటతుంచేస్తూ) దానికి నన్నే చెయ్యమంటావు? (తప్పు చేసినవాడదిలా) నిమ్మరసం చెయ్యి – (ఇద్దరూ వెడతారు)

మొ.బొ : ఎవడి కర్మ వాడిది.

రెం.బొ : ఎవడి ఇబ్బందులు వాడివి.

మొ.బొ : మన బొమ్మల కొట్టువాడు చెప్పినట్టు "ఎటువంటి రోజులు వచ్చి పడ్డాయి"

రెం.బొ : ముఖ్యంగా కిందటి రాత్రి..అదే....ఆ కల –

మొ.బొ : చ్....చ్....అటువంటి విషయాలు మాట్లాడకు.

రెం.బొ : సిగ్గూ శరం లేకుండా!

మొ.బొ : ఊరుకోమని చెప్పానా?

రెం.బొ : నిజంగా – వాళ్ళిద్దరూ –

మొ.బొ: ఆ విషయం మాట్లాడాలనుకుంటే – నన్ను మాట్లాడనీ!

రెం.బొ : ఆ సంగతి మాట్లాడనే వద్దన్నావే! ఇప్పుడు!

మొ.బొ : నీకు తెలియదులే! వాళ్ళు –

రెం.బొ : నీకేం తెలుసు? కిందటి రాత్రి –

మొ.బొ : నన్ను చెప్పనీ – కలలో –

రెం.బొ : నేను –

మొ.బొ : నోరుముయ్యి.

రెం.బొ : నువ్వే మూసుకో –

(రెండూ కొట్టుకుంటాయి. బట్టలు చింపుకుంటాయి. అలిసిపోయి ఒకదాని పక్కన ఒకటి కూర్చుని నవ్వుకుంటాయి)

(పద్మిని వచ్చి ఆ బొమ్మల వంక చూసింది)

పద్మిని : అయ్యయ్యో! ఆ బొమ్మలు! పిల్లవాడు ఎట్లా పాడు చేశాడో! (పిలుస్తూ) ఇటువినండి –

దేవ : (వస్తూ) ఏమిటి?

పద్మిని : ఈ బొమ్మలు చూడండి! ఎట్లా అయిపోయాయో! పిల్లాడికి కొత్త బొమ్మలు తేవాలి.

దేవ : నిజమే! నేను చూడనే లేదు.

పద్మిని : ఉజ్జయినీ జాతర ఇంకా నాలుగైదు రోజుల్లో ఉంది...కొత్త బొమ్మలు కొనుక్కురండి..ఇవాళ బయలుదేరితే సరిగ్గా జాతర వేళకి చేరుకుంటారు...చిరిగిని బొమ్మలు ఇంట్లో వుండడం అశుభం!

మొ.బొ : విన్నావా! మనల్ని బయట పారేస్తారుట!

రెం.బొ : కొత్త బొమ్మలు కావాలట!

మొ.బొ : దొంగ మొహం.

రెం.బొ : టక్కులాడి.

మొ.బొ : దీని యిల్లు నేటగట్టా!

రెం.బొ : దీని పళ్ళు ఊడిపోనూ!

దేవ : (పద్మినితో) అట్లాగే!

(రెండు బొమ్మల్నీ మెడ దగ్గర పట్టుకుంటాడు)

మొ.బొ : చూడు. ఎట్లా పట్టుకున్నాడో! కుక్క పిల్లల్ని పట్టుకున్నట్టు!

రెం.బొ : ఆ మాంసం ముద్దగాడేమో ఉయ్యాలలోనా? మనమేమో పెంటకుప్ప మీద!

దేవ : ఉజ్జయిని వెళ్ళి రావడానికి వారం పైన పడుతుంది – పోనీ, మన పక్క వాళ్ళెవరన్నా వెడుతూ వుంటే తీసుకురమ్మని చెప్పనా?

మొ.బొ : ఒరేయ్ పిచ్చి వెధవా!....మమ్మల్ని బయటకి విసిరి వేసేముందు నీ గతేమిటో చేసుకో!

రెం.బొ : మా చింపి గుడ్డల కన్నా ముందు మీ ఆవిడని చూసుకో. నిండా కప్పుకోమను.

పద్మిని : (దేవదత్తుడితో) వాళ్ళు ఎటువంటి బొమ్మలు తెస్తారో ఏమో? మన పిల్లవాడికి మనమే తెచుచకోవాలి గాని –

దేవ : కాని –

పద్మిని : వెళ్ళడం ఇష్టం లేకపోతే ఆ మాట చెప్పరాదూ?

దేవ : పోనీ, మన పనివాడిని తోడుపడుకోమని చెప్పనా?

పద్మిని : ఏమీ అక్కర్లేదు. మన మేమన్నా అడవిలో ఉన్నామా?

మొ.బొ : సరిగ్గా చూడరా వెధవాయి!

రెం.బొ : వెళ్ళనని చెప్పరా బడుద్దాయి!

దేవ : సరే! నేను వెంటనే బయలు దేరుతాను..నువ్వు జాగ్రత్త. (బొమ్మల్ని లాక్కుంటూ తీసుకుపోతాడు.)

మొ.బొ : చంపుతున్నావురా, వెధవా!

రెం.బొ : నీ చేతులు విరిగిపోనూ.

మొ.బొ : పశువు!

రెం.బొ : అడవి జంతువు.

(వెళ్ళే దాకా ఇవే తిట్లు..పద్మిని అతను వెళ్ళేదాకా చూస్తుంది. తరువాత కొడుకుని చేతిలోకి తీసుకుని)

పద్మిని : పిచ్చి తండ్రీ!...అడవి నట్టనడాన జరిగే జాతర నువ్వెప్పుడు చూడలేదు కదూ?...పద; మనం వెళ్ళి చూద్దాం. దానిని గురించి నీ కెట్లా చెప్పడం? ఎంతని చెప్పడం?

ఇంకా సాంతం తెల్ల వారక ముందే లేత రెమ్మలన నీడలు భూమిమీద ముగ్గులు వేస్తాయి. నక్షత్రాలన్నీ హారతులిచ్చి వెళ్ళిపోతాయి. అప్పుడు పగలు వస్తుంది. ఆనందం పురివిప్పుతుంది. చెట్టు చిటారు కొమ్మల మీద పక్షులు మేలు కొలుపులు పాడతాయి.....ఈకలు రాలుతూ కోడ పందాలు! ఆ ఆటలు, పాటలు! పులుల ప్రేమానురాగాలు. నెమలి నృత్యాలు! నీళ్ళ మీద నడయాడే సూర్యుడి లేత పాదాలు ఆడే దోబూచులు ఆడతాయి.

అడవి మధ్యలో ఓ వీరుడి రధం ఉంది. అంతా బంగారమే! పక్షులు బారులు తీర్చి ఆ రధాన్ని

లాగుతాయి. అడవిలో ఉండే అగ్ని జ్వాలల తోరణాలు దానికి వీర మర్యాదలు చేస్తాయి. ఇహ రాత్రి వస్తుందా – బాబు అప్పటికి అలిసి పోయివుంటాడు గదా! మెల్లగా ఊపుతుంటే చంద్రుడు వెళ్ళిపోతాడు.....మనం అక్కడికి వెళ్ళే ముందర ఓ పని చెయ్యాలి...జాతర జరిగే చోటకి దూరంగా ఓ అమ్మవారి పూల చెట్టు ఉంటుంది. ముత్తయిదువు పూల చెట్టు.....చాలా పురాతనమైన చెట్టు.....మనకి పాత నేస్తం .......దాన్ని మనసారా పలకరించాలి....సరేనా?

(పిల్లవాడితో బయటకు వెడుతుంది....చాల సేపు అయ్యాక కపిలుడు వస్తాడు.....ఇప్పుడు బలంగా ఉన్నాడు)

భాగ : ఎవరది? కపిలుడా?

కపిల : అవును.

భాగ : ఎన్నాళ్ళయింది మనం కలుసుకుని?

కపిల : అవును.

భాగ : ఎక్కడున్నావు ఇప్పుడు?

కపిల : ఇక్కడే!

భాగ : ఇక్కడా? ఈ అడవిలోనా? మనుషులుండే చోటా ఇది?

కపిల : మృగాలు ఉంటున్నాయి. మనుషులు ఉండలేరా?

భాగ : ఏం చేస్తున్నావు?

కపిల : బతుకుతున్నాను.

భాగ : పట్నం నుంచి ఏమన్నా కబుర్లు తెలుస్తున్నాయా?

కపిల : చాలా కాలం అయింది. నన్ను తిరిగి రమ్మని కబురు చేశాడు నాన్న. నేను రానని చెప్పాను. తాను కూడా ఇక్కడికి రానక్కర్లేదని కబురు చేశాను....అంతే!

భాగ : అయితే – కిందటేడు మీ నాన్న చనిపోయాడని..మొన్న – మీ అమ్మ కూడా పోయిందని నీకు తెలియదా?

కపిల : (ఏ ఉద్వేగమూ లేకుండా) లేదు.

భాగ : పద్మినికి కొడుకు పుట్టాడు.

కపిల : అట్లాగా!

భాగ : ఇంకా ఈ కోపం ఎందుకు కపిలా?

కపిల : కోపమేమిటి?

భాగ : ఆ నిలబడడం, ఆ చూడడం, ఆ మాట్లాడడం –

కపిల : అదంతా నీ కవిత్వం! (కదులు తాడు)

భాగ : కపిలా!.....కపిలా!!

(రంగస్థలం చుట్టి వచ్చి గొడ్డలితో చెట్టు నరుకుతూ ఉంటాడు. పద్మిని వచ్చింది, పిల్లవాడితో......కపిలుడిని చూసి ఆగిపోయింది. కొంతసేపయాక కపిలుడు చూశాడు. నిర్ఘాంతపోయాడు)

కపిల : (మెల్లగా) నువ్వా!

పద్మిని : అవును.

కపిల : ఇక్కడా!

పద్మిని : నా కొడుకుకి నదితోపాటు నవ్వడం, చలికి వణకడం, కాళ్ళకు ముళ్ళు గుచ్చుకుంటే బాధపడడం – ఇవేవీ తెలియదు. అందుకే బయటకు తీసుకువచ్చాను....అడవిలో దోవ తప్పాను.

కపిల : ఇంత దూరం తప్పవలసింది కాదు.

పద్మిని : తప్పుదోవ నా కాళ్లను పట్టుకుని వదిలింది కాదు.

కపిల : ఆదే! ఇంత దూరం తప్పవలసింది కాదు. అడవి మృగాలు...దొంగలు!.....చిక్కిరి బిక్కిరిగా ఉండే దోవలు..అన్నీ ప్రమాదాలే!

పద్మిని : దోవలో....ఊళ్ళో వాళ్ళని అడిగాను......యాత్రికుల్ని అడిగాను.......వేటగాళ్ళని అడిగాను.....కొండ జాతి వాళ్ళను అడిగాను.......ఇంకా ఎవ్వరూ కనిపించక పోవడంతో నన్ను నేనే అడిగాను. ప్రతివాళ్ళు నేను పట్టుకున్న తప్పుదోవని తప్పిపోకుండా సాయం చేశారు.

(నిశ్శబ్దం)

కపిల : నీ కొడుకా!

పద్మిని : ఆ!....నీ కొడుకు కూడా!

కపిల : నా కొడుకా!

పద్మిని : ఈ పిల్లవాడిని నాకిచ్చింది నీ శరీరమే!

కపిల : నా శరీరమా? (కోపంగా) నా శరీరం కాదు. నేను కపిలుణ్ణి పద్మినీ!........ఆ రోజున దానిని నేను ఒప్పుకోలేదు. ఇవాళ ఒప్పుకుంటున్నాను.....నేను కపిలుణ్ణి!

పద్మిని : ఎట్లా వున్నావు కపిలా?

(భాగవత పాడడం ప్రారంభిస్తాడు)

రెక్కలను విప్పారసాచి
క్రింది నేలను కాలదన్ని
ఆకసంలో కెగిరిపోయాను
ఏడేడు లోకాల్ చుట్టివచ్చాను
ఒడిలో పాపడు ఉండె
తొడమీద మగడుండె
పెదిమాలు ఎరుపెక్కె
విధిరాత ఏమిటో
ఎరుగనేర్వక నుంటి!!

కపిల : నేను పిల్లవాడిని చూడవచ్చా?

పద్మిని : అందుకేగా నేను వాడిని తీసుకువచ్చింది!

(కపిలుడు పిల్లవాడిని చూశాడు)

కపిల : ఏమైంది నాకు?.....నువ్వు ఇంతదూరం నడిచి వచ్చావు! నేను నిన్ను కూర్చోమని కూడా అడగలేదు... లోపలికిపోయి కాసేపు విశ్రాంతి తీసుకో –

(పిల్లవాడితో లోపలికి వెళ్ళింది. అతడు నిశ్చలంగా నిలబడి వున్నాడు. పిల్లవాడు లేకుండా వస్తుంది పద్మిని.)

కపిల : కాసేపు –

పద్మిని : నాకు విశ్రాంత అక్కరలేదు. (నిశ్శబ్దం)

కపిల : ఎట్లా వున్నావు?

పద్మిని : బాగానే వున్నాను.....జబ్బులు, ఇబ్బందులు, సమస్యలు ఏమీ లేవు.

కపిల : నీ కొడుకు అంతా నీలా ఉన్నాడు.

పద్మిని : (ఒక్క క్షణం ఆగి) నీలాగా కూడా!..బుజం మీద పుట్టుమచ్చ కూడా – నీలాగా!

కపిల : ఏ పుట్టుమచ్చా?

పద్మిని : (చూపుతూ) ఇదే!

కపిల : అలాగా! నేను చూడలేదు....ఈ శరీరాన్ని ఎక్కువగా చూసుకోను.

పద్మిని : దాన్ని అంత అసహ్యించుకుంటావా? (మాట్లాడడు..) దాన్ని ఎందుకంత క్షోభపెట్టావు?

(అతని చేతిని తనచేతిలోకి తీసుకుంటుంది)

ఇది నీకు వెళ్ళినప్పుడు – మెత్తగా, మృదువుగా రాకుమారుడి వంటిలా వుండేది....ఇప్పుడు చూడు!.....నీ ఒంటిని నువ్వే ఇట్లా ఎందుకు చేసుకున్నావ్?త

కపిల : ఈ శరీరం నాకు వచ్చినప్పుడు అది నా తలకు వేళ్ళాడే శవంలాగా ఉండేది....ఎంతైనా దేవదత్తుడి శరీరం కదా! అడవుల్లో వుండడం అలవాడు లేనిది. గొడ్డలి ఎత్తితే బుజాలు ఈడ్చుకుపోయేవి. కాస్త దూరం పరిగెడితే కాళ్ళు చచ్చుబడేవి.....అటువంటి శరీరంతో నాకు ప్రయోజనం లేదు.....అది నా దగ్గరకు వచ్చినప్పటి నుంచీ మా యుద్ధం మెదలైంది....

పద్మిని : ఎవరు గెలిచారు?

కపిల : నేనే!

పద్మిని : శిరస్సే ఎప్పుడూ గెలుస్తుంది అవునా?

కపిల : నిజమే! అదృష్టం కొద్దీ!! ఇప్పుడు సునాయాసంగా పదిమైళ్ళు పరిగెత్తగలను. వర్షాకాలం వరదల్లో ఏటికి ఎదురీదగలను. మర్రి చెట్టునైనా ఒక్కణ్ణే నరకగలను..ఒకప్పుడు నా కడుపే నాకు ఎదురు తిరిగేది...ఇప్పుడు – ? నేను ఏం పెట్టినా అరిగించుకుంటుంది. పెట్టకపోతే అల్లరి చెయ్యదు.

పద్మిని : ఎప్పుడూ శిరస్సే గెలవాలా?

కపిల : అందుకేగా నేను అప్పుడు–ఇప్పుడూ కూడా కపిలుణ్ణి! తన శిరసుకు అనువైన శరీరం ఉన్న కపిలుణ్ణి!

పద్మిని : ఎంతటి ఆనందం! ఈ నాడెంతటి ఆనందం!!

ఈ పాట జ్ఞాపకం ఉందా నీకు? మనం కాళీ ఆలయంలో పాడుకున్నాం.

కపిల : అయితే?

పద్మిని : ఏమీ లేదు. ఇది నాకు తరుచు జ్ఞాపకం వస్తూ వుంటుంది. ఇప్పుడు అదే నా ఆత్మకథ! కపిలుడు, దేవదత్తుడు! కపిలుడి శరీరంతో దేవదత్తుడు! దేవదత్తుడి శరీరంతో కపిలుడు! ఒక్క జీవితంలో నలుగురు మగవాళ్ళు!

కపిల : (హఠాత్తుగా) అతని దగ్గరనుంచి ఎందుకు వచ్చేశావు?

పద్మిని : ఏం చెప్పమంటావు నన్ను? (ఇద్దరూ కదలకుండా ఉండిపోయారు)

భాగ : నీకు అర్థమయ్యేలా చెప్పడం ఎట్లా? దేవదత్తుడు ఒక్కసారిగా మారిపోయి తన పాత శరీరాన్ని పొంది వుంటే బహుశా: నిన్ను పూర్తిగా మరిచిపోయి వుండే దాన్నేమో..కాని అలా జరగలేదు. రోజురోజుకూ మారుతూ వచ్చాడు. అంగుళం అంగుళం....అతను మారుతున్న కొద్దీ నిన్ను వదిలించుకోలేకపోయాను. అదీ కపిలుడి కి పద్మిని చెప్పాలనుకున్న మాట! ఇంకా చాలా చెప్పాలి..ఏమీ దాచిపెట్టకుండా చెప్పాలి. "లేదా ఒకవేళ ఆ రుషి నన్ను నీకిచ్చి వుంటే దేవదత్తుడి దగ్గరకి ఇలాగే వెళ్ళివుండే దాన్నా?" కాని అదేమీ చెప్పలేదు.....మౌనంగా ఉండిపోయింది.

కపిల : ఇక్కడికెందుకు వచ్చావు?

పద్మిని : నిన్ను చూడాలి. అందుకు.

కపిల : ఎందుకు? (మాట్లాడదు) ఎందుకు? ఇంతకాలం నాతో నేను జరిపిన యుద్ధంలో గెలిచాననుకున్న ఈ క్షణంలోనే నువ్వెందుకు రావాలి? ఆ జ్ఞాపకాల బాధల్ని సమూలంగా పెకలించివేశానని సంతోషపడుతున్న ఈ క్షణంలోనే నువ్వెందుకు రావాలి? నేనిప్పుడు కపిలుణ్ణి. మోటువాడిని. శిరసుకు శరీరానికి ఏ వైముఖ్యం లేనివాడిని.....ఏం కావాలి నీకు? మరో శిరసు కావాలా?...నా మాట విను. నాకో సాయం చెయ్యి....తిరిగి వెళ్ళిపో.....దేవదత్తుడి దగ్గరకి వెళ్ళిపో.....అతను నీ భర్త. నీ పిల్లవాడికి తండ్రి. దేవదత్త, పద్మిని! పద్మిని, దేవదత్త! అగ్నిసాక్షిగా ఒకటైన జంట! అక్కడ నాకు స్థానమూ లేదు, శాంతీ లేదు....విముక్తీ లేదు....అందుకే – వెళ్ళు...నీకు దణ్ణం పెడతాను వెళ్ళు. (చాలా సేపు నిశ్శబ్దం)

పద్మిని : అట్లాగే వెడతాను....నువ్వు వెళ్ళమంటే!

కపిల : (బాధతో) ఓ భగవంతుడా! వెళ్ళు

పద్మిని : ఎందుకు? ఏం? ఎందుకని?

కపిల : ఎందుకా? ఆనాటి జ్ఞాపకాలు!......ఇదే మాట! నన్ను కూడా 'వెళ్ళిపో' అని మీరన్న మాట!...అవును వెళ్ళు....వెంటనే

పద్మిని : వెడతాను. ఓ చిన్న కోరిక...పిల్లవాడు బాగా అలిసిపోయి నిద్రపోతున్నాడు......చాలా రోజుల నుంచి నా బుజం మీదనే ఉన్నాడు. కొంచెం సేద తీరనీ....వాడు లేవగానే వెళ్ళిపోతాను....(నవ్వి) అవును.....నువ్వే గెలిచావు. దేవదత్తుడూ గెలిచాడు... కాని నేనే రెండు శరీరాలకు అర్థాంగిని! నాది గెలుపూ కాదు, ఓటమీ కాదు.

కపిల : పద్మినీ!

పద్మిని : వద్దు. ఏమీ చెప్పకు....నువ్వేం చెప్పదలుచుకున్నావో నాకు తెలుసు...ఆ మాట నాకు నేనే వేలసార్లు చెప్పుకున్నాను. ఇదంతా నా తప్పే! నేనే....నేనే తలల్ని మార్చాను....అందువల్ల బాధ పడవలసింది నేనే!... నేను రావడం తప్పే! బయలుదేరేటప్పుడు ఆలోచించలేదు. ఆలోచించలేకపోయాను....కనీసం పిల్లవాడు లేచేదాకానన్న నేనిక్కడ కూర్చోవచ్చా?....కూర్చుని నీ వంకనే చూస్తూ నా శేష జీవితం అంతా నా మనసులో నిన్ను పదిలం చేసుకోనా?....నేను ఒక్క మాటకూడా మాట్లాడను....

(చాలా సేపు నిశ్శబ్దం)

కపిల : నువ్వు ఇప్పుడు వెళ్ళినా ఉండినా తేడా ఏమీ లేదు. జరగవలసిన ప్రమాదం జరిగేపోయింది...ఆనాటి అజ్ఞాత జ్ఞాపకాలను నా చర్మం పొరల్లో పాతి పెట్టాను.....నా పంజాతో వాటిని మళ్ళీ బయటకు పెళ్ళగించావు!

పద్మిని : ఎవరైనా దేనినైనా ఎందుకు పాతిపెట్టాలి?

కపిల : ఎందుకు పెట్టకూడదు? ఈ అసమగ్రతని ఎవరైనా ఎందుకు భరించాలి?

పద్మిని : ఎవరి అసమగ్రత? నీదా?

కపిల : అవును. నాదే! ఒక శరీరాన్ని మనకు కావలసినట్లు మలుచుకోవచ్చు కాని అందులో ఉన్న జ్ఞాపకాల్ని మలుచుకోలేము....ఆశ్చర్యం కాదూ, శరీరానికి కూడా జ్ఞాపకాలుండడం? ఆ భూతాలు మనల్ని వెంటాడడం? ఒక స్పర్శ..చేతులతో ఉయ్యాలలూగే శరీరం జ్ఞాపకాలు.....వెచ్చని చర్మం......ఈ అరచేతిలో – ఎవ్వరూ గుర్తించలేని, అర్థం చేసుకోలేని, ఇది ఫలానా అని నిర్థిష్టంగా చెప్పుకోలేని జ్ఞాపకాలు.........అవి జరిగినప్పుడు ఈ శిరస్సు లేకపోయినా –

పద్మిని : కపిలా?

కపిల : ఎందుకు వచ్చావు? నువ్వు వచ్చావు. నన్ను ముట్టుకున్నావు. నా చేతిని పట్టుకున్నావు! నా శరీరం నీ స్పర్శను గుర్తించింది. నిన్ను నేనెప్పుడూ ముట్టుకోలేదు. కాని ఈ శరీరం ఈ శరీరం పాత జ్ఞాపకాల సంతోషాన్ని తనముందు పరుచుకుంది.......వాటికి నేను పరాయివాడినే!

పద్మిని : కపిలా?

కపిల : నాకు నీ సానుభూతి అక్కరలేదు.

పద్మిని : అంతటితో ఆపు. మూర్ఖుడా! ఒక నదిలో నీ శరీరం స్నానం చేస్తుంది. జలకాలాడుతుంది. నాట్యం చేస్తుంది.....ఆ నదేమిటిఓ, ఆ జలకాలేమిటో నీ శిరసుకు తెలియక్కరలేదా? నీ శిరసు కూడా ఆ నదిలో మునగాలి. అది నీ జుట్టును చెదరగొట్టాలి. నీ చెవుల్ని తన రొదతో హోరెత్తించాలి....నీ తలని తన గుండెలకి చేర్చుకోవాలి.....అది జరిగే దాకా నువ్వు అసమగ్రంగానే ఉండిపోతావు.

(కపిలుడు తల ఎత్తి ఆమె వంక చూస్తాడు. ఆమె అతని మొహాన్ని తన చేతిలోకి తీసుకుంటుంది. అతని గుండెలమీద తలపెట్టుకుంది.)

కపిలా! నా పిచ్చి కపిలా! నిన్ను నువ్వు ఇంతగా ఎందుకు హింసించుకున్నావు?

(కపిలుడు ఆమెను ఎత్తుకుని లోపలకు తీసుకుని వెడతాడు)

భాగ : నీటిమీద చిత్రం గీయడం అసాధ్యం

దానిని కత్తితో గాయపరచడం అనూన్యం
అందుకే – అందుకే –
నదికి జ్ఞాపకాల భయం లేదు.

**స్త్రీల బృందగానం:**

జలపాతం ఆకర్షణ
నదికెపుడూ అనుభవం
కిలకిల నవ్విస్తుంది
ఒడ్డున ఒరుసుకుపోయే
పూలను కవ్విస్తుంది.
సుగిగుండం నాభిలో
ఎండిన ఆకుల్ని ముంచి
తరగలుగా ఆడిస్తుంది.
పల్చని లోతుల అడుగున
వెండి తాళ్ళ వలనేసిన
నీట పామునల్లుతుంది
నాచు కంబళి మీద
వెదురు టాకుల మీద
భయపడ్డ కప్పలతో
ఆడుతూ పాడుతూ
గెంతుతూ నడయాడుతుంది!!

**భాగ :** మరి. అటు చూశావా
ఒడ్డునున్న దిష్టిబొమ్మ
మట్టికుండ శిరసుమీద
మాసిన ముఖవర్చస్సు
మేని నిండ తూట్లుపడ్డ
జ్ఞాపకాల గాయాలు.

(దేవదత్తుడు వస్తాడు. ఒక చేత్తో ఒక కత్తి, రెండో చేత్తో బొమ్మలు)

**భాగ :** ఎవరు? దేవదత్తుడా?

**దేవ :** ఇక్కడ కపిలుడెక్కడ వుంటాడు?

**భాగ :** ఎట్లావున్నావు?

**దేవ :** మీకు చెప్పాలని లేకపోతే చెప్పకండి....నా అంతట నేనే కనుక్కోగలను.

**భాగ :** (ఆగి) ఆ చెట్ట వెనక.

దేవ : పద్మిని ఎన్నాళ్ళయింది వచ్చి?

భాగ : నాలుగైదు రోజులు!

దేవ : ఆశ్చర్యం! నా లాంటి మగవాడికే ఈ దోవన రావడం కష్టమయిందే! ఎంత తొందరగా వచ్చింది! అది కూడా చేతిలో పిల్లవాడితో!!

భాగ : దేవదత్తా! (దేవదత్తుడు నడుస్తాడు)

దేవదత్తుడు ముందుకు నడిచాడు. ఇప్పుడతనికి అర్థం అయ్యే మాటలు రెండే! కపిల, పద్మిని!! ఆ మాటలే వరదల వెల్లువై అతన్ని కపిలుడి గుమ్మం దాకా తీసుకువచ్చాయి.......కాని అకస్మాత్తుగా ఆగిపోయాడు......ఇప్పటి దాకా కపిలుడి రక్తం కోసం ఉవ్విళ్ళూరాడు. కాని తీరావచ్చాక – శాంతంగా, నిశ్చేష్టుడై ఉండిపోయాడు.

(కపిలుడు వాకిట్లోకి వచ్చాడు)

కపిల : రా, దేవదత్తా! నీ కోసమే ఎదురు చూస్తున్నాను.....నిన్నటినుంచీ! ప్రతి అరగంటకీ వాకిట్లోకి వచ్చి చూస్తున్నాను, నువ్వు వచ్చావేమోనని, భయం కాదు ఆతృత.........

(పద్మిని వాకిట్లోకి వచ్చి వాళ్ళిద్దర్నీ చూస్తూ నిలబడ్డది)

కపిల : (దేవదత్తుడితో) నువ్వు సరిగ్గా ఇది వరకులానే వున్నావు.

దేవ : (నవ్వి) నువ్వు కూడా!

కపిల : (కత్తిని చూస్తూ) ఏమిటది?

దేవ : (బొమ్మలున్న చేయి చూపుతూ) బొమ్మలు. నేను జాతర నుంచి వస్తున్నాను. ఇవి పిల్లవాడి కోసం. ఇంటికి వెళ్ళాను. ఎవ్వరూ లేరు. అందుకుని ఇక్కడకి వచ్చాను.

(పద్మిని మాట్లాడకుండా వచ్చి బొమ్మల్ని తీసుకుని వెనక్కి వెళ్ళి నిలబడ్డది)

కపిల : రా! లోపలకి వచ్చి కాసేపు విశ్రాంతి తీసుకో.........తరువాత ఎంతసేపైనా మాట్లాడుకోవచ్చు. (అక్కర్లేదని తల వూపుతాడు) ఏం? నీ మీద కోపమా?

దేవ : ఇప్పుడు లేదు. (నిశ్శబ్దం) నా శరీరం నిన్ను బాగా ఇబ్బంది పెట్టిందా?

కపిల : మొరాయించింది. దాని పగ కూడా తీర్చుకున్నదిలే!

దేవ : అట్లాగా!

కపిల : నీ కల్పనలకి, నీ కవిత్వానికి నువ్వంటే నాకు అసూయగా ఉండేది. నాకు ఆకాశమంటే ఆకాశమే! చెట్టు అంటే చెట్టే! నీ శరీరం నాకు కొత్త అనుభూతుల్ని నేర్పింది. కొత్త మాటలు నేర్పింది. ఇదివరకు ఎన్నడూ లేదు, మేలుకుని ఆలోచించడం! అంతేనా? పిచ్చే వెర్రో కవిత్వం రాయడం!!

(ఇద్దరూ నవ్వుతారు)

దేవ : నాకు నీ బలం కావాలని ఉండేది. కాని నీ కరుకుతనం కాదు. నువ్వేమో అసహ్యంతో బతికావు. నేను భయంతో బతికాను.

కపిల : కాదు కాదు. నేనే భయంతో బతికాను.

దేవ : ఏమిటి ఈ కలగాపులగం? మాయలు లేవు.......(నవ్వుకున్నారు)

ఒక్క విషయం చెప్పు.......నువ్వు నిజంగా పద్మినిని ప్రేమిస్తున్నావా?

కపిల : అవును.

దేవ : నేను కూడా –

కపిల : నాకు తెలుసు. (నిశ్శబ్దం) దేవదత్తా! మన ముగ్గురం కలిసి బతకలేమా? పాండవులు, ద్రౌపది లాగా?

దేవ : నువ్వేమనుకుంటున్నావు?

(నిశ్శబ్దం. పద్మిని ఇద్దర్నీ చూస్తుంది. కాని మాట్లడదు.)

కపిల : అట్లా జరిగే వీలులేదు.

దేవ : అందుకే (కత్తి చూపుతూ) దీనిని తెచ్చాను. ముగింపులేని దానిని ఖండించవలసిందే!

కపిల : అవును. నాకు నీ శరీరం వచ్చింది కాని, నీ తెలివితేటలు రాలేదు.

దేవ : అయితే నీ కత్తి ఏది?

కపిల : ఒక్క నిమిషం ఆగు.

(లోపలికి వెళ్ళాడు. పద్మిని దేవదత్తుడిని చూస్తున్నది. అతను ఎక్కడో చూస్తున్నాడు)

భాగ : అర్ధరాజ్యం, ద్రాక్షస్రవం! మాటా మంతీ, ఆటాపాటా
అన్నీ ఇంద్రుడితో పంచుకుని! తిరిగొచ్చానీ భూమ్మీదికి
వస్తూనే చూశాను దూరంనుంచి
భూమి ముఖం మీద కనిపించిన! చీలికని – సరిగ్గా ఇంద్రుడి నవ్వులా!

(కపిలుడు కత్తితో వస్తాడు........ఇద్దరూ యుద్ధానికి సన్నద్ధం అయ్యారు)

కపిల : ఇంకా సాధన చేస్తున్నావా?

దేవ : అబ్బే! లేదు.....నువ్వు –

కపిల : మళ్ళీ నేర్చుకున్నాను......

దేవ : ఇప్పుడు కత్తి యుద్ధంలో ఎవరు గొప్ప అని ఆలోచనలేదు.

కపిల : అవును.

దేవ : దీనికి ఒకటే పరిష్కారం.

కపిల : మనం ఇద్దరం ఈ కత్తులకు ఎరకావాలి.

దేవ : ఇద్దరం చచ్చిపోవాలి........

కపిల : ఆ దేవాలయంలో మనం ఇద్దరం ఎంతటి నమ్మకంతో మన తలలు నరుక్కున్నాం! ఇప్పుడు? ఎవరితల? ఎవరి శరీరం? ఆత్మ హత్యా? హత్యా? ఏదీ స్పష్టంగాలేదు..........

దేవ : ఇప్పుడు స్నేహానికి ఆస్కారం లేదు. జాలికి అవకాశం లేదు...సింహాల్లా పోట్లాడాలి. తాచు పాముల్లా చంపుకోవాలి.

కపిల : ఏ చేతులతో కాళీ ఆలయంలో మన తలలు తెగిపడ్డాయో, అవే చేతులు ఇప్పుడు కూడా మనల్ని

నరకనీ! –

(సంగీతం.....నృత్య రూపంలో యుద్ధం......కత్తులు కలవవు.........పద్మిని కదలికలు కూడా నృత్యంలా)

(ఇద్దరూ ఒకరినొకరు గాయపరుస్తారు. ఇద్దరూ చనిపోతారు)

(చాల సేపు నిశ్శబ్దం.....పద్మిని వారి శరీరాల మధ్యకువచ్చి కూర్చుంది)

పద్మిని : ఈ ఇద్దరూ కలిసి జీవించారు. పోట్లాడుకున్నారు. కౌగలించుకున్నారు. మరణించారు. "మీ ఇద్దరితో కలిసి జీవిస్తానని" నేనంటే ఏమన్నా బ్రతికే వారేమో?.....కాని నాలో ప్రవహించే ప్రతి రక్త కణం చెప్పింది – మీరిద్దరూ కలిసి జీవించేవాళ్ళు కాదని.....మీకు మరణం అంటే తెలుసు కనుక ఒకరి చేతుల్లో మరోకరు చనిపోయారు.....బ్రతికుంటే ఒకరినొకరు చీల్చి ముక్కలు ముక్కలుగా చేసుకునేవారు....మిమ్మల్ని మరణం వైపుకు లాక్కుపోయింది నేనే! మీరు ఒకరి నొకరు క్షమించుకున్నారు..మళ్ళీ మళ్ళీ – నన్ను మాత్రం ఒంటరిగా వదిలేశారు........

భాగ : (లేవకుండానే) అమ్మా! ఎంత ఘోరం!.....నీకేమన్నా సాయం చేయగలనా?

పద్మిని : (అతని వంక చూడకుండా) దయచేసి గుడిసెలో లోపల నిద్రపోతున్న నా కొడుకుని మీ సంరక్షణలో ఉంచండి. ఆ తరువాత అడవిలో ఉన్న వేటగాళ్ళ కివ్వండి – కపిలుడి కొడుకని.....వాళ్ళకి కపిలుడంటే ప్రాణం. అందుకని వాడిన పెంచుతారు. ఈ నదులతో, చెట్టు చేమలతో వాడిని పెరగనివ్వండి. ఐదేళ్ళు రాగానే ధర్మపురిలోని విద్యాసాగరుల వారికి అప్పచెప్పండి – దేవదత్తుడి కొడుకు – అని.

భాగ : మరి నువ్వు?

పద్మిని : మాకు పెద్ద చితిని ఏర్పాటు చేయండి....మేం ముగ్గురం!

భాగ : నువ్వు సహగమనం చేస్తావా?

పద్మిని : (బొమ్మల్ని కిందపెట్టి) వీటిని నా కొడుకుకు ఇవ్వండి...వాడిని నేను చూడను. నా దారినుంచి నన్ను మళ్ళించగల ఆకర్షణ వాడి ఒక్కడిలోనే ఉంది.

(ఇద్దరూ మనుషులు తెర తెస్తారు.)

అమ్మా! కాళీమాతా! ఇప్పుడు కూడా నీకు నవ్వులాటగానే ఉందా? వచ్చే జన్మలో కూడా నాకు ఈ పతినే ప్రసాదించు అని అందరు స్త్రీలు ఈ సమయంలో ప్రార్థిస్తారు. నాకు ఆ కాస్త మానసిక ఆనందం కూడా లేకుండా చేశావు కదూ?

(తెర తెస్తారు)

స్త్రీల బృందగానం:

పోయిరావే తల్లి పోయిరా మా చెల్లి
చందనపు పల్లకీ ఎక్కి పోవమ్మా
అగ్నిలా మెరిసేటి పగడాల పరుపెక్కి
బంగారు రేకులా పూవులూ ధరియించి
ప్రేమతో మండేటి దండల్ని మెడదాల్చి

పయనమైనా తల్లి పోయిరావమ్మ!
ముత్తయిదు పూచెట్టు విరిదండ కట్టంగ
మకరంద పుష్పాలు దారులే చూపంగ
జాజుల్లు మల్లెలు వెలుగులే నింపంగ
పోయిరాలే తల్లి పోయిరా మా చెల్లి
భయమన్న దెరుగక బాధంటి వెరవొక ॥పోయిరావే॥

భాగ : ఆ విధంగా పద్మిని సతి అయింది......భారతదేశం ప్రతి వ్రతల పుణ్యభూమి. కాని పద్మిని బాటలో వెళ్ళిన వారు ఎవ్వరూ లేరంటే అతిశయోక్తి కాదు. ఆమె ఎక్కడ సహగమనం చేసిందో ఎవరికీ తెలియదు. అడవిలో ఉండే ఆటవికుల్ని అడిగితే విరబూసే ఓ ముత్తయిదు పూటచెట్టును చూపిస్తారు. ఇప్పటికీ ప్రతి పౌర్ణమికి రాత్రిపూట అక్కడనుంచి ఓ పాట బయలుదేరి చక్కని చిక్కని పరిమణంలా ఆ అడవిని పెనవేసుకు పోతుందంటారు!

(ఇది ఆ ముగ్గురి జీవిత గాథ)

స్త్రీల బృందగానం:
ఒక్క మేనువాసనకే ప్రేమంటుకు పోవాలా?
కోరికల మానకు విరులెన్నో పూయవా?
ప్రతి మానుకు ఒక పువ్వే ఇష్టమంటే చెల్లేనా?
అయినా
ప్రతి గుండెకు ఒక శిరసు ప్రతికంటికి ఒక పాప
ప్రతి చేతికి ఒక పక్క –
బాధలేదు; సిగ్గసలే లేదు.
భూమిలోకి పోసిన రక్తం
ఆకసాన మోసువెత్తు పాడగా॥

(పాట అయిపోయేసరికి భాగవత ప్రేక్షకులకు నమస్కారం చేస్తాడు. నాటకం అయిపోయిందనే ప్రేక్షకుల భావన. ఇంతలో లోపలనుంచి ఓ పెద్ద శబ్దం.)

భాగ : ఏమిటా చప్పుడు? ఓ!....మా నటుడు!

(నటుడు 2 పరిగెత్తుకుంటూ వస్తాడు. భాగవతని కూడా చూడడు)

ఎందుకట్లా పరిగెడుతున్నాడు?.....జాతీయగీతం పాడరేం?

(నటుడు ఆగిపోతాడు)

నట2 : జాతీయ గీతమా?

భాగ : ఏమిటి?

నట2 : మీకెట్లా తెలుసు?

భాగ : ఏమిటి తెలియడం?

నట2 : అయ్యా! గురువుగారూ! మీ కెట్లా తెలుసు?

భాగ : తెలియడం ఏమిటయ్యా?

నట2 : అదే! జాతీయ గీతం గురించి!

భాగ : ఏమిటి నువ్వనేది?

నట2 : అయ్యా! మీకు దణ్ణ పెడతాను...మీ కాళ్లు మీద పడతాను. నన్ను ఎగతాళి చెయ్యొద్దు....మీకు జాతీయగీతం గురించి ఎట్లా తెలుసునండీ?

భాగ : అదేమిటయ్యా!......నువ్వు ఆ ప్రేక్షకుల్ని చూడలేదా ఏమిటి?

నట2 : (తేరుకుని) ఓహ్! అదా! రామరామ!.......

భాగ : ఏమయిందేమిటి?

నట2 : ఏమయిందా? శ్రీహరీ!.......చూడండి –

(చేయి చూపుతాడు.....అది వణకుతోంది.)

భాగ : ఎందుకు అట్లా వణుకుతున్నావ్?

నట2 : భయంతో చచ్చిపోతున్నాననుకోండి?

భాగ : ఏమయింది?

నట2 : ఆ దారిన వస్తున్నానా – ఎవరో పాడడం వినిపించింది. పెద్ద గొంతుతో! ఏం పాటలో తెలుసా? 'వందేమాతరం', 'ఝుండా ఊంఛా రహే హమారా', 'సారే జహాసే అచ్ఛా' ఆ తరువాత 'జనగణమన' –

భాగ : అయితే?

నట2 : ఇంత రాత్రివేళ ఈ దేశభక్తుడు ఎవరా అని చూశాను. ఒక ఇల్లు....ఎత్తుగా ఒత్తుగా దడి. ఎట్లాగో ఓ చిన్న కంతచేసి చూశాను....అక్కడ –

భాగ : ఆ! అక్కడ? ఏం చూశావు? చెప్పు.

నట2 : ఓ.......ఓ......గుర్రాన్ని....

భాగ : గుర్రాన్నా?

నట2 : ఆ! అది నా వంక చూసి "మిత్రమా ఇప్పుడు నేను జాతీయగీతం పాడబోతున్నాను......లేచి నిలబడు!" అంది – ఆజ్ఞాపిస్తున్నట్టు!

భాగ : నటా! నువ్వు నిజంగా –

నట2 : నిజం గురువుగారూ! ఒట్టు.

(లోపల కలకలం)

భాగ : అక్కడేమయింది?

(నట–1 ప్రవేశిస్తాడు. ఒక ఆర్నేళ్ల పిల్లవాడితో...ఆ పిల్లవాడు చాలా గంభీంగా ఉన్నాడు. అతన్ని నవ్వించే ప్రయత్నంలో నటుడు వెర్రి మొర్రి చేష్టలు చేస్తున్నాడు.)

ఓ! నటా! నువ్వా!

నట1 : గురువుగారూ! మీరా?

భాగ : నీకు నూరేళ్ళు ఆయుష్షు.

నట1 : అదేమిటి స్వామీ! ఏం చేశాను నేను?

భాగ : ఇప్పుడే నిన్ను గురించి అనుకున్నాను.....ఇప్పుడే ఈ నటుడు గుర్రం తల ఉన్న మనిషిని చూశానంటేను మన హయవదన జ్ఞాపకం వచ్చాడు.....అప్పుడు నిన్ను గురించి కూడా అనుకున్నాను.

నట2 : గురువుగారూ!

నట1 : (రెండో నటుడిని పట్టించుకోకుండా) అదే స్వామి! నటుడి జాతకం! ఎప్పుడూ మరెవర్నో జ్ఞాపకం చేస్తూ బ్రతకాల్సిందే!

భాగ : హయవదన ఎక్కడ? తిరిగి వచ్చాడా?

నట1 : నాకు తెలియదు స్వామీ! కాళీ ఆలయం చేరుకున్నాక నన్ను వెళ్ళిపొమ్మని తరిమాడు ఒక్క నిమిషం అక్కడ ఉండనివ్వలేదు.

భాగ : అమ్మవారు అతని కోరికను నెరవేర్చిందనే అనుకుంటాను. (పిల్లవాడిని చూసి) ఈ పిల్లవాడెవరు?

నట1 : ఈ పిల్లవాడా? (ఆ పిల్లవాడితోనే) చెప్పు; నువ్వెవరో?

(పిల్లవాడు ఏ ప్రశ్నకీ సమాధానం చెప్పడు.)

భాగ : ఎవరు బాబూ నువ్వు?.....నీ పేరేమిటి? మీ అమ్మా, నాన్నా ఎక్కడ?

నట1 : చూశారుగా!....మాటా పలుకులేదు. ఈ ఈడు పిల్లలంతా పుస్తకాలు పుస్తకాలు మాట్లాడుతారు. ఈయన గారినోటంట ఒక్క ముత్యం ఊడిపడదు. నవ్వడు. ఏడవడు. మాట్లాడడు....ఇరవై నాలుగు గంటలూ ఇట్లా ఉండడమే!

(వంగి, నవ్వించే ప్రయత్నం చేశాడు)

చూశారా! అస్సలు ఉలకడు పలకడు. పెద్దయింతర్వాత పెద్ద నాటక విమర్శకుడౌతాడు!

నట2 : (విసుగ్గా) గురువగారూ!

భాగ : (నట1 తోనే) ఎక్కడ కనిపించాడు?

నట1 : ఒక ఆటవికు గూడెంలో! జాతరనుంచి తిరిగి వస్తూంటే ఒక రాత్రి ఆ గూడెంలో ఒక పెద్దావిడ ఈ కుర్రాడిని తీసుకువచ్చి, "ఈ పిల్లవాడు మా పిల్లవాడు కాదు. మీ పట్నం పిల్లవాడు మీతో తీసుకుపొండి" అంది.

భాగ : పట్నం పిల్లవాడా!.....ఎంత ఆశ్చర్యం! (ఇంతలో ఆ కుర్రవాడి చేతిలో బొమ్మలు చూస్తాడు) కాని ఈ బొమ్మలు......(ఆ బొమ్మల్ని ముట్టుకోబోతాడు. పిల్లవాడు కోపంగా దూరంగా వెళ్ళిపోతాడు)

నట1 : మిమ్మల్ని ముందుగానే హెచ్చరించాల్సింది. మీరేమయినా చెప్పండి. ఆ బొమ్మల్ని ముట్టుకుంటే మాత్రం ఊరుకోడు...ఒకసారినా వేలు కొరికినంత పనిచేశాడు.

నట2 : అయ్యా! గురువు గారు!

భాగ : (నట1తో) నటా! (మాట్లాడడు. పిల్లవాడితో) బాబూ! ఒకసారి నీ వీపు చూడనీ!

(పిల్లవాడు వెనక్కి వెనక్కి వెళ్ళిపోతాడు)

అబ్బే! నేను నీ బొమ్మల్ని ముట్టుకోను.....ఒట్టు.....నీ వీపు చూస్తాను. అంతే!

(వీపు చూస్తాడు. 'నటా' అంటాడు)

**భాగ :** నటా!.....చూడు ఈ పుట్టు మచ్చ! ఇతను పద్మిని కొడుకు. సందేహం లేదు.

**నట1 :** పద్మినా? ఏ పద్మిని?

**నట2 :** (బిగ్గరగా) అయ్యా గురువుగారూ!

(నట1, భాగవత అతని వంక చూస్తారు)

**భాగ :** ఏమిటి? ఎందుకట్లా అరుస్తావ్?

**నట2 :** అరగంట నుంచీ మిమ్మల్ని పిలుస్తున్నాను.

**భాగ :** నిజమే! ఏమిటి? ఎందుకు?

**నట2 :** ఇందాక మీరు గుర్రం తలతో ఉన్న మనిషి అన్నారే! కాదండీ! నేను చూసింది గుర్రాన్నే! మామూలు గుర్రాన్ని!

(లోపల 'జనగణమన' వినిపిస్తోంది)

అదుగో! అదే....పాడుతోంది!

(గుర్రం పాడుకుంటూ వస్తుంది)

తవ కరుణారుణరాగే
నిద్రిత భారత జాగే
తవచరణే నత మాతా
జయ జయ జయహే జయ

(వచ్చి వాళ్ళ ముందర నిలబడ్డది)

**హయ :** అయ్యా! భాగవతగారూ!..ఓ! నా నటమిత్రమా! ఎట్లా వున్నారు?...కులాసానా?

**భాగ :** నువ్వు......నువ్వు హయవదన?

**హయ :** మీ భృత్యుణ్ణి, నేనే!

**భాగ :** మరి ఇదేమిటి?

**నట2 :** మీకు ఈ గుర్రం తెలుసా?

**హయ :** (సకిలింపుతో) మేము పాత స్నేహితులం. (సకిలిస్తాడు)

(అందరూ నవ్వుతారు....ఆ నవ్వుతో పిల్లవాడు కూడా నవ్వడం మొదలు పెడతాడు....ఎగురుతూ, గెంతుతూ నవ్వుతాడు. బొమ్మలు కింద పడ్డాయి)

**పిల్ల :** (చప్పట్లు కొడుతూ) ఓహోహో! గుర్రం నవ్వుతోంది.......గుర్రం నవ్వుతోంది!

**నట1 :** (పిల్లవాడితో) ఏం బాబూ! నువ్వు నవ్వొచ్చు. కాని మేము నవ్వకూడదా? (నవ్వుతూ)

(పిల్లవాడు ఇంకా గట్టిగా నవ్వుతాడు)

భాగ : హయవదనా! ఇతను పద్మిని కొడుకు!

హయ : పద్మినా! నాకు తెలియదే!

భాగ : నీకు తెలియదులే! పాపం! ఈ పిల్లవాడు పుట్టినప్పటి నుంచీ నవ్వలేదు, ఏడవలేదు....నువ్వు వచ్చి నవ్వించావు!

హయ : చాలా సంతోషం!

భాగ : అవును......నువ్వు మామూలు మనిషివి కావాలని అమ్మవారి గుడికి వెళ్ళావుగదా! మరి ఇదేమిటి?

హయ : అదంతా పెద్ద కథ...గుడికి వెళ్ళానా – లోపలికి అడుగుపెట్టానో లేదో, ఓ పెద్ద కత్తి....దాన్ని తీసుకుని నా మెడమీద పెట్టుకుని 'అమ్మా! కాళీ! నువ్వు నాకు సాయం చెయ్యకపోతే నా మెడ నరుక్కుంటాను" అన్నాను.

భాగ : ఆ! అప్పుడు?

హయ : అమ్మవారు ప్రత్యక్షమయ్యింది....వెంటనే! కాస్త విసుగ్గా కనిపించింది. "మీ వెదవ తలకాయల్ని నరుక్కోదలిస్తే ఇంకో చోటు కనిపించలేదా?" అన్నది. అమ్మవారి కాళ్ళమీద పడి అమ్మా! నన్ను ఈ అసమగ్రత నుండి కాపాడు. సమగ్రమైన వాణ్ణిగా చెయ్యి" అని ప్రార్థించాను. "అలాగే కానీ" అని చెప్పి అదృశ్యమయిపోయింది.

"నన్ను సంపూర్ణమైన మానవుణ్ణి చెయ్యితల్లీ" అని ప్రార్థించే లోపలే నేను సంపూర్ణ అశ్వాన్నయిపోయాను.

భాగ : అయ్యో!

హయ : బాధెందుకండీ? తానేం చేస్తున్నది అమ్మవారికి తెలియదా? ఒకటి మాత్రం చెప్పగలను.....గుర్రం కావడంలో కూడా కొన్ని ప్రయోజనాలు ఉన్నాయండీ!....(కొంచెం ఆగి) కాని నాకొక్కటే విచారం!

భాగ : ఏమిటది?

హయ : ఆకారంలో సంపూర్ణమైన అశ్వాన్ని అయినాను కాని, సంపూర్ణమైన ప్రాణిని కాలేదు....ఇంకా అప్రదిష్టపాలు చేసే ఈ గొంతు....ఈ మనిషి గొంతు – నన్ను వదలడం లేదు...నన్నేం చెయ్యమంటారు. చెప్పండి......ఈ మనిషి గొంతు పోవడం ఎలా?

భాగ : హయవదనా –

హయ : అందుకే ఈ జాతీయగీతాలు దేశభక్తి గీతాలు......ముఖ్యంగా మన జాతీయగీతం! దాన్ని పాడే వాళ్ళందరి గొంతులూ మూసుకుపోయి వుంటాయని గమనించాను అందుకే – ప్రయత్నం చేస్తూనే వున్నాను...అయినా పని చేసినట్టు లేదు.......(ఏడుస్తాడు)

పిల్ల : ఏడవకు గుర్రం....ఏడవకు......

హయ : ఏడవను, ఏడవను......ఈ పిల్లఆడు చెప్పిందే నిజం.

పిల్ల : ఏడవద్దు....నువ్వు నవ్వితేనే బావుంటుంది.

హయ : ఏడవను......ఏడవను బాబూ! రా, మనిద్దరం కలిసి జాతీయగీతం పాడదాము.

పిల్ల : అదేమిటి?

భాగ : అతనికేం తెలుసు? అడవుల్లో పెరిగాడు?

హయ : పోనీ మరోపాట పాడు.......చూడు! నువ్వు పాటపాడితే నిన్ను నా వీపు మీద ఎక్కించుకుని తిప్పుతాను.

పిల్ల : (ఆనందంగా) ఆ ఆ! తిప్పు.......

హయ : అయితే ఆలస్యం ఎందుకు? నా వీపు మీద ఎక్కు.

(భాగవత పిల్లవాడిని గుర్రం మీద కూర్చో బెడతాడు)

పిల్ల : హై....హై.......

హయ : ఆ! నువ్వు పాటపాడు.....అప్పుడు నడుద్దాం.

భాగ : పాడు బాబూ!

పిల్ల : (పాడుతూ వుండగా గుర్రం మెల్లగా నడుస్తుంది)

వచ్చేను వచ్చేను! రేతౌకడు వచ్చేను
ఏ వూరీవాడో! ఏ పేరూ వాడో
తలమీద పాగాతో! వచ్చేను రేతౌకడు
నిదురాపో ఇప్పుడు! నిదురాపోరా తండ్రీ
గుండె ఎరుపదియేల! కళ్ళ కాయలు ఏల
ఒళ్ళు చల్లా పడితే! ఒళ్ళు చల్లానేల.........

(పాట అయిపోగానే గుర్రం భాగవతుని ముందర నిలుస్తుంది)

హయ : అయ్యో!.....ఈ పాటలో వున్న రౌతు చనిపోయాడనుకుంటాను. నిజమా?

భాగ : అట్లాగేవుంది చూస్తే –

హయ : ఇటువంటి విషాద గీతాన్ని ఎవరు నేర్పారో ఈ పిల్లవాడికి?

పిల్ల : మా అమ్మ.

భాగ : పాటలో ఏముంది. హయవదనా! ఈ కుర్రాడి నవ్వులో ఉంది – అందం అంతా. ఆ నవ్వులో ఉన్న అమాయకత్వంలో ఉంది ఏ విషాదమో దాని దగ్గరకు రాలేదు.

హయ : అంతేనంటారా?

భాగ : ఆ! స్వచ్ఛమైన పసివాళ్ళ నవ్వుకి ఏదీ సాటిరాదు.

హయ : ఏమిటో భాగవతారు గారూ! మీ మాటల్ని నేను నమ్మలేనండి. అంతేకాదు. ఇటువంటి అర్థంలేని ఆర్ద్రత ఉందే! అదే మన సాహిత్యాన్ని, మన జీవితాన్ని వాస్తవికతను దూరంగా ఉంచుతున్నదనుకుంటాను... అయినా, మీరు కాదూ కూడదంటే నేనూ ఒప్పుకుంటాను.....బాబూ! మరో పాటపాడు.

పిల్ల : నాకురావు.

హయ : అయితే ఆ పాటే మళ్ళీ పాడు.

పిల్ల : నువ్వు ముందు నవ్వు.

హయ : నవ్వాలా?......ప్రయత్నం చేస్తాను.....హ...హో......ప్చ్.నవ్వండం తేలిక కాదు. ఉన్న పళంగా నవ్వడం అంటే!

పిల్ల : (చర్నాకోలుతో అదిమిస్తున్నట్టు) హై.. హై.....పాడు......పాడు

హయ : సరే! సరే! ప్రయత్నం చేస్తాను......
హా.....హా.......హా.......హు....హి.....హీ..........

(నవ్వు సకలింపుగా మారిపోతుంది)

అందరూ : ఏమయింది? ఏమయింది?

భాగ : హీహీహీ......

నట1 : గుర్రం సకిలుస్తోందండీ!

(అతని మనిషి గొంతు పోయింది......ఇప్పుడు సకిలించడం ఒక్కటే తెలుసు......అది తెలిసి ఆనందంతో గంతులు వేస్తుంది గుర్రం)

భాగ : జాగ్రత్త! పిల్లవాడు పడిపోగలడు.......

(కాని గుర్రం చాలా ఆనందంగా గంతులు వేస్తోంది. పిల్లవాడు కూడా)

భాగ : చివరికి హయవదన సమగ్ర, పరిపూర్ణ హయం అయింది. (నటులతో) మీరు ముందు వెళ్ళి విద్యాసాగరుల వారికీ తమ మనవడు విజయంతో ఓ అద్భుతమైన శ్వేతాశ్వాన్ని అధిరోహించి ఇంటికి వస్తున్నాడని కబురు తీసుకువెళ్ళండి.

నట2 : మరి, ఆ బొమ్మలు?

భాగ : పారెయ్యండి......ఇహ వాటితో పనిలేదు.

(నటులు వెళ్ళిపోతారు)

ఆహా! గజముఖుడైన విఘ్నేశ్వరుడి దయావిశేషం అర్థంకానిది గదా! అందరి కోరికలను తీర్చగల దేవుడాయన. తాతగారికి మనమడిని, పిల్లవాడికి నవ్వుని, అశ్వానికి సకిలింపుని – అన్నీ ప్రసాదించగలడు. చేతగాని చేవలేని మన మామూలు మాటలతో ఆయన గొప్పతనం వర్ణించడం సాధ్యమా? రా, హయవదనా రా! ఇంక ఆ ఆట ఆపు....మన నాటకం ముగిసింది. ఈ వేషం తీసేయ్.....నాటకం విజయవంతంగా ముగిసినందుకు ఆ విఘ్న వినాయకుణ్ణి కొలుద్దాం!

(అందరూ నమస్కారం చేస్తారు. తెర వెనక వున్న పద్మిని, కపలి, దేవదత్తుడు కూడా)

ఓ దేవ కరుణించు ధనధాన్య సమృద్ధి
కావ్యశాస్త్రవృద్ధి అన్నింట సమవృద్ధి
పాలకుల కన్నింట విజయమ్ముసిద్ధి
దానితో పాటిమ్ము కాస్తంత బుద్ధి.